# కథా మంజరి

పది కథల సమాహారం



కథా మార్గదర్శి


జయంతి ప్రకాశ శర్మ
సంపాదకుడు

అవసరాల వెంకట రావు
ప్రచురణ కర్త


## 2021 మే నెల సంచిక

© Copyright 2020 - Editorial Board Kathamanjari

కథ



# సుస్వాగతం

కథా మంజరి
పది కథల సమాహారం

# పాఠకుల కథ

పాఠక మహాశయులకు నమస్కారం. కథామంజరి పాఠకులు కథలని నిశితంగా చదువుతున్నారని చాలా మంది, ముఖ్యంగా రచయిత(త్రు)లు, అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇది మాకు చాలా ఆనందాన్ని కలిగించింది. ఈ ఆనందం లోంచి వచ్చిన ఆలోచనే “పాఠకుల కథ”. కొంచెం వివరంగా వెళ్తే ..

మీరు ఎలాగూ కథలు చదువుతున్నారు కదా. అన్నీ చదివేశాకా, అందులో మీకు బాగా నచ్చిన కథ గానీ, నచ్చని కథ గానీ మాకు తెలియచేయాలి. అంటే .. పేరు రాసి పంపించేయడం కాదండీ. నచ్చితే ఎందుకు నచ్చింది, ఏమిటి నచ్చింది విశ్లేషణాత్మకంగా రాసి మాకు పంపించండి. అలాగే నచ్చకపోతే కూడా. మీలో ఉన్న పదునైన విమర్శకుడిని బయటకు తీయండి. తీసి, కథని కోసి, పరిశీలించి .. అప్పుడు మీ వివరమైన మీ విమర్శనని మాకు పంపించండి.

అయితే మాకేంటి?.. అక్కడికే వస్తున్నాం. ఇలా వచ్చిన విమర్శనలలో ఓ మంచి విమర్శనని తరువాతి సంచికలో మీ పేరుతోనే ప్రచురిస్తాం. అది ఆయా రచయితలకు మార్గదర్శకంగా ఉంటుంది.

అవునా?! సరే. మిగతా వివరాలేంటి?.. ఇంక పెద్దగా వివరాలు ఏమీ లేవు. దీన్ని “ఉగాది సంచిక” తో మొదలుపెడదాం. మీ విమర్శనని submit@kathamanjari.inకి 25 వ తేదీ లోగా పంపించండి. మళ్ళీ 1 వ తారీఖుకి వచ్చే కొత్త సంచిక కోసం చూడండి.

సరేనా?

కథామంజరి బృందం

# ఇదీ వరస


| సంఖ్య | విషయం | | పేజీ సంఖ్య |
|---|---|---|---|
| I | మా జట్టు | | i |
| II | కృతజ్ఞతలు | | ii |
| III | కథా కీయం | | iii |
| IV | ఈ నెల విశిష్ట అతిథి | | v |
| V | కథా మార్గదర్శి | | vii |
| | **క థ లు** | | |
| **సంఖ్య** | **కథ పేరు** | **రచన** | **పేజీ సంఖ్య** |
| 1 | నీలాలు | సమ్మెట ఉమాదేవి | 1 |
| 2 | కేశవం – కేశక్లేశం | ఓలేటి శశికళ | 6 |
| 3 | ట్యూబు లైట్ | చాగంటి ప్రసాద్ | 12 |
| 4 | రాగి నీరు | కనకగిరి రాజేశ్వరి | 18 |
| 5 | సుబ్బారావు–ఓ వాహన చోదకుడి కథ | శ్రీపాద సౌదామిని | 22 |
| 6 | అందమైన అంతం | పి వి ఆర్ శివకుమార్ | 26 |
| 7 | వా'రణ' వాహిని | బాడిశ హన్మంతరావు | 29 |
| 8 | విడాకులా? | భాగవతుల భారతి | 31 |
| 9 | కలిసుందాం రండి | లక్ష్మీ గాయత్రి బొంతా | 36 |
| 10 | దేవుడు మావయ్య | చెన్నుపాటి రమేశ్ | 41 |
| విశిష్ఠ అతిథి శ్రీమతి డి. కామేశ్వరిగారికి ఇష్టమైన రచయిత రావిశాస్త్రిగారు.. ఆయన అన్ని కథలూ ఆణిముత్యలే .. ఆ ముత్యాల్లోంచి ఓ కథ .. "లక్ష్మి". కథామంజరి ఈ నెల ప్రత్యేకం.. మీ కోసం! | | | |
| **16** | లక్ష్మి | రావిశాస్త్రి | 45 |



# మా జట్టు

సాంకేతిక సహకారం

కథ

harbinger
PUBLISHING

బొమ్మలు

శ్రీ కోయిలాడ రామ్మోహన రావు

శ్రీ కొచ్చెర్ల వి ఆర్

శ్రీ 'వసంత' కృష్ణ

# కృతజ్ఞతలు

## SPONSORS


## ఈ సంచికకు ఆర్ధిక సహకారం

## OF THE ISSUE

**విహారి**

**అనే**

**శ్రీ జొన్నలగడ్డ సత్యనారాయణ మూర్తి గారు**





# 'కథా'కీయం



ఓ నలభై ఏళ్ళ కిందట... ఇళ్లల్లో పిల్లలు చందమామ, బాలమిత్ర వంటి పుస్తకాల్లో కథలు చదువుకుంటుంటే, పెద్దవాళ్ళు వార, మాస పత్రికలు పట్టుకుని కథలు, సీరియళ్ళు కూడా చదువుకునేవారు. పుస్తకాలు విచ్చలవిడిగా ఇళ్ల మధ్య తిరుగుతుండేవి. విపణిలో దొరికే పుస్తకాలన్నీ కొని చదివే స్తోమత లేకపోవడంతో, వీధుల్లో వంతులు వేసుకుని, ఒక్కొక్కరు ఒకొక్క పుస్తకం కొని, వారు చదివి మిగతా వారికి చదవడానికి ఇచ్చేవారు. అక్కడితో ఆగకుండా, మధ్యాహ్నం పూట ఓ అరుగు మీదకు అందరు చేరి, కథల్ని, సీరియల్ని చదివి వినిపించుకునేవారు. ఆ అరుగుల మీద చూసిన సినిమాని కథ రూపంలో మిగతా వారికి ఎంతో అందంగా, విపులంగా చెప్పేవారు. పెద్దవాళ్లకి తెలియకుండా హైస్కూల్ విద్యార్థులు, కాలేజీ విద్యార్థుల డిటెక్టివ్ పుస్తకాలనూ, సినిమా పుస్తకాలనూ రహస్యంగా చదివేవారు. మంచి కథలను, సీరియల్ నవలను కత్తిరించి, వాటిని అందంగా బైండు చేసి ఇళ్ళల్లో దాచుకునేవారు. మధ్య తరగతి కుటుంబాల ఇళ్ళల్లో కూడా పుస్తకాలకో ప్రత్యేక బీరువా ఉండేది. అలా తెలుగు కథ తెలుగు వారి లోగిళ్లల్లో నిత్యం తిరుగాడుతూ కళకళలాడుతూ ఉండేది. గ్లోబలైజేషన్ తర్వాత వచ్చిన మార్పుల్లో బాగా దెబ్బతిన్నది పుస్తక పఠనమే. మనిషి ఆలోచనలు, అలవాట్లలో మార్పులు ఒకవైపు, సాంకేతిక అభివృద్ధి మరోవైపు .. మనిషిలో ఉండే చదివే అలవాటుకి తూట్లు పొడిచాయి. కాలానుగుణంగా వచ్చే ఈ మార్పులు తప్పదని సరిపెట్టుకోవడం ఆత్మహత్యతో సమానమే. మనిషి ఉనికికి కథలు, నవలలు చాలా ముఖ్యం అనే విషయాన్ని మనం మర్చిపోతున్నాం!

అయితే ప్రస్తుతం, ముద్రణకి నోచుకుంటున్న పత్రికల సంఖ్య చేతి వేళ్లకే పరిమితమైన, అంతర్జాల పత్రికలు ఇప్పుడిప్పుడే ఊపిరి పోసుకుంటున్నాయి. ఆ కోవలోనే ఈ మధ్య కాలంలో కథలు చదివి వినిపించే ప్రక్రియని కొందరు ఔత్సాహికులు మొదలెట్టి, వివిధ మాధ్యమాల ద్వారా కథలు పంచుతూ మంచి ఫలితాలనే అందిస్తున్నారు. తెలుగు పాత కొత్త కథలని నిలబెట్టి, రేపటి తరానికి అందించే ఈ ప్రయత్నాలన్నీ, వారంతా ఉచితంగా, సేవా దృక్పథంతో, తపనతో అందిస్తున్నారు. ఈ కోవలోనే మరి కొంతమంది ఔత్సాహికులు కథా వేదికలను 'యూట్యూబ్' ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేస్తూ, కథలను చదివిస్తూ, వాటి మీద చర్చా కార్యక్రమం కూడా నిర్వహించడం కథాప్రియులకు ఆనందాన్ని ఇస్తుంది. ఇలా ఎంతోమంది మహానుభావులు.. వారికి తోచిన రీతిలో తెలుగు కథకి పట్టం కట్టి, పల్లకీలో ఊరేగిస్తున్నారు.

**వారందరికీ కథామంజరి అభినందనలు తెలుపుతూ... నేను సైతం అంటూ కథామంజరి కూడా అదే దిశగా అడుగులు వేస్తున్నదని సవినయంగా మనవి చేసుకుంటున్నాం.**

**ప్రపంచ కార్మికులను సంఘటిత పరిచే "మే డే" నాడే విడుదలయ్యే ఈ సంచికకి "కథా మార్గదర్శి" గా పీడిత ప్రజల ప్రతినిధిగా రచనలు చేసిన రావిశాస్త్రి గారు, అదే ఆలోచనతో స్త్రీవాద రచనలు అందిస్తున్న శ్రీమతి డి. కామేశ్వరి గారు విశిష్ట అతిధిగా రావడం.. ఓ యాదృచ్ఛికం. వారిరువురికి లాల్ సలాం!!**

***

# విశిష్ట అతిథి



# శ్రీమతి దుర్వాసుల కామేశ్వరి గారు

"నాకు రచనలు చేయడానికి స్ఫూర్తినిచ్చింది ఇద్దరి రచనలు. వాళ్ళు రావిశాస్త్రిగారు, రంగనాయకమ్మగారు!" అంటూ ఆనందంగా అంటారా డెబ్బై ఐదేళ్ల తెలుగు కథా ఋషీమణి శ్రీమతి దుర్వాసుల కామేశ్వరి గారు. "అన్నట్టు మరో విషయం.. అసలు రావిశాస్త్రిగారిలా రాయాలనిపిస్తుంది ఇప్పటికీనూ... అబ్బే రావటం లేదు!" అని నవ్వుతూ అంటారు.

"మనం రాసే రచనల వలన సామాజిక ప్రయోజనం ఉండాలనే ఆలోచనతోనే ముందునుంచి రచనలు చేస్తున్నాను. నేనూ ఓ మహిళనే కనుక.. సమాజంలో ఉన్న మహిళా సమస్యల మీద కథలు, నవలలు రాయడం అలవాటై పోయింది. నేటి సమాజం ఎలా ఉంది, సమస్యలు ఏమిటి, విలువలు ఎలా ఉండేవి.. వంటి విషయాలు వచ్చే తరాల వారికి అందించే సాధనం సాహిత్యం ఒకటే! ఆ కోవలోనే.. కన్యగా, తల్లిగా, కూతురిగా, చెల్లిగా అడుగడుగునా సమస్యలు ఎదుర్కొంటున్న స్త్రీల సమస్యలే నా కథావస్తువులు. ఆ సిద్ధాంతంతోనే రచనలు చేస్తున్నాను!" అంటూ మనోగతాన్ని కుండ బద్దలు కొట్టినట్లు చెప్పే నాటితరం నేటి మేటి రచయిత్రి శ్రీమతి కామేశ్వరి గారు.

ఇరవై ఏడు సంవత్సరాల ప్రాయంలో.. అంటే 1962లో రచనలు మొదలెట్టి, నేటికి రాయగలుగుతున్నారంటే, ఆవిడలో తపన ఎంతుందో అర్ధమవుతుంది. మూడు వందల కథలు, వాటితో పదకొండు కథాసంపుటాలు, ఇరవై ఒక్క నవలలు, ఒక కవితా సంపుటి, యాత్రా విశేషాల మీద ఓ పుస్తకం.. ఇలా సాగుతునే ఉంది కామేశ్వరి గారి రచనా ప్రస్థానం. వీరి కథలు తమిళ, కన్నడ భాషల్లోకి అనువదింపబడ్డాయి. చాలా కథలు రేడియో నాటికలగా, టీవి సీరియల్స్ గా, షార్ట్ ఫిలిమ్స్ గా వచ్చాయి. వీరి నవలల్లో 'న్యాయం కావాలి',

'కోరికలే గుర్రాలైతే' సినిమాలుగా వచ్చాయి. 'న్యాయం కావాలి' కి ఉత్తమ సినిమా కథగా ఆరు అవార్డులు వచ్చాయి. అలా.. మిగతా అవార్డులు రివార్డులు గురించి రాస్తే ఓ పుస్తకం అవుతుంది

"శ్రీమతి కామేశ్వరిగారి కథల్లో పురుషాహంకారం మహిళల జీవితాన్ని, ఎలా ఛిద్రం చేస్తున్నదో, ఎన్ని అవాంఛనీయ పరిస్థితుల్ని కల్పిస్తున్నదో చెప్పారు. ఎంతో శక్తివంతంగా స్త్రీ స్వయంకృతాపరాధాన్ని సూడో ఈగో ప్రాబ్లమ్స్ ని, ఆధిపత్య ధోరణినీ కూడా కొన్ని కథల్లో చిత్రించారు. ఏ చిక్కుముడైనా తెగేదాకా లాగడానికి ఎలాంటి తెలివి అక్కర్లేదు. చిక్కు విప్పి చక్కదిద్దడానికి కావాలి తెలివి.. అని తెలియచేస్తాయి ఆమె కథలు!" అంటూ ప్రముఖ రచయిత శ్రీ విహారి గారు కితాబు ఇచ్చారు.

"శ్రీమతి కామేశ్వరి గారి రచనల్లో శిల్పం ద్రాక్షరస పాకంలా ఉంటుంది. వీరి శైలి చాలా సరళంగా, అక్షరాల అంచుల మీద చూపులు ఏ ఒడిదుడుకులు లేకుండా సాగిపోతాయి! ఆవిడ రచనలు చదివితే.. నాలాంటి వాళ్లకు మళ్ళీ రాయలనిపిస్తుంది!" అంటారు శ్రీ యండమూరి వీరేంద్రనాథ్.

పుట్టింది కాకినాడలో, పెరిగింది చదివింది రామచంద్రాపురంలో, భర్త శ్రీ నరసింహంగారి ఉద్యోగరీత్యా మూడు దశాబ్దాల పైగా ఒరిస్సాలో వుండి, ఆయన రిటైర్మెంట్ తర్వాత హైదరాబాదు వచ్చి అక్కడే స్థిరపడ్డారు. "కొత్తనీరు" తొలి నవలగా రచనరంగంలో అడుగు పెట్టిన శ్రీమతి కామేశ్వరి గారు "నిజానికి సమాజం ముందుకు వెళ్తున్నట్టు కనిపించినా, ఈనాటికి స్త్రీ ఇంకా అనేక సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతునే ఉంది. తల్లిగా, కూతురిగా, ఉద్యోగిగా, ఆర్థిక స్వాతంత్ర్యమున్న పురుషుని అధికారానికి తల ఒగ్గే అర్థాంగిగా.. జీవనయాత్ర కొనసాగిస్తున్న నేటి స్త్రీల అనేకానేక సమస్యలే నా కథా వస్తువులు. హితం చెబుతూ, సమస్యని వివరించి పరిష్కారం కూడా సూచించాలనీ, ఆదర్శాలకంటే.. పాఠకుల్ని ఆలోచింపచేసే రచనలు చేయడం రచయిత(త్రు)ల బాధ్యత అని నమ్ముతూ, ఆచరిస్తున్నాను!" అంటారు.

కథామంజరి ఈ నెల సంచికకి అడగగానే విశిష్ట అతిథిగా అంగీకరించి, పత్రికకే నిండుతనం కల్పించిన శ్రీమతి కామేశ్వరిగారికి కృతజ్ఞతలు తెలుపుకుంటూ.. శతాధిక వత్సరాలు ఆరోగ్యంతో ఉండి, మరిన్ని రచనలు తెలుగు పాఠకులకు అందించాలని కోరుకుంటున్నాం.

**కథామంజరి బృందం**

# కథా మార్గదర్శి



## శ్రీ రాచకొండ విశ్వనాథశాస్త్రి గారు

"కుక్కపిల్లా, అగ్గిపుల్లా, సబ్బుబిళ్లా-
హీనంగా చూడకు దేన్నీ!
కవితామయమేనోయ్ అన్నీ!
రొట్టెముక్కా, అరటితొక్కా, బల్లచెక్కా-
నీవైపే చూస్తూ ఉంటాయ్!
తమ లోతు కనుక్కోమంటాయ్!
తలుపుగొళ్లెం, హారతిపళ్లెం, గుర్రపుకళ్లెం-
కాదేదీ కవిత కనర్హం!
ఔనౌను శిల్పమనర్ఘం! ఉండాలోయ్ కవితావేశం!"

అంటూ శ్రీశ్రీగారు కవితలు రాస్తే.. ఆయనకి ఓ విధంగా సమకాలికుడు, అవే సిద్ధాంతాలు, ఆలోచనలతో ముందుకు నడిచిన మరో పెద్దాయన, "కుక్కపిల్లా, అగ్గిపుల్లా, సబ్బుబిళ్లా, రొట్టెముక్కా, అరటితొక్కా, బల్లచెక్కా, తలుపుగొళ్లెం, హారతిపళ్లెం, గుర్రపుకళ్లెం' ల మీద కథలు రాసి 'కథాశిల్పాల'ని తెలుగువారికి 'బుక్కులు'గా అందించారు. యావత్తు సాహితి ప్రపంచంలో ఈ తెలుగు కవితా, ఆ కథలు అపూర్వమనే

చెప్పాలి.  అలాగే.. నేటి భారతదేశ ప్రధాన న్యాయమూర్తి శ్రీ యన్.వి. రమణగారు..  ఆ మధ్యకాలంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు కొలువుతీరిన ఓ సభలో ప్రసంగిస్తూ,  తనకిష్టమైన కథ "మాయ" ని చదివి వినిపిస్తూ, ఆహుతులను మైమరపించారు. ఈ 'మాయ' కథకుడు, ఆ 'బుక్కులు' కథకుడు శ్రీ రావిశాస్త్రి గారని తెలుగు సాహితీ లోకానికి వేరేగా పరిచయం చేయవలసిన అవసరం మరో శతాబ్దకాలం రాదని ఘంటాపథంగా చెప్పగలం!

రావిశాస్త్రిగారిది ఎప్పుడూ ఒకరి పక్షమే. అణచివేతకు గురౌతున్న అభాగ్యుల పక్షం. వారి బాధలూ, కన్నీటి గాధలూ వారి భాషలోనే ప్రపంచానికి తెలియజెప్పారు. ఆ చెప్పడం కోపంగా చెప్పారు! వేదనతో చెప్పారు! వీటికంటే ఎక్కువగా  విపరీతమైన వ్యంగ్యంతో, కొంచెం హాస్యం జోడించి పండిత పామర్లను సైతం ఆకట్టుకునేలా చెప్పారు.  వ్యవస్థలో.. ముఖ్యంగా రాజకీయ, న్యాయ, పోలీసు వ్యవస్థల్లో వేళ్ళూనుకుపోయిన అవినీతీ, లంచగొండితనం, ధనికవర్గాల్లో ఘనీభవించిన స్వార్థం, దురాశా, నైతిక విలువల పతనం, మానసిక క్షీణత..  పాఠకుడికి ఒకపక్క నవ్వు తెప్పిస్తూనే, జుగుప్సా అసహ్యం కలిగేలా చెప్పేరు.  పోలీసుల మీదా, లాయర్ల మీదా ఆయన సంధించిన వ్యంగ్యాస్త్రాలు ఇన్నీ అన్నీ కాదు. వాటి గురించి చెప్తే సరిపోదు. చదివి తీరాల్సిందే. వారి రచనలు  చదివిన చాలామంది పాఠకులు వాటిని మళ్ళీమళ్ళీ చదవకుండా ఉండలేని స్థితికి చేరుకుంటారంటే అది అతిశయోక్తి కాదు. ఆయన అభిమానులకి ఒక పెద్ద వ్యసనం 'అయన కథలే'!

ఇక ఆయన శైలి గురించీ, కథల్లో శిల్పం గురించీ, ఎంత చెప్పుకున్నా తక్కువే. ముఖ్యంగా రచనల్లో ఆయన ప్రయోగించే ఉపమానాలు. ఆయన రచనలకు బలం, బలహీనతా రెండూ అవే...పాఠకుని దృక్పథాన్ని బట్టి!

శాస్త్రిగార్ని తలంచుకున్న ప్రతీసారీ విశాఖపట్నం బీచిలో ఆయన విగ్రహం  ఉన్న పీఠం మీద రాయబడిన "ఉత్తరాంధ్ర మాండలికాన్ని కావ్యభాష చేసిన మహా రచయిత; తెలుగు వచనానికి కొత్తబాణీ నేర్పిన వాడు" అన్న వాక్యాలు ఎవరికైనా గుర్తు రాక మానవు!  గురజాడ, శ్రీపాదల తర్వాత, మాండలికంలో  రచన సాగించిన తెలుగు రచయిత బహుశా  రావిశాస్త్రిగారేనేమో. ఈనాడు అనేకమంది రచయితలు తమతమ మాండలికాల్లో రచనలు సాగిస్తున్నారన్నా, వాటిని ఇతర ప్రాంతాలకు చెందిన పాఠకులు చదవడం మాత్రమేకాక,  ఆస్వాదిస్తున్నారన్నా.. దానికి కారణం శాస్త్రిగారే.

అంతేకాకుండా అప్పటివరకూ సినిమా వాళ్ళ చేతుల్లో, అపహాస్యానికీ, అవహేళనకూ గురౌతున్న ఉత్తరాంధ్ర మాండలికంలోని సొబగులను, ఇతర ప్రాంతాల ప్రజలు గ్రహించేలాచేసి, 'తూర్పుయాస'కు  గౌరవార్హత

కలిగించినది కచ్చితంగా రావిశాస్త్రిగారి రచనలే! అందుకే ఉత్తరాంధ్ర ప్రజలకు, ముఖ్యంగా "*ఇసాపట్నప్పోలికి 'ఛాత్రి' బాబంటే...అబ్బో మా సెడ్డ ఇది*"

రావిశాస్త్రి గారి స్వస్థలం అనకాపల్లి దగ్గర ఉన్న తుంపాల గ్రామం. అయితే అయన శ్రీకాకుళంలో జన్మించి, విశాఖలో పెరిగి, న్యాయ శాస్త్రంలో పట్టబద్ధుడై, వారి తండ్రిగారి చేసే న్యాయవాద వృత్తినే చేపట్టారు. ముందులో కాంగ్రెస్ సిద్ధాంతాలంటే ఇష్టపడి, దరిమిలా మార్క్సిస్టు సిద్ధాంతాలకు ప్రభావితమైయారు. "అల్పజీవి" శాస్త్రి గారి మొట్టమొదటి నవల. తర్వాత రోజుల్లో 'రాజు-మహిషి' (పూర్తి చేయలేదు), రత్తాలు-రాంబాబు' నవలలు రాసారు. ఆ నవలలు చదవని తెలుగువారు ఆ రోజుల్లో లేరనే చెప్పాలి. 'ఆరు సారా కథలు, ఆరు సారోకథలు, కలకంఠీ, బుక్కులు,.. మొదలగు కథా సంకలనాలతో పాటు, నిజం, తిరస్కృతి, విషాదం నాటికలు కూడా రాసారు. నిజం నాటకంలో ప్రధానపాత్రలో నటించారు కూడా. అయన చివరి రోజుల్లో రాసిన నవల "ఇల్లు". శాస్త్రి గారికి ఫుట్ బాల్ ఆటంటే చాలా ఇష్టం. ఆ రోజుల్లో వైజాగ్ లో పోలార్ స్టార్ ఫుట్బాల్ క్లబ్ కి చాల కాలం ప్రెసిడెంట్ గా కూడా చేసారు.

చివరిగా.. రావిశాస్త్రిగారి గురించి ఇంకొక్క మాట చెప్పాలి. "నేనెందుకు రాస్తున్నాను" అన్న వ్యాసంలో ఆయన ఎందుకు రాస్తున్నారో చాల విశదంగా తెలియజేస్తూ చివరిగా ఒక మాటంటారాయన. "రచయిత అన్నవాడు తను రాస్తున్నది ఏ మంచికి హాని కలిగిస్తూందో, ఏ చెడ్డకి ఉపకారం చేస్తూందో అని ఆలోచించవలసిన అవసరం ఉందని నేను తలుస్తాను. మంచికి హానీ, చెడ్డకు సహాయమూ చెయ్యకూడదని నేను భావిస్తాను. ఇది తెలుసుకుందుకీ, తెలియజెప్పడానికీ నేనిదంతా రాసేను." అని. ఇదీ రచయితగా ఆయన నిబద్ధత! దాన్ని కొలవడానికి వేరే ప్రమాణమింకేదీ అక్కరలేదు!

ఆయన తెలుగువాడు కావడం తెలుగువారు చేసుకున్న అదృష్టం! అదే ఆయన దురదృష్టం కూడానేమో. ఎందుకంటే అంత గొప్ప రచయిత ఏ వంగదేశంలోనో పుట్టుంటే ఆయనకు 'నొబెల్ బహుమతి' వచ్చుండేది. అది రాకపోయినా, కనీసం ఆయన ప్రతిభ భారతదేశం మొత్తానికి వెల్లడయ్యుండేది. ఈ మాటలు చాలామంది పెద్దలు అనేవారు! కానీ.. 'పద్యం' తెలుగువారికి మాత్రమే ఎలా ప్రత్యకమో , రావిశాస్త్రిగారి రచనలు తెలుగువారికి మాత్రమే తరగని సాహితీ సంపద!

దేశ కాల మాన పరిస్థితులు మారుతున్నా నిత్యం కనిపించి కదిలించేది మాత్రం "రావిశాస్త్రీయమే"!

**కథామంజరి బృందం**

***0***

ఉగాది హాస్య కథల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ

# నీలాలు

సమ్మెట ఉమాదేవి



ఎన్నాళ్ళ ప్రయత్నమో ఫలించి తిరుపతి యాత్ర చేస్తున్నారు గుర్నాధం కుటుంబం. ఎగువకు చేరుకుంటున్న బస్సులో నిండయిన నీలాల తలలు. దిగువకు వెళ్ళే బస్సుల నిండా గంధాలు పూసుకుని నవ నవ లాడుతున్న గుండ్లు.. తిరుపతి యాత్ర ప్రత్యేకతను తెలుపుతున్నాయి. గుర్నాధం గోవిందా నామ స్మరణమైనా మరుస్తున్నాడేమో గానీ.. తన వత్తయిన క్రాఫ్ ని సవరించుకోవడం ఏ నిమిషంలోనూ మరచిపోడంలేదు. వత్తయిన జుత్తు తన అందాన్ని రెట్టింపు చేస్తుందని, వందమందిలోనూ తనను హీమాన్ గా నిలబెడతుందని అతనికి 'అంద' విశ్వాసం.

"బావ నువ్వు భలే అందంగా ఉంటావు. సినిమాల్లోకి వెళ్లడానికి ఎందుకు ప్రయత్నించలేదు?" అడిగాడు బావమరిది మహేష్. ఒక నవ్వు నవ్వి ఊరుకున్నాడు. నిజంగానే చాలా అందంగా ఉంటాడు గుర్నాధం! గతంలో ఇలాగే అందరూ "ఇంత అందగాడివి నువ్వు సినిమాల్లోకి ఎందుకు ప్రయత్నించకూడదు" అన్నరోజుల్లో పులకించిపోయి చెన్నైకి వెళ్ళి, సినిమా ప్రయత్నాలు చాలా చేశాడు. ఆరు నెలలు చిన్నా చితకా పాత్రలు వేసీ, హీరో కావాలంటే రూపం ఒక్కటే కాదు, ముందూ వెనకా అండా, దండా ఉండాలని ఫైట్స్, డాన్స్, కార్ డ్రైవింగ్, వీలైతే హార్స్ రైడింగ్ కూడా వచ్చి వుండాలని తెలుసుకున్నాడు. అంతేకాదు డాన్స్ తో పాటు హీరోయిన్ని లిఫ్ట్ చేయడానికి వెయిట్ లిఫ్టింగ్ కూడా వచ్చి వుండాలనీ.. ఇలాంటి మరెన్నో విషయాలు తెలుసుకున్న వాడై, ఖర్చులు తప్ప సంపాదనలేక.. తప్పని పరిస్థితిలో తిరిగి వచ్చేశాడు.

బుద్ధిగా డిగ్రీ పూర్తి చేసి చిన్న ఉద్యోగమొకటి సంపాదించుకున్నాడు. అమ్మానాన్నా చక్కని చుక్కను చూసి పెళ్లి చేసుకొమ్మనగానే బుద్ధిగా పెళ్లి చేసేసుకున్నాడు. కానీ. తాను హీరో కాలేకపోయిన బాధ ఎప్పుడూ మనసులో సన్నగా బాధపెడుతూనే ఉంటుంది. ఎప్పుడో ఏదో ఒక అవకాశం అతన్ని వెతుక్కుంటూ వస్తుందన్న ఆశతోనే ఎదురు చూస్తున్నాడు గుర్నాధం. మరీ ముఖ్యంగా ఒత్తుగా నిగనిగలాడేలా తన అందమైన జుట్టును మరింత శ్రద్ధగా కాపాడుకుంటున్నాడు. సగం సంపాదన తన అందమైన డ్రెస్సులకూ,

హెయిర్ సెట్టింగ్ లకూ, ఫోటోషూట్ లకూ ఖర్చు పెడుతుంటాడు. మరి ఇల్లు గడిచేదెలా అంటే ఉద్యోగం చేసే భార్య ఉండనే ఉందిగా.

ఇప్పుడు అతగాడికి పెద్ద ఆపద వచ్చి పడింది. ఏదో ఒక కష్ట కాలంలో భార్యామణి శ్రీవారి నీలాలు శ్రీకరునికి అర్పిస్తానని మొక్కుకున్నది. తలకట్టు మీద తరగని ప్రేమతో, "నా జుట్టు మీద నీ హక్కేమిటని, గుండు చేయించుకోకపోతే మునిగిపోయేదేముందని? తలనీలాలు సమర్పిస్తేనే భక్తి వున్నట్టా?" ఆలితో అరిచి గొడవపెట్టాడు.
"జుట్టే కదా ఎంతలోకి పెరుగుతుంది? భగవంతునికి అర్పించే ముందు వేరే ఆలోచనలు పెట్టుకోకూడదని" సర్ది చెప్పింది మధులత. తప్పేదేమున్నది ఆపదలు గాసిన స్వామికి అత్యంత ప్రేమగా పెంచుకుంటున్న నీలాలు సమర్పించే సమయం అసన్నమయ్యింది. క్రాఫ్ సవరించుకుంటూనే గుండు గురించిన దిగులు గుండెలోనే దాచుకుని అందరితో సరదాగా గడపసాగాడు గుర్నాధం.

తప్పనిసరిగా తల నీలాలు సమర్పించుకుని స్నానం చేసి, స్వామి దర్శనానికి బయలుదేరారు. అంతలో మరదలు మాలతికి విపరీతంగా తుమ్ములు మొదలైనాయి. ఆమెకి ముందు నుంచే ఎలర్జీ ఉంది. తలస్నానంతో తుమ్ములాట ముమ్మరమయ్యింది. మాలతి తుమ్ములతో నానా అవస్థ పడుతుంటే అమ్మా, అక్కా చుట్టూ చేరి కంగారు పడుతూ పరిచర్యలు చేయసాగారు. గుర్నాధంలోని కోతిగుణం తోక విప్పుకున్నది. అంతే...! మరదలు తుమ్ములు తుమ్ముతూ నానా అవస్థ పడుతుంటే ఆ దృశ్యాలను అన్నీ కోణాలలో కెమెరాలో బంధించాడు. ఆ చిత్రాతి చిత్రాలన్నీ రహస్యంగా కామ్ లో చూసుకుని తనలో తనే నవ్వుకున్నాడు. ఆ చిన్న పని అతని జీవితాన్ని మార్చేస్తుందని అతనికి తెలియదు. ఆమెకి కాస్త నెమ్మదించాక, దర్శనానికి వెళ్లారు.

దర్శనం అయ్యాక కాస్త స్థిమితంగా కూర్చుని ప్రసాదాలు తింటూ కెమెరాలో తన వారు తీసిన ఫోటోలను చూసి, కెవ్వుమని కేక వెయ్యబోయి తమాయించుకుంది. ఇదంతా బావగారి పని అని గ్రహించింది. తక్షణమే ఆమె సంకల్పిత ప్రతీకార చర్య కోసం ఒక నిర్ణయం తీసుకున్నది. కెమెరా చేత బూని అతనికి తెలియకుండా అతని తాజా గుండు చుట్టూ తూనీగలాగా తిరుగుతూ కొంటె కోణాల్లో చిత్రీకరించడం మొదలు పెట్టింది. బావగారి నూతన గుండును నూరు భంగిమల్లో ఫోటోలు తీసింది. అతను నవ్వుతున్నప్పటి భంగిమలు మొదలుకొని తీయరాని భంగిమలెన్నో మిక్కుటముగా తీసింది. ఒక్క ఫోటో తీస్తున్న కొద్దీ ఆమె మనసు సంతోషంతో వికటాట్టహాసం చేయసాగింది.

అంతేకాదు ఆ రాత్రి మాలతికి ఒక కల వచ్చింది. విహారంలో కళ్యాణ చక్రవర్తి జంటగా కనిపించారు.

“స్వామి అందరూ వెండీ, బంగారు నగలూ, వజ్రాలు వైడూర్యాలూ మీకు కానుకలుగా తెస్తుంటే ఇంకా ఎంత కాలము స్వామి ఈ తల నీలాల సమర్పణలు?” అలమేలు మంగమ్మ అనుమానం వెలిబుచ్చింది.
“ఏమిటిది దేవీ! భూలోకవాసులు ఇంకా ఎంతకాలం ఈ రిజర్వేషన్లు అని అడిగినట్లున్నది నీ ప్రశ్న. నీలాలు సమర్పించుట అనగా .. జనం తమ అహాన్ని సమర్పిస్తున్నట్లని నీవు ఎరుగవా? అదీగాక ఈ నీలాల వలన ఎంత మందికి ఉపాధి దొరుకుతున్నదో వాటి సమర్పణ తర్వాత అవి ఎంతమందికి ఎన్ని రకాలుగా ఉపయోగపడుతున్నాయో నీకు తెలియనిది కాదుగా.” స్థిరంగా అన్నారు స్వామివారు.
“నిజమే స్వామీ! మొన్న అక్కడ ఒక భక్తుడు ఈ గుండు చేసుకోకపోతే ఏమౌతుంది?” అని తన శ్రీమతితో వాదిస్తుంటే విని, అతనిపై జాలితో అడిగితిని స్వామీ! ఇక మన విహారయాత్ర కొనసాగించుదాము.” అన్నది.
“అటులనే కొనసాగించుదాము.” అంటూ స్వామి ఒక చిరునవ్వు నవ్వారు. ఆ నవ్వుకు అర్థం ఏమిటో అలమేలు మంగమ్మకు అప్పుడు అర్థంకాలేదు.

గుర్నాధం గుండు ఫోటోలు తీసిన మాలతి గుంభనంగా ఉండిపోయింది. యాత్ర ముగిసింది. తాను మరదలుగారి తుమ్ముల ఫోటోలు తీసిన సంగతి తాత్కాలికంగా మరచిపోయాడు గుర్నాధం. వచ్చీ రాగానే అత్యవసరంగా కంపెనీ పనిపై బెంగళూరు వెళ్ళాడు. రెండు రోజుల పని హడావుడి తరువాత అక్కడ దిన, వార పత్రికలు చూసిన వాడై అవాక్కయ్యాడు.

అతని తపము ఫలించి “కల నిజమాయెగా కోరిక తీరగ..!” అని పాడుకునే ఓ పత్రికా ప్రకటన అతని కంట పడింది. ప్రముఖ దర్శక నిర్మాత చమన్ అనునతను నూతన తారాగణంతో చలనచిత్రం నిర్మించుటకు ఉద్యుక్తుడాయెను. వివిధ రకములుగా దిగిన తమ చిత్రములు అన్ని కొలతలలో పంపమని ప్రకటన వెలువరించాడు. అది గుర్నాధం చూసిన పరమానంద భరితుడయ్యాను. కానీ తాను ప్రయాణంలో ఉన్నాడు కావున ఫోటోలు ఎటుల పంపవలెనో తెలియరాలేదు. వెంటనే మరదలు మాలతి గుర్తుకు వచ్చింది.

వెంటనే ఆమెకు ఫోన్ చేసి, “మరదలు మాణిక్యమా! నాకు కాస్త సాయం చేయుమా!” అని అడిగాడు. “చెప్పండి బంగారు బావగారు!” వినాయతి వినయంగా అన్నది మాలతి. తాను వివిధ ఫోల్డర్లలో దాచుకున్న రకరకాల ఫోటోల వివరాలు చెప్పి, వాటిని ప్రింట్లు తీసి కొన్నీ, సీడీ రూపంలో కొన్నీ ఆ చమన్ అడ్రస్ కి పంపించమని బతిమాలుకున్నాడు బావాగారు. “అలాగే బావగారూ!” అంటూ గుర్నాధం చెప్పినట్లుగానే అతని అందమయిన చిత్రముల చిట్టాను చమన్ సంస్థకు పంపింది మాలతి.

వారం తర్వాత గుర్నాథం క్యాంపు నుండి ఇలా వచ్చాడో లేదో, “మీకు స్క్రీన్ టెస్ట్ ఉంది అర్జెంట్ గా బయలుదేరి రావాలని చమన్ సంస్థ నుండి కబురు వచ్చింది. సంతోషంతో కెవ్వున ఎగురబోయి.. ఆగిపోయి గుండు పట్టుకు కూర్చున్నాడు. రాక రాక అవకాశం వస్తే పీక్కోవడానికి కూడా పిడికెడు జుట్టులేని వాడై

నందుకు మిక్కిలి ఖేదపడెను. నీలాలు కోల్పోయిన గుండు మిల మిల మెరుస్తుంటే అతని నీరసపు ముఖం విల విలాడిపోయింది.

"ఏమిటండి అలా అయిపోయారు?" కంగారు పడిపోయి మంచి నీళ్ళు తెచ్చింది మధులత. గురునాథం "ఏం చేయమంటావు మధూ? నాకు రాకరాక సినిమా అవకాశం వచ్చింది. ఇప్పుడు వాళ్లు నన్ను స్క్రీన్ టెస్ట్ కి పిలిచారు. మీ దయ వల్ల నాకు గుండే మిగిలింది. ఇప్పుడు నన్ను చూస్తే వాళ్ళకు నా గుండు కనపడతుందే తప్ప నా ముఖం కనపడదు కదా?" దిగులు పడిపోయాడు.

మధుబాల గుండె ద్రవించి పోయింది. "నీలాలు పోయేనా.. కాలాలు మారేనా..?" అని మనసులో పాడుకుని, "అలా బాధపడకండి. పెద్ద పెద్ద హీరోలకున్నది మాత్రం వాళ్ళ ఒరిజినల్ జుట్టా ఏమన్నానా? వాళ్ళు పెట్టుకునేవి విగ్గులే కదా! మీరు కూడా మీకు సెట్ అయ్యే ఒక మాంఛి విగ్ కొనుక్కుని పెట్టుకుని వెళ్ళండి" అని గుర్నాథం గుండు నిమురుతూ ప్రేమగా చెప్పేసరికి అతనికి కూడా "నిజమే కదా!" అనిపించింది.

అంతే వెంటనే విగ్గుశాలకు పయనమయ్యాడు. తన ముఖానికి నప్పిన రెండు ఖరీదైన విగ్గులు కొనుక్కుని చెన్నై రైలెక్కేసాడు. ఓ మాంచి హోటల్లో బస చేసి ఉదయానే ట్రిమ్ గా రెడీ అయ్యి విగ్గుధారియయి చమన్ స్టూడియోకి వెళ్ళాడు.

స్టూడియోలో గుర్నాధాన్ని చూసి అలా కూర్చోమన్నాడు ఆ చమన్ అన్నాయన. "అదేంటి తనను పిలిపించి అంత లెక్కలేకుండా అట్లా కూర్చోమన్నాడేమిటి?" అని కొంత నిరాశపడ్డాడు. చమ న్ అక్కడికి వచ్చిన మిగతా అందరితో మాట్లాడసాగాడు. గుర్నాథం డీలా పడిపోయాడు. పనిగట్టుకుని పిలిపించి తనని పట్టించుకోకుండా మిగితావారితో మాట్లాడుతున్నాడు. ఒళ్ళూ, గుండూ రెండూ మండిపోసాగాయతనికి.

చమన్ క్యారెక్టర్ యాక్టర్స్ ని ఇంటర్వ్యూ చేస్తూ కొందర్ని ఎంపిక చేసుకుంటున్నాడు. మధ్య మధ్య ఎవరి కోసమో ఎదురు చూస్తు "అతను వచ్చాడా?" అతను వచ్చాడా?" అని అసిస్టెంట్ ని అడుగుతున్నాడు.
ఆ చమన్ తనని ఎప్పుడు పిలుస్తాడో అర్థంకాక వెర్రి చూపులు చూడసాగాడు. బుర్రను అంటుకు పోయి ఉన్న విగ్గు చిరాకు తెప్పిస్తున్నది. ఓపికగా ఎదురుచూస్తూ కూర్చున్నాడు. వచ్చిన వాళ్ళ స్క్రీన్ టెస్ట్ లు, డైలాగ్ టెస్ట్ లు ముగిశాయి.
చమన్ అసిస్టెంట్ ని పిలిచి "ఇతన్ని దేనికి పిలిపించారు? చాలా సేపటి నుండీ అలాగే కూర్చున్నాడు పాపం! విషయం ఏమిటో కనుక్కొని పంపండి!" అన్నాడు.
గుర్నాథం గుండె రగిలిపోయింది. "తనను పిలిపించి ఎరగనట్టు ప్రవర్తిస్తున్నారేమిటి?" అయోమయంగా చూశాడు

“ఏమిటయ్యా మనము అనుకున్న అతను ఇంకా రాలేదు?” అంటూ ఫోన్ కలిపాడు. అదే సమయంలో గుర్నాధానికి కూడా ఫోను వచ్చింది “ఏమండీ గుర్నాధం గారూ! ఇవ్వాళ స్క్రీన్ టెస్ట్ కి వస్తానని చెప్పి మీరు రాలేదు ఏమిటి?” ఎదురుగా ఉన్నతని గొంతు తన చేవుల్లో రింగ్ మనేసరికి..
కుర్చీలో కూర్చున్న గుర్నాధం “గుండె జారి గల్లంతయ్యిందే.. అన్నట్లుగా ఒక్కసారిగా ఎగిరి పడ్డంత పని చేసాడు. దానితో విగ్గు జారీ పడింది. అదేమీ పట్టించుకోకుండా ఒక్క అడుగు ముందుకేశాడు
“నేనే నేనండీ ఆ గుర్నాధాన్ని” అన్నాడు.
“అరే మీరా?” ఆనందంతో అరిచాడు చమన్.
“ఓహ్ మీరు విగ్గు పెట్టుకుని వచ్చారా..? అందుకే నేను గుర్తు పట్టలేదు భలేవారండీ మీరు” రెండు నిముషాలు గలగలా నవ్వాడు. కెమెరామెన్ ని పిలిచి ఏడెనిమిది యాంగిల్స్ లో ఫోటోలు తీయించాడు.
“ఎస్ నాకు కావాల్సింది మీరే. మీరే మా సినిమాలో నటించబోతున్నారు” అన్నాడు సంతోషంగా.
“అంతా ఏడుకొండల వాడి దయ. గుండయితే ఏమిలే.. నగుమోమే చాలులే! వీళ్ళు నన్ను హీరోగా తీసుకున్నారులే..” అంటూ మనసులోనే సంబరంగా పాడుకున్నాడు.
చమన్ గుర్నాధం దగ్గరకు వచ్చి “రెండురోజుల్లో షూటింగ్ మొదలు అవుతుంది.. ఈ సినిమాలో కథంతా విలన్ చుట్టూనే నడుస్తుంది. మీకు తెలియనిదేముంది ఈ రోజుల్లో హీరోలకు ఎంత క్రేజ్ ఉందో విలన్లకూ అంత క్రేజ్ ఉన్నది. ఇక గుండు వున్న విలన్లకున్న నేమ్ ఫేమ్ మీకు తెలియనిది కాదు కదా! సో మీరు ఎట్టి పరిస్థితుల్లోనూ సినిమా మొత్తం ఇదే గుండు కంటిన్యూ చెయ్యాలి సుమా!” అన్నాడు.
“అంతే కాదు ఎవరు తీశారో కానీ భలే తీశారు. మీరు పంపిన గుండు స్టిల్స్ కొన్ని వాల్ పోస్టర్స్ గా వేద్దాం అనుకుంటున్నాం!” అన్నాడు.
చమన్ టేబుల్ పైన గురునాథం గుండు ఫోటోల గుట్ట కనబడింది. ఒక్కొక్కటే తీసి చూస్తుంటే అతని గుండుకి చెమట పట్టేసింది. ఇంత కుట్ర ఎక్కడ, ఎలా, ఎందుకు, ఎప్పుడు జరిగిందో అతనికి అర్ధమయింది. మనసున మెదిలిన మరదలు మాలతికి ధన్యవాదలు చెప్పుకోవాలో... దండించాలో కూడా అర్ధంకాలేదు.
“సరేలే ఈ ఒక్క సినిమాలో చేశాక మళ్లీ జుట్టు ఒత్తుగా పెంచుకోవచ్చు అనుకుంటూ ఉద్యోగానికి తాత్కాలికంగా సెలవు పెట్టి ఉత్సాహంగా షూటింగ్ కి హాజరయ్యాడు. మొదట్లో కాస్త తడబడ్డా.. తరువాత తరువాత అతనిలో కళాకారుడు విజృంభించాడు. మొత్తానికి సినిమా విడుదలై ఊహించని విజయం సాధించింది.

అంతే అనతికాలంలోనే గుర్నాధం ఓ 10, 15 చిత్రాలలో విలన్ గా బుక్ అయిపోయాడు. అందరూ ఒకటే షరతు పెట్టారు.. ఇక ఆ గుండుపై జుట్టు మాత్రం మొలిపించవద్దని.

***0***

ఉగాది హాస్య కథల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ



# కేశవం - కేశక్లేశం

ఓలేటి శశికళ

ఒకప్పుడు పెళ్లిచూపులు అంటేనే మహా డాబు దర్పం ప్రదర్శిస్తూ..."అప్పుడే నాకు పెళ్లేమిటి? అయినా నాకు అమ్మాయి బాగా నచ్చితేనే నేను యెస్ అంటాను. లేదంటే నన్ను బలవంతం చేయకూడదు. నా ఆశయాలకు, నా కలలకు తగ్గ అమ్మాయి దొరికితే పెళ్లి చేసుకుంటాను." అంటూ డాంబికాలు పోయిన కేశవుడికి, ఇప్పుడు ఎవరైనా తనను పెళ్లిచూపులుకి పిలిచారు అని వినగానే నోరు పైకి లేవకపోగా, మనసు వెర్రి గంతులేస్తోంది. వెయ్యదూ మరి... మాడు మీదకు ముప్పై యేళ్ల పైనేవచ్చి చేరాయి.

"రత్నం...! నా నాగరత్నం...! ఏడి నీ పుత్ర రత్నం...?" అంటూ రైమింగ్ తో గోముగా భార్యని పిలిచాడు గోవిందం.

"ఇదిగో ఆ పిచ్చి పిలుపులే వద్దనేది. వయసుకు తగ్గట్టు కాస్త పెద్దరికం నేర్చుకోండి. వాడు ముస్తాబవుతున్నాడు లోపల. 'అయినా చెప్పా పెట్టకుండా అలా పెళ్లి చూపులు అంటే ఎలాగే? నా ఏర్పాట్లు నేను చేసుకోవద్దా?' అని వాడు ఒకటే గోల. నాన్నా! కేశూ! తొందరగా రా రా! మీ నాన్నలో దాగున్న దూర్వాసుడు బయటకు రాకముందే, మనం ఇంట్లో నుంచి బయటపడాలి!" కాసింత బుస్సు, కస్సు, ప్రేమ, కోపం కలగలుపుగా చేసి కుమార రత్నాన్ని పిలిచింది నాగరత్నం.

"అయినా మగవెధవకు అంతసేపు ముస్తాబేమిటి? మొహం కడుక్కుని లాగూచొక్కా వేసుకుని వచ్చేయకుండా!" విసుగ్గా అడిగాడు గోవిందం!

"ఇదిగో...! ఇలాంటి అడ్డమైన సలహాలు ఇచ్చే అరవై సంబంధాలు తగలెట్టారు. పైగా, వాడి కర్మ కాలి పాతికేళ్ళ వయసులో నెత్తిమీద నల్ల బొచ్చుకుక్కని కూర్చో పెట్టుకున్నట్టు ఉండే ఆ జుట్టు కాస్తా మెల్ల మెల్లగా గొరుక్కు పోయి, గోదారిలంకలా తయారయింది వాడి బుర్ర." విచార పడింది నాగరత్నం.

"నిజమేనోయ్! దిష్టి తగిలేసింది వెర్రివెధవకి! మా ఇంటావంటా లేనంతజుట్టు ఈ కుర్ర వెధవకి వచ్చిందని ఎంత మురిసిపోయామో నేను, మా నాన్న."

"ఇంటావంటా లేకపోవడం ఏమిటి...? అదంతా మా పుట్టింటి పోలిక. అవునవును మీరో గోవిందం, ఆయనో గుండప్పగారు! మహా కేశ సంపదే సంపద...!" మూతి మూడు వంకర్లు తిప్పి ఎత్తి పొడిచింది నాగరత్నం.

విసుగు విరామం లేకుండా మరి కాసేపు పోట్లాడుకునే వారే, 'కేశూ' అనబడే కేశవ్ బయటకు రాకపోతే. రూపం.. ఒడ్డు పొడుగు.. బ్రహ్మాండమైన ఉద్యోగం... ఆధునిక భావాలు... ఆడపిల్లకు నచ్చే పోకడలు... లక్షణాలూ... పుష్కలంగా ఉన్నాయి కేశవ్ లో. లేనిదల్లా పాపం కేశ సంపద!

నెత్తిమీద నల్ల బొచ్చుటోపీలాంటి విగ్గు పెట్టుకున్న కొడుకుని చూసి గోవిందం నవ్వు ఆపుకుంటూ మేలమాడాడు,

"ఏరోయ్! ఏ వెధవ మొలిపించాడేమిటి నెత్తి మీద ఇంత జుట్టు గంటలో?"

"ఏ వెధవా... బోడి కాదు... నేను!" ఇంట్లో కొస్తూ కూతురు నీలవేణి అంది విసురుగా. నల్లత్రాచులా నడుము కిందకి ఉండే ఆ పిల్ల జుట్టిప్పుడు మొండి మానులా బెత్తెడుంది.

"అయ్యో అయ్యో! జుట్టు అలా కత్తిరించు కొంటారా ఎవరైనా? పెళ్లి కావలసిన పిల్లవి ఇదేమి అఘాయిత్యమే...?" అంటూ గుండెలు బాదుకుంది నాగరత్నం.

"అఘాయిత్యము లేదు పైత్యము లేదు. నాకు స్కూటీ కొనిచ్చాడు. నేను వాడికి విగ్గు చేయించు కోవడానికి జుట్టిచ్చా. మ్యూచువల్ ఫండింగ్ అంతే." అంటూ నవ్వుతూ భుజాలు ఎగరేసి లోపలికి పోయింది ఆ పిల్ల.

ఇహ పెళ్లిచూపుల వారింట...

పెళ్లి కూతురే స్వయంగా బయట గుమ్మంలో నిలబడి, తమను లోపలికి తీసుకు వెళ్లడం శుభసూచకంగా తోచింది నాగరత్నానికి.

అమ్మాయి ఆపిల్ లా ఉంది. యాపిల్ కంపెనీ లో పని చేస్తోంది. అబ్బాయితో సరి సమానంగా. తనకు కూడా అరడై పెళ్లిచూపుల అనుభవం ఉంది. అన్నిటికన్నా ముఖ్యంగా నల్లటి ముఖమల్ తలగుడ్డ కట్టినట్టు సిల్కు లాంటి బారుకురులు అదనపు ఆకర్షణగా... అమ్మాయి పేరు "సుకేశి ట"!

మూడు గంటల ముచ్చటంటి పెళ్లిచూపుల కోసం ఇరుపక్షాలు ఎలాంటి ఆర్భాటాలు, మొహమాటాలు పెట్టుకోలేదు. కాసిన్ని మంచినీళ్లు మరి కాసిన్ని మాటలు తప్ప. మరే అదనాలు నడవలేదు మధ్యలో.

తల్లులు ఇద్దరూ "నీ చీరను మించి నా చీర", "గుత్తొంకాయ్- గోంగూర" అనే ఫేస్ బుక్ గ్రూప్ ల్లో స్నేహితులు. అలాగే తండ్రులు కూడా, "మోడీ నీ పాలన బాడీ"అనే సమూహంలో సభ్యులు. ఈ మాత్రం చాలదా? అభిప్రాయాలు కలవడానికి అని తెగ ఆనంద పడ్డారు.

కింద వీరి ముచ్చట్లు ఈ విధంగా ఉంటే, పైన అబ్బాయి అమ్మాయి తాలూకు ముచ్చట్లు మరొక విధంగా సాగుతున్నాయి.

"కేశవ్! మీది మొదటి నుండి బాల్డ్ హెడ్డా లేక ఈ మధ్య వచ్చి చేరిందా?" అమ్మాయి నోటి నుండి బాణంలా వచ్చి తాకిన ఆ ప్రశ్నకు మంచినీళ్లు తాగుతున్న కేశవ్ కు పొలమారింది.

అతనికి జవాబు ఇవ్వడానికి కూడా అవకాశం ఇవ్వకుండా రెండో ప్రశ్న దూసుకొచ్చింది "మీకు తెలుసా...? నేను సగం మందిని రిజెక్ట్ చేసిన కారణం బట్టతలే!"

కేశవ్ కు కోపం వచ్చింది. కానీ, పేదవాడి కోపం పెదవికి... బోడిగుండు కోపం సంబంధానికి చేటని తెలుసుకుని సంయమనంగా మౌనం పాటించాడు.

ఖచ్చితంగా అనడం అయితే అంది కానీ, అన్ని అర్హతలు ఉన్న కేశవ్ ని వదులుకోవాలంటే సుకేశికీ బెంగగానే ఉంది. కానీ, జుట్టు విషయంలో మాత్రం ఎటువంటి పరిస్థితుల్లోనూ కాంప్రమైజ్ అవ్వదలుచుకోలేదు.

ఇంక ఆమెతో సంభాషణ కొనసాగించడానికి ఏమీ కనిపించక కేశవ్ వెళ్లిపోవడానికి లేచాడు. వెళ్లేముందు "సుకేశీ! ఇప్పుడు నేనేమీ చెప్పలేను. కానీ, మీకు నేను ఒక మెయిల్ పంపిస్తాను. ఓపికుంటే చదివి రెస్పాండ్ చేయండి." అంటూ ఉదాసీనంగా సెలవు తీసుకున్నాడు.

రెండు రోజుల విరామం తర్వాత... అందిన మెయిల్ ను ఓపెన్ చేసింది సుకేశి.

డియర్ మీకు!

ఇద్దరి పేర్లలో ఇంచక్కా కలిసిన "కేశ-కేశీ" కేసి చూడకుండా... నా కేశ ఖేదనమే మీకు ముఖ్యంగా తోచిందంటే ఎంత దయలేని దానివి ఓ సుకేశి. కేవలం బొచ్చెడు బొచ్చే నాకు మచ్చ అని దారుణంగా తిరస్కరించడానికి మనసెలా వచ్చింది? నా కేశ క్లేశ గాథ, నా బాధ కథగా రాసా! బాధను అనుకోకుండా బాదాం పిస్తా తింటూ చదువు.

మా తాతగారు గుండప్ప గారు...! ఆయనకా పేరు తదనంతర కాలంలో జనాలే పెట్టారు అనే అపవాదు ఉంది. ఆయన సార్థక నామధేయులు. అలాగే...మా నాన్న గోవిందం...! ప్రతి యేడు తిరుపతిలో తలనీలాలు ఇచ్చే మా నాన్న, మూడేళ్లు వరసగా వెళ్లక పోయినా మాడు నున్నగానే ఉండేసరికి తలకు మూడిందని అర్థమయ్యి గుండు గండానికి అలవాటు పడిపోయాడు. ఇక నేను...! మా తాతగారికి, నాన్నకు కళ్ళు కుట్టేలా తల మీద బుట్టడు జుట్టుతో పుట్టా. పుట్టు వెంట్రుకల నాడు మా అమ్మకు పుట్టెడు దుఖం వచ్చిందట! 'జుట్టు బోలుగాడు" అని బిరుదిచ్చిన మా తాత గారు, నా ఎనిమిదో యేటనే పంచశిఖల రూపంలో నాకు మొదటి ద్రోహం చేశారు.

ఆ తరవాతి అఘాయిత్యం..., కోరుకొండ పబ్లిక్ స్కూల్ లో అప్రతిహతంగా కొనసాగింది! నా కృష్ణ కేశాలపై ఒక నేవీ టోపీ పెట్టి దాని చుట్టూ గొరుగుడు సాగేది. వెంట్రుక పొడవు ఒక సెంటీమీటర్ మించి ఉంచకుండా క్షవరం అయ్యేది. ఆ విధంగా నేను పుట్టి బుద్ధెరిగాకా నా సుందర కేశ సంపదను మనసారా చూసుకున్నది లేదు.

అవి నా ఇంజనీరింగ్ రోజులు...! నా కేశ చరిత్రలోనే స్వర్ణాక్షరాలతో లిఖించదగ్గ యుగము! బుర్రకు నలు దిక్కులా స్వేచ్ఛగా పెరుగుతున్న నల్లని కురులు. వారానికో స్టైల్. బచ్చన్లు, బాబులు, మెగాలు, ఖాన్ లు... అందరినీ నెత్తికి ఎక్కించుకుని ఓ వెలుగు వెలిగా.

ఉద్యోగ పర్వంలో నా జుట్టును వలచి వరించిన నెలతల లెక్కే లేదు! అప్పట్లో జండా ఊపేసినా పోయేది. అత్యాశకు పోయి ఇంతవరకు తెచ్చుకున్నా.

అప్పుడు నా వయసు పాతికేళ్లు. ఒక రోజు... అది ఒక చీకటి రోజు...! నా దువ్వెనకు కుచ్చులు కుచ్చులుగా జుట్టు మొలిచిన రోజు. కేశ క్లేశం మొదలయిన రోజు. కేశ వర్ధనితో పై కెళ్ళి... పారాషూట్ తో కిందకు దిగి.... క్లినిక్ లో నెలలు గడిపి... మీరా భజనలు పాడి... బాడిగా.. లోరియల్లు... ట్రెసెమేలు... గార్నియర్ లు... ఫారిన్ నుండి తెచ్చి మరీ పులిమినా! కేశగ్లాని తగ్గకపోగా మనః క్లేశంలోకి దింపింది. శుక్రుడులోకి కుజుడొచ్చి చేరాడు. అబ్బాయికి జుట్టు పోవడం, అమ్మాయిల జట్టు పోవడం ఒకేసారి జరిగాయి. అదే సమయంలో శనీశ్వరుడి చల్లని చూపు కూడా నా సహస్రార చక్రంపై పడడమేమిటి, ఆ ప్రదేశమంతా నున్నని ద్వీపకల్పంగా రూపాంతరం చెందింది. ఆ శని మహాదశలో పరిచయం అయ్యాడు "మహా మహోపకార... కేశగ్లాని హార... కేశఘ్ననివార... శిరోరుహ ఉద్ధార... శ్రీశ్రీశ్రీ కేశానంద మహారాజ్!"

కేశానందాశ్రమం...! కోనసీమలో కొబ్బరి తోటల మధ్య జనాలతో కిటకిటలాడుతూ ఉంటుంది. అందరూ నాలాంటి బట్టతల బాధితులే. కేరళలో పుట్టి హిమాలయాలలో తపస్సు చేసి గొప్ప సిద్ధులు, మూలికలను సాధించి కోనసీమలో ఆశ్రమం పెట్టారట కేశానంద స్వామి.

కేశానంద స్వామి మలయాళం ఎప్పుడు మాట్లాడగా నేను చూడలేదు. శుద్ధ గోదారోళ్ళ తెలుగులోనే మాట్లాడేవాడు. ఆశ్రమంలో నెల్లాళ్ళు కొబ్బరినూనెలో రకరకాల మూలికలు కలిపిన "కేశ్ కేశ్" ఆయిల్ తో బుర్ర మర్దనాలు చేయించుకుని, కొబ్బరి నూనె వంటకాలు తినితిని బెబ్బేలెత్తి పోయాను నేను.

ఆరోజు ప్రవచనంలో కేశానంద స్వామి శివుడి జటాజూటం గురించి చెప్పసాగాడు. శివపురాణంలో "కేశ్ కేశ్" నూనె గురించి ప్రస్తావన ఉందని, శివుని జటాజూటాలకు కేశ్ కేశ్ కారణమని, శివుడు తన జుట్టును శ్రద్ధగా కాపాడుకోవడం కోసం స్వర్గం నుండి సాక్షాత్తు గంగమ్మను దింపి తన తలలో దాచుకున్నాడని, వ్యర్థ ప్రలాపాలు చెప్పడం మొదలు పెట్టాడు.

అది కేశ కేశ్ కాదని "కేష్ కేష్" అనీ నాకు అప్పటికే అర్థమై అయిపోయింది. ఆ తరువాత కేశానందభజన మొదలుపెట్టారు అతని అనుచరులు.

"కేశాలు ఇవ్వరా కేశా!

నిన్నే నమ్మితిమి ఈశా!

ఆశ పాశ క్లేశ నాశా!" అంటూ భజన స్పీడ్ అందుకోగానే, "క్లేశనాశ" అనడం మర్చిపోయి "కేశనాశ...కేశనాశ" అని పాడడం మొదలు పెట్టారు.

నిజమే నా ద్వీపకల్పాన్ని పూర్తి మైదానం చేసిన వాడు కేశ నాశుడే. ఆ రాత్రికే అక్కడ నుండి పారిపోయి వచ్చేసాను. మరో నెలలో కేశానంద తన విగ్గులు, కొబ్బరి కురిడీలతో అజ్ఞాతంలోకి పారిపోయాడని వార్తల్లో చదివా.

నా రెండవ ప్రస్థానం... “అకేషియా టు సుకేషియా"!
నగరంలో పెద్ద పెద్ద హోర్డింగుల మీద ఎక్కడపడితే అక్కడ ప్రత్యక్షమవుతూ, టీవీల్లో “మీ బోడిగుండు.. కాకూడదు మీ ఆత్మవిశ్వాసంపై పేల్చిన గుండు!" వెంటనే సంప్రదించండి మా "అకేషియా టు సుకేషియా" అంటూ ఊదరగొట్టేస్తుంటే, నా ఆశలతో పాటు నా వెంట్రుకలనూ చిగురింప చేస్తారేమో అన్న ఆకాంక్షతో వారి క్లినిక్లో అడుగుపెట్టాను.
బ్రెజిల్ రిటర్న్డ్ డాక్టర్ లట... డా. బచ్చు బొచ్చుబాబు! డా.శిరోజా! ఇద్దరూ భార్యాభర్తలట! విడివిడిగానూ జాయింట్ గాను జుట్టుమీద ఎన్నో పరిశోధనలు చేసి, భారతదేశపు ఖల్వటాల( బట్టతలలు) మీద బొచ్చు మొలిపించడానికి స్వదేశానికి తిరిగి వచ్చారట!
సచిన్కు వాంఖడే స్టేడియం దొరికినట్టు వీరిద్దరి ప్రయోగాలకు నా బుర్ర, క్రికెట్ మైదానంలా మంచి అనువుగా దొరికింది. ఇహ చూడండి...! హెయిర్ ట్రాన్స్ప్లాంటేషన్ అని మాడులో కొక్కేలు తగిలించి వెంట్రుకలు నాటేరు. దాన్ని నా బుర్ర తిరస్కరించడంతో, హెయిర్ ఎక్స్టెన్షన్స్ అనీ, హెయిర్ వీవింగ్ అనీ, హెయిర్ టోపీస్ అని రకరకాల టోపీలు పెట్టి లక్షలు గుంజారు.
నా బుర్రను రామకీర్తన పాడుతూ వీరంతా చేసిన ప్రయోగాలకు, నా బుర్ర శాశ్వతంగా కేశమూలాలని కోల్పోయి, నాకు శాశ్వత క్లేశాన్ని మిగిల్చింది. నా వెర్రి తలకు ఇప్పుడు సూది చూసినా వెర్రెక్కిపోతోంది.
సుకేశి! నేను తెగించేసాను. నన్ను నన్నులా స్వీకరించాలి నువ్వు! గుప్పెడు వెంట్రుకల కోసం నా గుప్పెడు గుండెను ముక్కలు చెయ్యడం న్యాయమా? గురుత్వాకర్షణ శక్తికి ఏవయినా కిందకు రాలాలిసిందే! ఇది సైన్స్! నీకు తెలుసు! నేను, నా జుట్టు గ్రావిటీ బాధితులం! పోయిన జుట్టు కోసం అవిశ్రాంతంగా ప్రయత్నించి ఓడిపోయిన ఈ భగ్న కేశప్రేమికుడను కరుణించలేవా?

ఓ సుకేశీ.. చూడుమా నాకేసి
ఎన్నో నూనెలు రాసీరాసీ
నా జుట్టంతా పూర్తిగా నాకేసి
ఆక్రమించింది బట్టతల రాకాసి
నువ్వొద్దంటే ఈ కేశి
పడతాడు దారి కాశీ కేసి
ఈ విగ్గులు మోసీమోసీ

వేసారేను ఓ అందాలరాసి
అందుకే ఓ మూడుముళ్లేసి
నీ వాడినౌతా సుకేశీ!


ఇట్లు నీ ప్రేమ పిపాసి!

ఇంత దైన్యంగా రాస్తే ఎవరు మటుకు 'నో' అంటారు. పైగా ఈ మధ్య సుకేశి కుటిల కుంతలాలు కాస్త జటిల కుంతలాలుగా మారుతున్నాయి. తలనీలాలు.. తల ధవళాలు గా... రూపాంతరం చెందుతున్నాయి! అందుకే ఇంకా ముందు ముందు .. ఎన్ని సంబంధాలు చూసినా, ఇవే బోడి గుండ్లు తగలవని గ్యారెంటీ లేదు కనుక, కాస్త పెద్దమనసు చేసుకుని కేశవ్ తో పెళ్లికి ఒప్పేసుకుంది సుకేశి!

కేశపు మమకారము నీ
క్లేశముతో నంతమౌను లేదనుమానమ్
ఆశను బెంచిన కురులౌ
పేకలమేడలు మెరుపుల పిడికిటి సంఖ్యన్!

***0***

ఉగాది హాస్య కథల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ



# ట్యూబు లైట్

చాగంటి ప్రసాద్

సీతాపతికి చిన్నప్పటినుంచి తనకు జ్ఞాపకశక్తి చాలా ఎక్కువ అనే నమ్మకం చాలా ఎక్కువ. ఆ నమ్మకం తోనే ఇంతకాలం అందర్నీ దబాయించి బతికేసాడు. కానీ, 'అదంతా ఒట్టిదే' అని మొదటి రాత్రే శోభనం గదిలో భార్య చారుమతికి అర్థమయ్యి పోయింది. గ్లాసులో పాలు ఒక్క చుక్క కూడా మిగల్చకుండా ఫుల్లుగా తాగేసి బుర్రగోక్కుంటూ చారుమతికి 'సారీ!' అని చెప్పి, పిచ్చి చూపులు చూసినప్పుడు తెలిసింది చారుమతికి అతనికి మతిమరుపు అని. పెళ్లయి పట్నంలో మకాం పెట్టిన మర్నాడే, "బజార్లో సరుకులు కొనాలి స్కూటర్ తియ్యండి!"అంది సీతాపతితో చారుమతి.

"సరే!" అన్నాడు స్టైల్ గా.

చారుమతి సరుకుల సంచీ తెచ్చుకుందామని ఇంట్లోకి వెళ్ళింది. సీతాపతి మామగారిచ్చిన స్కూటర్ స్టార్ట్ చేసి సీటు మీద కూర్చున్నాడు. తన ఇంటిమీద వాలి కావు కావుమంటున్న కాకిని చూసి 'చుట్టాలొచ్చేలా ఉన్నారు. ఎవరొస్తారా!' అని ఆలోచిస్తూ పరధ్యానంగా స్కూటర్ ముందుకు పోనిచ్చాడు. చారుమతి స్కూటర్ ఎక్కకుండానే స్పీడుగా లాగించేసి గడియారం స్థంభం సెంటర్ లో చక్కర్లు కొడుతున్నాడు. ఈలోగా జేబులో సెల్ ఫోన్ మోగింది.

స్కూటర్ పక్కకి తీసి సెల్ ఆన్ చేసాడు.

"ఎక్కడ చచ్చారు?" అన్న ఖంగుమన్న చారుమతి గొంతు విన్నాకా సీతాపతికి 'మతి' వచ్చింది.

"ఇక్కడే చచ్చాను." అన్నాడు వణుకుతూ.

"ఒకసారి వెనక్కి చూసుకు చావొద్దా?"అంది చారుమతి ప్రేమగా.

తిరిగి వచ్చి, చారుమతిని ఎక్కించుకున్న సీతాపతికి దారిపొడుగునా తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టి తలంటేసింది.

"ఇంట్లోవాళ్ళతోనే ఇలా ఉంటే ఆఫీసులో ఎలా వుంటున్నారు?"అంటూ ఉతికి ఆరేసింది.

మర్నాడు పొద్దున్న ఆఫీస్ కొచ్చిన వెంటనే,

"ఎమ్ డి గారు పిలుస్తున్నారు సారు!" అంటూ ప్యూన్ చెప్పాడు. పరిగెత్తుకుంటూ లోపలికెళ్లిన సీతాపతిని బాసు తీక్షణంగా చూస్తూ,

“రెండు గంటలైంది. ఏమైంది ఆ ప్రాజెక్టు రిపోర్ట్ ?"అన్నాడు.
“నా... నా కళ్ళజోడు కనబడ్డం లేదు సర్ ! అది లేకపోతే క్షణం గడవదు సార్!" అన్నాడు ఒణికిపోతూ.
"అదేమిటి నీ బొంద! నెత్తిమీద కళ్ళజోడు పెద్ద షారుఖాన్లా పెట్టుకుని?" అన్నాడు విచిత్రంగా చూస్తూ.
సీతాపతి గబుక్కుని నెత్తిమీద తడుముకుని, ఎప్పటిలా బుర్ర గోక్కోనందుకు నాలిక్కర్చుకున్నాడు.
"యూ మైండ్ లెస్ ఫెలో! రెండు గంటలు టైము వేస్టు చేసావు" అని తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టాడు బాసు.
అప్పుడే బాసు గదిలోకి వచ్చిన స్టెనో ఇందుమతి సీతాపతిని తిట్టడం విని అతను పడుతున్న అవస్త చూసి కిసుక్కున నవ్వింది.
బాసు తిట్టిన దాని కన్నా ఇందుమతి నవ్విందని అవమానంతో, ఏడుపు మొహంతో ఉసూరుమంటూ ఆయన గదిలోంచి బయటపడ్డాడు.
"ఏమిటి సీతాపతి.. ఖుషీగా వున్నావ్?"అన్నాడు పక్క సీటు అప్పారావు.
"ఖుషీనా, పాడా? బాస్ తిట్టడానికి పుట్టినట్లున్నాడు." అంటూ ఏడుపు మొహంతో జరిగింది చెప్పాడు సీతాపతి.
“ఊరుకో సీతాపతి! ఇందుమతికి వెటకారం ఎక్కువ! బాసు స్టెనో కదా, గోరోజనం కూడా ఎక్కువే! అయినా ఈ మధ్య నీకు మతిమరుపు మరీ ఎక్కువైపోయింది. మొన్నటికి మొన్న అర్జెంట్ ఫైల్ చంకలో పెట్టుకుని వాష్ రూమ్ కి వెళ్ళి పని కానిచ్చి ఫైలు అక్కడే వదిలేసి వచ్చేసావు! ఎంత అర్జెంట్ అయితే మాత్రం అదేం పనయ్యా? సమయానికి మన ప్యూను గాడు చూసి బాసుకి పట్టికెళ్ళిచ్చాడు. ఆ రోజు బాసు భారతదేశంలో ఎన్ని రకాల డాన్సులు ఉన్నాయో అన్నీ ఆయన ఆడి, నీచేత కూడా ఆడించాడు కదా!"
“అవును మర్చేపోయాను!" అని బుర్ర గోక్కున్నాడు సీతాపతి.
“నీ ఖర్మ! ఈ మతిమరుపు రోగం తగ్గడానికి ఏదైనా మందు వాడు. ఇప్పుడు వీధికో డాక్టర్ నీలాంటి వాళ్ళకోసం ఎదురు చూస్తున్నారు. ఓ పని చెయ్యి. జేబులో ఎంతున్నయి?" అన్నాడు అప్పారావు.
"ఏమిటి?"
"కరెన్సీ"
జేబులోంచి తీసి లెక్కెట్టి “వెయ్యి" అన్నాడు.
"ఇలా ఇయ్యి. ఒకటో తారీకున ఇస్తాను!" అని లాక్కుని జేబులో పెట్టుకున్నాడు అప్పారావు.
"ఒకటో తారీకున ఇస్తావుగా?"అన్నాడు సీతాపతి అమాయకంగా
"అడిగి తీసుకో!" అన్నాడు అప్పారావు.
“అలాగే అప్పారావ్!" అని చెప్పి బల్లమీద చేతులుపెట్టి దేనికోసమో వెతుకుతున్నాడు.
“ఏంటి వెతుకుతున్నావు?"
“ఆహ్! ఏం లేదు ! పెన్ను ఎక్కడ పెట్టేనా! అని.” నసిగాడు.

“అదిగో నీ జేబులో! వెనకటికి నీలాంటిదే ఉయ్యాలలో బిడ్డను పెట్టుకుని..." తల బాదుకున్నాడు అప్పారావు.

“జ్ఞాపకం వచ్చింది. ఊరంతా వెతుక్కుందట!" అన్నాడు.

"ముందు పెన్ను సంగతి చూసుకో!"

“అరే! ఇక్కడ ఉందా ?" అని జేబులో పెన్ను చూసి 'కొలంబస్ అమెరికాని కనిపెట్టినంతగా ' ఆనంద పడుతూ పని మొదలెట్టాడు.

***

"ఏంట్రా! ఆ లైటు మిణుకు మిణుకు మంటూ వెలుగుతోంది... ఆరిపోతోంది?" కొడుకు రఘుని అడిగాడు సీతాపతి.

"ట్యూబులైటు కదా నాన్న! నీలాంటిదే." అన్నాడు రఘు చిలిపిగా టీజ్ చేస్తూ. సీతాపతికి తనమీద తనకే కోపం వచ్చింది. తన బుర్రమీద తనకే చిరాకేసింది.

"ఛీ! ఛీ! పిల్లల చేత కూడా `ట్యూబ్ లైట్` అనిపించుకుంటున్నాను. ఆఫీసులో లేడీ స్టేనో ఇందుమతి కూడా ఇలాగే నిక్ నేమ్ పెట్టి అందరితో చెప్పి ఆట పట్టిస్తోంది. తన చిన్నప్పుడు ఇంట్లో అందరూ మా `సీతు గాడికి` జ్ఞాపకశక్తి చాలా ఎక్కువ..` అని పొగిడేవారు. అమ్మ దాచిన సున్నుండలు, నాన్న దాచిన డబ్బులు ఎక్కడ ఉన్నాయో ఇట్టే పట్టేసేవాడు. కానీ, స్కూల్ పుస్తకాలు మాత్రం ఎక్కడ పెట్టేవాడో గుర్తుకొచ్చేదికాదు... హాచ్చరంగా!

'ఏదైనా మాంఛి మందు వాడాలి. తన జ్ఞాపకశక్తి అమోఘం అని అందరూ మెచ్చుకోవాలనుకున్నాడు."

***

ఆ రోజు సూర్యనారాయణమూర్తి ఉదయించడం మర్చిపోయి మబ్బుల్లో బబ్బున్నట్టున్నాడు. ఇంకా చీకటి తొలగలేదు. ఇంట్లో వాళ్ళని జ్ఞాపకం చేయమని చెప్పడం వల్ల, “ఏవండోయ్! ఎవర్నో మంగపతి అనే డాక్టరుగార్ని కలుస్తానన్నారు కదా! లేవండి!" అని గుర్రెట్టి నిద్రోతున్న సీతాపతిని లేపింది చారుమతి.

“మంగపతి కాదే ! అదేదో మే...మే..." అని మేకలా అరుస్తోంటే,

"మేధాపతి!" అని టక్కున చెప్పింది చారుమతి.

"అవునవును! అబ్బా ఎంత జ్ఞాపకశక్తే చారు... నీకు!” అని నోరావలించాడు.

"పొగిడింది చాల్లెండి! తెమలండి!"అని అరిచింది.

"ఇదిగో! పది నిముషాల్లో తెమలనూ!"అంటూ బాత్రూమ్ లో దూరాడు. వంటింట్లో పనిలో ఉన్న చారుమతికి పనమ్మాయి కేక కెవ్వుమని వినబడింది. చారుమతి కంగారుగా హాల్లో పరుగెత్తుకు వచ్చింది. అక్కడ దృశ్యం చూసి కొయ్యబారి పోయింది. పనమ్మాయి గుడ్లు తేలేసి పడిపోయి ఉంది. అదేమి పట్టనట్టు సీతాపతి తువ్వాలు వెతుకుతున్నాడు దిగంబర స్వామిలా!

“ఛీ ఛీ! మీ మతిపరుపు మండ! తువ్వాలు బాత్రూము తలుపు మీద వేసి, ఆ అవతారంతో ఇల్లాంత తిరుగుతారేంటండి? ఈ నిజరూప దర్శనం ఏమిటండీ? పెర్రిపిల్ల! ఎంత ఝుడుసుకుందో !" అని ముఖం మీద నీళ్ళు చల్లి లేపే ప్రయత్నంలో పడింది.

పెళ్ళాం ఇంకేం తిడుతుందో అని గబగబా బట్టలు వేసుకుని బయటకు జారుకుని ఆయుర్వేదం డాక్టర్ మేధాపతి దగ్గర తేలి, తన రోగ బాధ చెప్పాడు.

"ఓస్ ఇదేనా! నా దగ్గరకు వచ్చిన వాళ్ళు నేనిచ్చిన మందు వాడి, ముప్పై ఏళ్ళైనా ఇప్పటికీ నన్ను గుర్తుపట్టి పాత బాకీల డబ్బులిచ్చి వెడుతూంటారు తెలుసా! మీ బుర్ర నా చేతులో పెట్టండి! నేను చూసుకుంటాను." అని చెయ్యి చాపాడు.

సీతాపతికి కంగారొచ్చింది తన బుర్రకి ఏపైనా స్క్రూలున్నాయా? ఇప్పిచ్చేయడానికి అని భయమేసింది.

“ఎలా సార్?" అన్నాడు భయంగా.

"రామాపతి గారు! చేతిలో పెట్టమన్నది నా కన్సల్టేషన్ ఫీజండి బాబు !" అని మేధాపతి ఒళ్ళంతా కదిలేలా గట్టిగా నవ్వాడు.

“డాక్టరుగారు! నా పేరు సీతాపతి అండి ! "

“ఓహ్! మీ జ్ఞాపకశక్తి పరీక్షిద్దామని జస్ట్ సింపుల్ టెస్ట్. మీ పేరు మీకు గుర్తుంది. గ్రేట్!” అని మళ్ళీ చెయ్యి చాపాడు.

సీతాపతి వెంటనే తన జేబులోంచి ఐదు వందలు తీసి మేధాపతి చేతులో పెట్టాడు.

“వెరీ షార్ప్...జెంటిల్మెన్...!" అని ఆనందంగా అరిచాడు.

ఇంతలో అక్కడ టేబులు మీద ఉన్న సెల్ ఫోను మ్రోగింది. వినమని సైగ చేస్తూ స్పీకర్ ఆన్ చేసాడు.

అవతల పక్కనుంచి ఒకతను, “డాక్టరుగారు! మా అబ్బాయి మెమరీ విపరీతంగా పెరిగింది సర్! నాలుగో క్లాసులో చెప్పిన అశోకుడు చెట్లు నాటించెను అనే పాఠం కూడా భలే ఒప్పచెప్పేస్తున్నాడు.” అని ఆగాడు.

“మరి ఏటనుకున్నారు ఈ మేధాపతి అంటే?" అని స్టెత స్కోపు ఎగరేసి సీతాపతి కేసి స్టైలుగా చూశాడు.

సీతాపతి ఆశ్చర్యంగా నోరు తెరుచుకుని రెండు చేతులు జోడించాడు.

“ఇంకా చెప్పండి విశేషాలు!" అని కాలు ఊపుతూ అడిగాడు మేధాపతి.

"కానీ... ఇంటర్ పాఠాలన్నీ మర్చిపోయాడండి. మాకు చాలా భయమేస్తోంది సార్" అని కంగారుగా చెప్పాడు.

"ఏం పర్లేదు! నేనిచ్చిన మందు ఛాలా పవర్ ఫుల్! రూట్ లెవెల్ నుంచి అది పని చేస్తోంది. కొద్దిరోజులకి ఇంటర్ పాఠమే కాదు, బీ టెక్ పాఠాలు కూడా ఒప్ప చెప్పేస్తాడు!" అని హామి ఇచ్చాడు డాక్టరు మేధాపతి.

"బైదిబై నా పాత బాకీ ఏం చేసారు?"

"హల్లో...హల్లో... మీరెవరు సార్? పొరపాటున ఫోన్ నొక్కేను ! సారీ సర్!" అని ఫోను పెట్టేసాడతను.

మేధాపతికి చిర్రెత్తుకొచ్చింది. "ఈసారి నా దగ్గరకు  వచ్చినప్పుడు వీడికి గట్టి డోసు ఇవ్వాలి.  అప్పుడు వీడి పూర్వ జన్మ కూడా జ్ఞాపకం వస్తుంది. ఫీజు బాకీ ఇవ్వడం మర్చిపోయినట్టు నటిస్తున్నాడు వెధవ." అని ఈ లోకంలోకి వచ్చి, “ఆ..! చెప్పండి మహీపతి గారు!" అన్నాడు.

"నా పేరు...సీతాపతండి!”

"ఓహ్! మీ జ్ఞాపకశక్తి  బాగా ఇంప్రూవ్ అయ్యింది! జస్ట్ టెస్టింగ్ కి అడిగా." అని మళ్ళీ కిచకిచ లాడాడు.

సీతాపతి తన బాధ అంతా గబగబా ఒప్పచెప్పాడు ఎక్కడ మర్చిపోతానో అని .

సీతాపతి చెప్పింది విని, ఒక క్షణం పైకి క్రిందకి చూశాడు, బుర్ర మీద స్టెత్ స్కోపుతో గట్టిగా కొట్టుకున్నాడు.

“ఆ గుర్తుకొచ్చింది! మీ బుర్ర పాదరసంలా పని చేయడానికి, అమోఘమైన జ్ఞాపకశక్తికి మాంఛి మందు ఇస్తాను. దానితో మీరు చిన్నప్పటి విషయాలు, జరిగిపోయినవి, మర్చిపోయినవి.. అన్నీ మీ మెమరీలోకి దూసుకు  వచ్చేస్తాయి." అంటూ ప్రిస్క్రిప్షన్ రాసిచ్చాడు.

“ఈ మందుతో పాటు మీకు ఒక చిట్కా చెప్తాను. మీకు ఏదైనా వస్తువు  కావలసి వస్తే మర్చిపోకుండా ఉండడానికి  దాని పేరుని మననం చేసుకుంటూ వెతకండి. అది మీ మెదడుకి చక్కని  వ్యాయామం. ఠక్కుని దొరుకుతుంది ఆ వస్తువు." అన్నాడు.

"తెలిసింది." అని తల ఊపాడు సీతాపతి.  వెంటనే ఇంప్లిమెంటు చేసాడు.

***

ఒక రోజు ఆఫీసులో  లేడీ స్టెనో  ఇందుమతితో పని పడింది.

"ఇందుమతి! ఇందుమతి! " అని ఆవిడ పేరుని జపం చేస్తూంటే  అప్పారావు.....

“సీతాపతి! ఆవిడ భర్త పెద్ద రౌడీ! మంచి వస్తాదులా ఉంటాడు. మీరు ఆవిడ నామస్మరణ చేసినట్లు ఇందుమతికి తెలిస్తే ప్రమాదం. ఆవిడ మొగుడికి చెప్తే మరి ప్రమాదం. తోలు ఒలిచేస్తాడు.” అన్నాడు మెల్లిగా.

"అబ్బా! ఉండవయ్య బాబు! ఆవిడ మీద లవ్వు  కాదు, కెవ్వు కాదు! ఇది మా  డాక్టర్ చెప్పిన చిట్కా. అవునూ...నా వెయ్యి రూపాయలు..."అన్నాడు.

"ఇవ్వాళ తారీకెంత?"

"ఒకటి."

"వెరీ గుడ్. నీ మెమరీ బాగా ఇంప్రూవ్ అయ్యింది. రేపు పదో తారీకున ఇస్తాను. సరేనా?"

సీతాపతి తలూపాడు.

ఆ రోజు రాత్రి ఎవరో గట్టిగా కుదుపుతుంటే నిద్రలోంచి లేచి కంగారుగా చూసాడు సీతాపతి. చారుమతి గుర్రుగా చూసి "ఎవత్తి  ఆ భానుమతి? అంత బావుంటుందా?  దాన్ని నిద్రలో ఒకటే పలవరిస్తున్నావు” అని నిలదీసింది.

“భానుమతా? ఆవిడేవరు?" అని బుర్ర గోక్కుని. "ఓహ్.. ఇందుమతి! మా లేడీ స్టెనో! ఆవిడ అసలు పేరు మరిచి  రాంగ్ నేమ్ నిద్రట్లో  పలవరిస్తున్నానా!" అన్నాడు కంగారుగా.

చారుమతి మహోగ్రరూపం చూసి జడుసుకుని, "అది...అది..." అంటూ బుర్ర గోక్కుని అసలు విషయం చెప్పాడు.

***

సీతాపతి డాక్టర్ మేధాపతి ఇచ్చిన మందు చాలా నిష్టగా వాడాడు. కొన్ని రోజులకి డాక్టర్ రాసిచ్చిన మందు అయిపోయింది. ప్రిస్క్రిప్షన్ ఎక్కడ పెట్టాడో గుర్తుకు రాలేదు. ఆ మందు ఉన్న బాటిల్ బావుందని ముచ్చటపడి చారుమతి దాంట్లో ఉసిరి పచ్చడి పెట్టేసింది.

ఆ మందు పేరు ఆమెకి గుర్తుంది. దాని నామధేయం సీతాపతికి ఉపదేశించింది.

మందు కొనుక్కోడానికి ఎక్కడ మర్చిపోతానో అని షాపు వరకు ఆ పేరుని మననం చేసుకుంటూ నడుచుకుంటూ వెడుతున్నాడు. పక్కనే నడుస్తున్న ఒకామె సడన్ గా సీతాపతి కాలర్ పట్టుకుని.,..

"ఏంట్రా! ఇందాకటినుంచి చూస్తున్నాను! నా పేరే పిలుస్తూ టీజ్ చేస్తున్నావు!" అని గట్టిగా అరిచి చెప్పుతీసింది. జనం మూగి అందరూ కలసి బాదేస్తుంటే తట్టుకోలేక,

"బాబోయ్! నేను పిలుస్తున్నది ఆవిణ్ణి కాదు! 'సరస్వతీ లేహ్యం' అనే మందు పేరు. ఎక్కడ మర్చిపోతానో అని పైకి అరుచుకుంటూ నడుస్తున్నాను." అని గోలపెడితే విడిచి పెట్టారు.

బ్రతుకు జీవుడా! అని ఇంటికి వచ్చి పడ్డాడు. చొక్కా చిరిగి పోయి, పాంటు మట్టికొట్టుకు పోయి ఉన్న అతనిని చారుమతి చూసి,

"ఏమైందండి? అని కంగారు పడింది. జరిగింది విని, "అయ్యో! మీదసలు మతిమరుపు కాదండి. ఎన్నో ఏళ్ళనుంచి చూస్తున్నాను. మీకు మెమరీ బాగానే ఉంటుంది. కరంటు బిల్లు, గ్యాస్ బుకింగ్, పిల్లల పరీక్షలు, ఫీజులు, బ్యాంక్ బాలన్స్ అన్నీ గుర్తుంటాయి. మీ కంగారు మనస్తత్వం వల్ల సమయానికి జ్ఞాపకం రావు అంతే! అదీగాక, మీరు అన్ని పనులకు నా మీదో, పిల్లలమీదో ఆధారపడడం బాగా అలవాటైపోయింది. ఆఫీసులో కూడా మీ పక్కవాడి మీద, ప్యూను మీద వాలిపోతారు మరి. దాంతో మీకు ఏ వస్తువు ఎక్కడ ఉందో అవసరం పడదు కదా! బుర్రకి పనిలేదు. దానితో సమయానికి జ్ఞాపకం రాదు. ప్రశాంతంగా ఆలోచిస్తే మీకే తెలుస్తుంది!" అని సీతాపతికి క్లాసు పీకింది. సీతాపతికి తన ఇంటిల్లాలి ఉపదేశం బాగా బుర్రకెక్కింది.

"నీ లాంటి వైద్యురాల్ని ఇంట్లో పెట్టుకుని ఎంత టైము వేస్టు చేసాను." అని ప్రేమగా దగ్గరకు తీసుకున్నాడు. చారుమతి తన చారుడేసి కళ్ళు సిగ్గుతో టపటప లాడించింది.

"నాన్న! నీకు ఫోన్.. ఎవరో డాక్టర్ మేధాపతిట లైన్లో ఉన్నారు!" కూతురు అరుపు.

"అవసరం లేదని చెప్పు!" అని మరింత గట్టిగా అరిచాడు సీతాపతి గొప్ప కాన్ఫిడెన్స్ తో.

సెల్ లో కాల్ చేసి "హాల్లో! అప్పారావు. ఈరోజు పదో తారీకు. నా వెయ్యి ఇయ్యి నాయనా!" అన్నాడు.

"చూసావా? అప్పిస్తే మర్చిపోతున్నావా? నీకు మతిమరుపు కాదు. బద్ధకం. ఒకటో తేదీన ఇస్తాలే!" అన్నాడు అప్పారావు.

***0***

ఉగాది హాస్య కథల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ



# రాగి నీరు

కనకగిరి రాజేశ్వరి

"రేపట్నించి రాగి నీరు తాగుదామని నిశ్చయించేసుకున్నాను!" ఆఫీసు నుంచి వస్తూనే డిక్లేర్ చేసాడు సుగుణరావు.

"అంత సడెన్ గా ఎందుకు నిర్ణయం తీసుకున్నారు?" వాట్సప్ చెక్ చేసుకుంటున్న సుగుణ అడిగింది.

"ఈవేళ మా మేనేజర్ ఆఫీసులో ఆరోగ్య సూత్రాల మీద మీటింగ్ పెట్టారు. పేరున్న ఆయుర్వేద డాక్టర్ ఒకాయన వచ్చి, ఇంట్లో ఉన్న వాము, జీలకర్రల తోనే ఆరోగ్యం కాపాడుకోవచ్చని చెప్పాడు. రోజూ చారు తాగితే చాలా మంచిదిట. నువ్వు చారు పెడతానంటే నేను వద్దంటాను. కానీ , రేపణ్ణించీ తాగుతానులే. ఆయన రోజుకి నాలుగు లీటర్ల నీరు రాగిబిందెలోది రాగి గ్లాసుతో తాగితే చాలా మంచిదని, బి.పి, కోపం కంట్రోల్ లో ఉంటాయనీ చెప్పాడు." అన్నాడు సుగుణరావు.

"అయితే మంచిదే. ఏం కారణం లేకుండా నామీద చిర్రుబుర్రులాడడం తగ్గుతుందేమో ప్రయత్నించండి." అంది సుగుణ.

అలా అన్నందుకు సుగుణ వైపు ఓసారి కోపంగా చూసి ,"ఇంటికి వచ్చిన వెంటనే కాఫీ లాంటి దేమైనా ఇచ్చేదుందా, లేక ఆ ఫోన్ చూసుకుంటూ కూర్చోడమేనా? ఏమన్నా అంటే నాకు కోపం ఎక్కువ అని ప్రచారం. నువ్వు చేసే పనులు అలా ఉంటాయి మరి. నా తప్పేముంది?" అన్నాడు సుగుణరావు.

"అయ్యో రామా! రాగానే కాఫీ ఇస్తే బూట్లు విప్పి కాళ్ళైనా కడుక్కోవాలా? వద్దా? అంటారు. ఇవ్వకపోతే ఇలా!" మిమ్మల్ని నేను కాబట్టి….." అని సగంలో ఆపేసి కాఫీ కలపడానికి లోపలికి వెళ్ళింది సుగుణ.

"నువ్వు మాత్రం… ఇస్తే అలా… లేకపోతే ఎంతసేపైనా ఇవ్వవు. ఎన్నేళ్ళైనా ఎప్పుడు ఇవ్వాలో నీకు తెలియడం లేదు. ఖర్మ…ఖర్మ." అని కాళ్ళు కడుక్కోవడానికి లోపలికెళ్ళాడు, సుగుణరావు.

సుగుణ తెచ్చిన కాఫీ తీరిగ్గా తాగుతూ, "రేపు నాలుగు లీటర్ల నీళ్లు రాగి బిందెలో పోసి ఉంచు. తాగుతాను" అన్నాడు సుగుణరావు.

"మనింట్లో రాగిబిందె లేదు" అంది సుగుణ.

"పోనీలే రాగి గ్లాసు లో పొయ్యి. దాంట్లో నే తాగుతాను" అన్నాడు సుగుణరావు.

"అదీ లేదు." సుగుణ సమాచారం ఇచ్చింది.

"అదేమిటి? అసలు ఇంట్లో ఏ రాగి సామాను ఉంది? అది చెప్పు నాకు ముందు!" అన్నాడు సుగుణరావు విసుగ్గా.

సుగుణ సోఫాలో మఠం వేసుకుని కూర్చుని, "మీ అమ్మగారి జ్ఞాపకార్థం మీరు దాచుకున్న ఆవిడ పంచపాత్ర, ఉద్ధరిణీ..." అనంగానే

"మరింకేం! ఆ పంచపాత్రతోనే నీళ్ళు తాగుతాను! అన్నాడు సుగుణరావు మధ్యలో సుగుణని ఆపి.

"తాగొచ్చు! కానీ దానికి చిల్లుంది." అంది సుగుణ తాపీగా.

"చిల్లు పంచపాత్ర ఎందుకుందీ?" చిర్రాగ్గా అడిగాడు. సు.రా.

"బాగుంది! మీ అమ్మగారి జ్ఞాపకార్థం ఉంచమన్నారు మీరు. లేక పోతే నాకేమైనా సరదా ఏమిటి...?" అని ఇంకా ఏమి అనేదో మధ్యలోనే ఆపి,

"అబ్బా! సరే! మిగతావి ఏమిటున్నాయో చెప్పు!" అన్నాడు సు.రా పంతంగా

"ఇంకా దేముడి సింహాసనంలో రెండు రాగి కాణీలూ, రెండు రాగి నయాపైసలూ, ఒక కాశీ గంగ చెంబూ అద్దైనా చాలా చిన్నదే ..." అని దీర్ఘం తీస్తూ చెప్పింది సుగుణ.

"అంతేనా! మనింట్లో బోలెడు రాగి సామాను ఉండాలి కదా! అదంతా ఏమయింది? "అనడిగాడు సుగుణరావు సుగుణని అనుమానం గా చూస్తూ.

"అయ్యో రామ! కిలో వందపైన పెట్టి చింతపండు కొని ఈ సామానంతా తోమితే, నా జీతంలో సగం చింతపండుకే అయిపోతుందని గోలపెట్టి, మీ అమ్మగారు వద్దంటున్నా వినకుండా ఆ సామానంతా అమ్మేసారు. ఆ మాట మర్చి పోయారా మీరు?" సమయం దొరికింది కదా అని ఎత్తి పొడిచింది, సుగుణ.

"సరే! సరే! ఇంకేమైనా సామాను దాచే ఉంటారు మీరు. అవేమైనా ఉన్నాయేమో చెప్పు" అన్నాడు సు. రా.

"రాగి రాగోరుతుందని మీ అమ్మగారు నయా పైసలూ, పాతకాలం కాణీలూ, బీరువాలో దాచారు అవి ఉన్నాయి. పెళ్ళి వచ్చేస్తుంటే, మా పెద్దమ్మమ్మ...పాపం! బీదది, బ్రిటిష్ కాలం నాటి పెద్ద కాణీ చేతిలో పెట్టి, "ఇంతకన్నా ఏమీ ఇవ్వలేనే అమ్మడూ అంది. ఆవిడ జ్ఞాపకార్థం ఆ కాణీని నా బీరువాలో దాచుకున్నాను." అంది సుగుణ.

"మంచినీళ్ళు తాగడానికి గ్లాసూ, బిందె, కావాలి కాని, ఈ కాణీల గోల ఏమిటి అసందర్భంగా?" అన్నాడు సుగుణరావు.

"మరేం చెయ్యను? మీరు ఇంట్లో రాగి సామాను ఏముందో చెప్పమన్నారు. నేను చెప్తున్నాను. అన్నట్టు ఇంకో రెండు ఉన్నాయండోయ్! చెప్పడం మర్చిపోయాను." అంది సుగుణ నవ్వుతూ.

"ఏమిటవి?" అడిగాడు సుగుణరావు. ఇప్పుడైనా ఓ గ్లాసైనా ఉందని అంటుందన్న ఆశతో.

"మీ నానమ్మగారు మీ చిన్నప్పుడు రెండు చిల్లు కాణీలు మొలతాడులో కట్టారుట. అవే మళ్ళీ మీ అమ్మగారు మనబ్బాయి మొలతాడులో కట్టారు. ఆ కాణీలే మనబ్బాయి కొడుక్కి కూడా కట్టమని చెప్పారు. ఇప్పటి వాళ్ళు పుట్టిన దగ్గర నించీ డైపర్లు వేసేస్తున్నారు కదా, ఇంక కాణీలు కట్టనిస్తుందా రాబోయే కోడలు?" అన్న సుగుణని కోపంగా చూసాడు, సుగుణరావు.

మొలతాడులో చిల్లుకాణీలు గురించి మాట్లాడుతున్నప్పుడు సుగుణ నవ్వు ఆపుకోవడం గమనించాడు.

"ఆలూ లేదు చూలూ లేదు కొడుకు పేరు సోమలింగం అని, మనవాడికి ఇంకా పెళ్ళే అవలేదు! ఐనా, మంచినీళ్లు తాగడం గురించి మాట్లాడుతోంటే మనవడి మొల్లో చిల్లుకాణీలు కట్టగలమా లేదా అని అడుగుతున్నావేమిటి? అసలు నీళ్ళు తాగడానికి వీలుగా ఏమిటి ఉందో తేల్చి చెప్పు" అన్నాడు.

"అలా ఐతే ఉద్ధరిణె తప్పించి ఏమీ లేదు!" తేల్చేసింది సుగుణ.

"ఉద్ధరిణెతో నాలుగు లీటర్ల నీళ్లు ఎలా తాగుతారండీ పాపం!" అని జాలి కూడా పడింది.

"సరే! రేపు ఆఫీసు నుంచి అలా వెళ్ళి ఓ రాగి బిందె, గ్లాసూ కొనుక్కొస్తాను." నిర్ణయం ప్రకటించాడు సుగుణరావు.

"ఈ గోలలో పడి వార్తలు చూడలేదు" అని టీవీ ఆన్ చేసాడో లేదో పిడుగులాటి వార్త.

కరోనా మహమ్మారి వల్ల దేశమంతటా లాక్ డౌన్ ప్రకటించారు. నిత్యావసర వస్తువులు తప్పించి అన్ని దుకాణాలూ బంద్.

"అయ్యో! మరి మీ రాగి నీరు మాటేమిటండీ? ఇంక ఉద్ధరిణెతోనే తాగాలన్నమాట" విచారంగా అంది సుగుణ.

సుగుణరావు ఏమనే వాడో కాని, ఈలోగా మొబైల్ మోగింది. అది తీసుకుని బాల్కనీ లోకి వెళ్ళాడు.

ఫోన్ లో మాట్లాడడం ముగించి లోపలికి వచ్చేసరికి సుగుణ ఒక పేపరూ, పెన్నూ పట్టుకుని ఏమిటో లెక్కలు వేసేస్తోంది. పక్కన ఉద్ధరిణా, దగ్గు మందు సీసాతో వచ్చే కొల డొక్కూ ఉన్నాయి.

సుగుణరావుని చూడగానే "వచ్చారా! ఇదిగో ఈ ఉద్ధరిణెతో నీళ్ళు తాగండి . ఒకసారి తాగడానికి ఎంత టైం పడుతుందో చూడాలి." అని హడావిడి పెట్టి సుగుణరావు చేతిలో ఉద్ధరిణెతో నీళ్ళు పోసి అతను నీళ్ళు తాగినప్పుడు డిజిటల్ వాచీలో టైం నోట్ చేసింది.

మళ్ళీ సుగుణరావు ఫోన్ మోగింది. సుబ్బారావుతో లాక్ డౌన్, వర్క్ ఫ్రం హోమ్ లాటి వన్నీ మాట్లాడి లోపలికొచ్చేసరికి సుగుణ,

"అమ్మయ్య! ఇదిగోనండీ లెక్క వేసేసాను. ఈ ఉద్ధరిణె రెండు మి.లీ. లు. నాలుగు లీటర్లు నాలుగు వేల మి.లీ.లు అంటే రెండు వేల ఉద్ధరిణెలు. ఒకసారి తాగడానికి నాలుగు సెకండ్ లు. అంటే నాలుగు లీటర్ల నీళ్ళకి ఎనిమిది వేల సెకండ్లు. దాన్ని మూడు వేల ఆరువందలతో భాగిస్తే, ఓ రెండు గంటల మీద కొంచెం టైమన్న మాట. ఎలాగా ఆఫీసుకి వెళ్ళక్కరలేదు కాబట్టి కొంచెం కొంచెం చొప్పున తాగెయ్యొచ్చు. ఏమంటారు?" అని అంటున్న సుగుణని వెర్రిగా చూసాడు సు. రా.

సుగుణ పకపకా నవ్వింది.

"ఎందుకలా నవ్వుతున్నావ్" చిరాగ్గా అడిగాడు సు. రా.

"ఏమీ లేదండీ! మీరు ఉద్ధరిణెతో నాలుగు లీటర్ల నీళ్లు తాగడం ఊహించుకుంటే నవ్వొచ్చేస్తోంది" అంది సుగుణ. మళ్ళీ "రెండు వేలసార్లు చెయ్యి ఎత్తి దింపితే నొప్పెడుతుందేమో? పాపం." అని విచారం ప్రకటించింది.

ఏమీ  అనలేక సుగుణరావు నిట్టూర్చాడు.

మర్నాడు పొద్దున్న నిద్ర లేచి  కాఫీకోసం వచ్చిన సుగుణరావుతో,

"మీ కోసం రాగి నీరు తయారు చేసాను. డైనింగ్ టేబుల్ మీద ఉంది చూడండి." అంది సుగుణ.

రాగి బిందె కోసం చూసిన సుగుణరావుకి ఓ పెద్ద స్టీలు గిన్నె కనిపించింది. మూత తీసి చూస్తే, గిన్నెలో నీళ్ళూ అందులో తళ తళా మెరిసేటట్టు తోమిన రాగి కాణీలూ, పంచపాత్ర కనిపించాయి. పక్కనే ఉద్ధరిణె.

"ఇదేమిటి?" ఆశ్చర్యపోయాడు సు. రా.

"అదేనండీ! రాగి బిందెలో నీళ్ళైతే ఏమిటి? నీళ్ళల్లో  రాగి సామానైతే ఏమిటి? ఫలితం ఒకటేగా!

రాగికి, నీళ్ళకి కాంటాక్ట్. అందుకే సింపుల్ గా రాగి నీరు తయారు చేసాను. మీ చిల్లి కానీలు వెయ్యలేదు లెండి. " నవ్వు ఆపుకుంటూ చెప్పింది, సుగుణ.

"మా అమ్మ లేకపోయే సరికి నీకు మరీ అడ్డూ అదుపూ లేకపోతోంది." అన్నాడు ,సు.రా. ఉక్రోషంగా.

కరోనా టైం లో పాటించాల్సిన నియమాలు గురించి మాట్లాడడానికి అపార్ట్మెంట్ సెక్రటరీ, ప్రెసిడెంటూ వచ్చారనీ, మీటింగ్ కి రమ్మని వాచ్   మాన్ వచ్చి చెప్పాడు.

ఆ మీటింగ్ కి వెళ్ళి వచ్చేసరికి, లంచ్ టైం అయ్యింది.

భోజనానికి కూర్చున్న సుగుణరావుకి తళతళా మెరుస్తూ మంచి డిజైన్ తో పెద్ద రాగి కూజా కుళాయి తో ఉన్నది కనబడింది.

సుగుణరావు ఆశ్చర్యపోయాడు.

"ఇదెక్కడిది?" అనడిగాడు.

"కిందటిసారి కిట్టీ పార్టీలో పెట్టిన పోటీలో నాకు ఫస్ట్ ప్రైజ్ వచ్చింది. డబ్బులు కలెక్ట్ చేసి ప్రైజ్ కొని నిన్ననే ఇచ్చారు ఇది."అంది సుగుణ నవ్వుతూ.

" మరి నిన్నే ఎందుకు చెప్పలేదు ఇది ఉందని" అడిగాడు సుగుణరావు కొంచెం ఉడుక్కున్నట్టు మొహం పెట్టి.

"పోటీకి ఇచ్చిన టాపిక్ ఏమిటో తెలుసా? భర్తని ఆట పట్టించడం ఎలా అని." అని పకపకా నవ్వుతున్న సుగుణతో శృతి కలిపాడు  సుగుణరావు.

***0***

ఉగాది హాస్య కథల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ

# సుబ్బారావు-ఓ వాహన చోదకుడి కథ



**శ్రీపాద సౌదామిని**

కొద్దిసేపటిలో ప్రారంభమయ్యే నా ఉపన్యాసానికి రంగం సిద్ధం చేసుకుంటున్నాను. చాలా రోజుల తర్వాత, తెలుగు గడ్డపై తెలుగులో మాట్లాడబోతున్నాను. పైగా ముఖ్యమంత్రి గారు ముఖ్య అతిధి.

“నా విజయానికి ముఖ్య కారణం... నా శ్రమ, పట్టుదల ఇంకా వీటికి తోడు, ధనూక వారి పురుగుల మందు...” ఛీ ఛీ.. ఇది చిన్నప్పుడు ఆకాశవాణిలో వచ్చిన వాణిజ్య ప్రకటన.

అలా కాదు “నా విజయానికి ముఖ్య కారణం నా శ్రమ, పట్టుదల, ఇంకా నా బలహీనత. బలహీనత లేకపోతే సమాజానికి ప్రగతే ఉండదు”..

అవును నా బలహీనతే నన్ను ముందుకు నడిపించింది, ఈనాడు నన్ను మీ ముందు ఇలా నిలబెట్టింది.

అదేమిటో తెలుసుకోవాలంటే నా ఏడో తరగతికి వెళ్ళాల్సిందే. అప్పుడు నా పుట్టిన రోజుకి నాన్న బహుమతిగా సైకిల్ కొన్నారు. ఆ రోజు ఆనందంతో ఉబ్బి తబ్బిబ్బయిపోయాను.

మేము అప్పుడు ఒక పల్లెటూరిలో డాబా ఇంటిలో ఉండే వాళ్ళం. నాన్న మా పల్లెటూళ్ళోని చిన్న రోడ్డు మీదకి సైకిల్ నేర్పటానికి తీసుకుని వెళ్ళేవారు. నేను భయంతో గట్టిగా తొక్కి వేగంగా వెళ్లిపోయేవాడిని. ఎవరైనా మనిషి కనిపిస్తే మటుకు భయంతో వెంటనే బ్రేక్ పడిపోయేది. ఆ వెంటనే భళ్ళు మన్న శబ్దం. మోచిప్పలూ, మోకాళ్ళు కొట్టుకు పోయేవి. ఒక వారం తేరుకున్నాక మళ్ళీ ఇదే పరిస్థితి పునరావృతం అయ్యేది.

ఇక ఇలా కాదు అని, ఒక ఆదివారం మా నాన్న, మనుషులు ఎవరూ కనిపించని ప్రభుత్వ బడికి తీసుకువెళ్లారు. అక్కడ స్కూల్ చుట్టూ రౌండ్లు వేయమని వదిలేశారు. నేనేదో నా తిప్పలు పడుతుంటే, ఇంతలో ఎక్కడి నుండి వచ్చిందో ఒక ఏడేళ్ళ అమ్మాయి .. పెద్ద సైకిల్ వేసుకు వచ్చింది. నా ముందరే వేగంగా రౌండ్లు వేస్తూ, “నీకు రాదా” అన్నట్టు నా వైపు చూసి వెటకారంగా నవ్వింది.

అంతే, నాకు పౌరుషం పొడుచుకు వచ్చింది. మనుషులు కనిపిస్తుండగా నేను డ్రైవింగ్ నేర్చుకోనని మొరాయించాను.

“నర మానవుడు కనిపించకూడదంటే ఎలాగ రా?” అని నాన్న అడిగితే, డాబా వైపు చూశాను.

మర్నాడు సైకిల్ ఇంటి డాబామీద ప్రత్యక్షం అయ్యింది.
అప్పటి నుండి మగమహారాజు సినిమాలో చిరంజీవిలాగా మూడేళ్లు మేడ మీద సైకిల్ తొక్కుతూనే ఉన్నాను.
ఎట్టకేలకు పదవ తరగతిలో, ఒక రోజు ధైర్యం చేసి సైకిల్ తొక్కుకుంటూ రోడ్డు మీదకి వెళ్ళాను. ఒక అర కిలోమీటర్ బాగానే నడిపాను. అప్పుడు వచ్చింది అసలు సమస్య. రోడ్డు దాటటం కోసం సిగ్నల్ ఇవ్వాలి అంటే చేయి ఎత్తాలి. చేయి ఎత్తగానే బ్యాలెన్స్ తప్పి పడిపోవటం, వెనుక నుండి వస్తున్న కారు సడన్ బ్రేక్ వేసి ఆగిపోవటం.. అన్నీ క్షణాల్లో జరిగిపోయాయి.
చావు తప్పి కన్ను లొట్టబోయి, సైకిల్ ఈడ్చుకుంటూ ఇంటికి వచ్చిన నన్ను చూసి మా నాన్న "నువ్వు మళ్ళీ సైకిల్ ఎక్కితే నడుం విరక్కొడతను." అని గట్టిగా కేకలేశాడు.
అయినా వెధవది సైకిల్ ఎక్కాలి, తొక్కాలి, బ్యాలెన్స్ చేయాలి. అది నా వల్ల కాదులే అని చేతులెత్తేశాను.
అప్పటి నుండి బయట తిరుగుళ్ళు లేకపోవటంతో శ్రద్ధగా చదివి మెకానికల్ ఇంజనీరింగ్ లో చేరాను.
కాలేజీలో రోజు కొంతమంది కాలేజీ అబ్బాయిలు సైకిల్ మీద చేతులు ఎత్తేసి తొక్కుతూ, అమ్మాయిల ముందు ఫోజు కొట్టేవారు. ఇంకొంత మంది రయి రయి మంటూ బైక్ తో ఫీట్లు చేసేవారు. నేను ఆ సౌభాగ్యానికి నోచుకోక పోవటంతో నాకు ఒక్క గర్ల్ ఫ్రెండ్ కూడా తగలలేదు.
ఇక లాభం లేదనుకుని ఒకరోజు మా ఫ్రెండ్ స్కూటర్ తీసుకున్నాను. ఇలా కిక్ చేస్తే స్టార్ట్, అలా వెళ్ళిపోవటమే అన్నాడు. సరే కదా అని స్టార్ట్ చేశాను. స్కూటర్ అలా వేగంగా వెళ్లిపోతోంది. "మేఘాలలో తేలిపోతున్నది" అని పాట పాడుకుంటూ కొద్ది దూరం వెళ్ళాను. ఇంక ఆపేద్దాం అనుకుంటే ఎలా ఆపాలో తెలీలేదు. భయంతో హ్యాండిల్ తిప్పటం వల్ల స్కూటర్ ఇంకా వేగం ఎక్కువ అయ్యింది. సైకిల్ అయితే బ్రేక్ వేసే పని, మరి స్కూటర్ కి ఏమి చేయాలబ్బా?
ఆ గందరగోళం నుండి బయట పడటానికి చివరకు కాలు క్రిందకు పెట్టి కాలుతో ఈడుస్తూ స్కూటర్ని వదిలేసి దూకేశాను. స్కూటర్ నేల మీద పడి పల్టీలు కొడుతుంటే, మా ఫ్రెండ్ గాడు ఎక్కడి నుండో పరుగున వచ్చి బండి ఆపేశాడు. "ఒరేయ్ చెప్పటం మరచిపోయాను, ఈ స్విచ్ నొక్కితే బండి ఆగిపోతుంది రా." అన్నాడు.
అదేదో వాడు ముందే అఘోరిస్తే బాగుండేది కదా. వాడు అప్పటికే బండి నిండా సొట్టలు పడ్డాయని గుడ్ల నీళ్ళు కుక్కుకున్నాడు, ఇంకేమనేది పాపం. ఇంక నేను మళ్ళీ ఎవరినీ స్కూటర్ అడిగిన పాపాన పోలేదు.
కాలేజీకి రోజు నడిచి వెళ్తుంటే, అమ్మాయిలు నన్ను వింత పశువుని చూసినట్టు చూసేవారు. అయినా ఉద్యోగం పురుష లక్షణం అన్నారు కానీ డ్రైవింగ్ పురుష లక్షణం అన్నారా? అందుకే ఈ డ్రైవింగ్, అమ్మాయిలు గొడవ మానేసి కొన్నాళ్ళు బుద్ధిగా చదువుకుందామనుకున్నాను.
కాలేజీ చివరి సంవత్సరంలో కార్ల గురించి, వాటి డిజైన్ల గిరించి తెలుసుకుని, కార్ల మీద మమకారం పెరిగింది.
కారు అయితే లోపల కూర్చుంటాము కాబట్టి మనకి దెబ్బలు తగలవు, ప్రమాదం ఉండదు. ఇక బ్యాలెన్స్ గోల అసలే ఉండదు.

ఎలాగైనా కారు కొనాలని నిర్ణయించుకుని క్రిందా మీదా పడి కార్ల కంపనీలో ఉద్యోగం తెచ్చుకున్నాను. ఉద్యోగంలో చేరిన మొదటి నెల డ్రైవింగ్ స్కూల్ లో చేరాను.

డ్రైవరు నన్ను స్టీరింగ్ పట్టుకోమన్నప్పుడు మహారాజా వారి సీట్ ఎక్కినంత సంబర పడ్డాను. కానీ స్టీరింగ్ పట్టుకోగానే నా చేతులు వణకటం మొదలు పెట్టాయి. అయినా పక్కన అతడు ఉన్నాడన్న ధైర్యంతో నడపటం మొదలు పెట్టాను. కార్ ముందు నడుస్తున్న వాళ్ళు దగ్గరగా ఉన్నారో, దూరంగా ఉన్నారో తెలీని అయోమయంలో ఒకరిద్దరిని గుద్దబోయాను. డ్రైవరు బాబు ప్రక్కనే ఉండబట్టి వెంటనే అపాయాన్ని ఆపాడు. అయినా అందరూ మొదట్లో ఇంతేగా అనుకున్నాను, కానీ అది ఒక్క రోజుతో ఆగలేదు. అలా మూడుగేరులు, ఆరు బ్రేక్లుగా సాగిపోతున్న ప్రయాణానికి ఒక రోజు బ్రేక్పడింది.

మరునాడే డ్రైవింగ్ టెస్ట్. అదే రోజు డ్రైవర్గారుతో ఎనిమిది అంకె వేయమని చెప్పాడు. నేను కారుని అష్ట వంకర్లు తిప్పుతూ, కారుకి ఢక్కా ముక్కీలు తినిపించేసరికి, డ్రైవరు లబోదిబోమన్నాడు. ఎనిమిది వేయటం అంటే ఇలా కాదు అని వాపోయాడు.

చివరకు పరీక్ష రోజు రానే వచ్చినది. నేను పరీక్షకు సన్నద్ధమవుతుండగా, డ్రైవరు ఎవరితోనో మాట్లాడుతూ డబ్బులు ఇవ్వటం చూశాను. అతడు లోపలికి వచ్చి "ఇక వెళ్దాం పదండి" అన్నాడు. "అదేమిటి? మరి నా లైసెన్సు?" అన్నాను.

"అది వస్తుంది లెండి!" అని స్టీరింగ్ పట్టుకున్నాడు.

"పరీక్ష ఇవ్వకుండా ఎలా వస్తుంది?" అని నిలదీశాను.

కారు వెనక్కి తిప్పి "మీరు ఒక రెండు వేలు మీవి కాదు అనుకోండి" అన్నాడు.

"అదేమిటయ్యా, నేను ఎనిమిది అంకె వేసి టెస్ట్ పాస్ అయ్యేవాడిని కదా!" అని కోపంగా అరిచాను.

నా వైపు చూసి "అప్పుడు మీకు సున్నా వస్తుంది సారు! ఆ కష్టం మీకు ఎందుకండి, అయినా మీకు లైసెన్సు కదా కావాలి నేను ఇప్పిస్తా!" అని నవ్వాడు.

అవమానంతో నా తల కొట్టేసినట్టు అయ్యింది. పరీక్ష రాయకుండా లైసెన్సు తీసుకోవటానికినా నిజాయితీ అడ్డు వచ్చింది. ఇంటికి రాగానే విసుగ్గా టివి పెట్టాను. టివిలో విరాట కోహ్లీ వాణిజ్య ప్రకటన ఒకటి. అతను కారు తోలుతుంటే, అమ్మాయిలు నోరు తెరిచి చూస్తున్నారు. నా కోపం నషాలంకి అంటి, రిమోట్ పుచ్చుకుని విసిరి పారేశాను.

కాసేపటికి అమెరికాలో ఉన్న మా ఫ్రెండ్ ఫోను చేశాడు. వాడు కొన్న కొత్త కారు చూపిస్తూ "ఒరేయ్ ఇక్కడ అమెరికాలో డ్రైవింగ్ చాలా సులువు, ట్రాఫిక్ పెద్దగా ఉండదు!" అని బడాయిలు పోయాడు.

అందుకనే సంవత్సరం తరువాత నాకు అమెరికా వెళ్లాల్సిన అవకాశం వస్తే వదులుకోలేదు. డాలర్ల కోసం కాదు, డ్రైవింగ్ కోసం.

తీరా అమెరికా వెళ్ళాక వాడు చెప్పింది అబద్ధం అని అర్థం అయ్యింది. కుడి ఎడమైతే పొరబాటు లేదు అని దేవదాసు చెప్పాడు కానీ, ఇక్కడ డ్రైవరు ఎడమ వైపు, కారు కుడి వైపు. మన దేశంలో తోలేదానికి పూర్తి వ్యతిరేకం. మళ్ళీ అయోమయం, గందరగోళం... షరా మామూలే!

ఒక రోజు డ్రైవింగ్ రూల్స్ సరిగ్గా పాటించలేదు అని ట్రాఫిక్ పోలీసులు నా వెంట పడి, వెయ్యి డాలర్లు వసూలు చేశారు. అక్కడితో నా డ్రైవింగ్ జబ్బు వదిలి పోయింది.

అలా నేను సతమతమవుతున్న సమయంలో బుగుల్ కంపెనీలో ఉద్యోగం వచ్చింది. ఒక్క ఐడియా నా జీవితాన్నే మార్చేసింది.

"ఇప్పుడు పెస్లా కంపెనీ అధినేత సుబ్బారావ్ గారు ప్రసంగిస్తారు!" అని ఎవరో వేదిక మీదకి పిలిచేసరికి వర్తమానంలోకి వచ్చాను. స్టేజ్ మీదకి వెళ్ళి నా ప్రసంగం మొదలు పెట్టాను.

"ఒకప్పుడు డ్రైవింగ్ అంటే భయపడ్డ నేను, ఇప్పుడు భారతదేశంలో ఏ మూలలో నైనా అవలీలగా డ్రైవింగ్ చేయగలను. నా వంటి రోడ్డు భీతి ఉన్న వాళ్ళందరికీ ఉపయోగపడాలనే సంకల్పంతో, నేను మన దేశానికి వచ్చి, ఈ పెస్లా సంస్థను ఏర్పాటు చేయటం జరిగింది. బుగుల్ లో నేను నేర్చుకున్న పరిజ్ఞానాన్ని అంతా ఉపయోగించి, మన దేశానికి సరిపోయేలాగా ఈ కార్లు తయారు చేశాను. ఇంక మన దేశం నలుమూలలా దూసుకెళ్లిపోదాం రండి!" అన్న నినాదంతో ముగించాను.

కరతాళ ధ్వనుల మధ్య ముఖ్యమంత్రిగారు వచ్చి మొదటి కారుకు రిబ్బన్ కత్తిరించారు. నేను కారులో ఎడమ వైపు కూర్చున్నాను. నా శ్రీమతి, అతిథులు అందరూ నా వెనుకే కూర్చున్నారు. సీటు బెల్ట్ పెట్టుకున్నాక శరవేగంతో సాగిపోతోంది, డ్రైవరు అవసరం లేని, కృత్రిమ మేధస్సుతో చేసిన స్వయం చోదక కారు.

"వావ్ సుబ్బారావ్, కొత్త భార్య, కొత్త కారు.." వెనుక నుండి ఎవరో అన్నారు. భార్య కొత్తదే, కానీ పరిచయం పాతది. ఒకప్పుడు ఏడో క్లాస్లో నన్ను వెక్కిరించిన ఏడేళ్ళ పిల్ల, తరువాత బుగుల్ లో నా సహోద్యోగి, ఈనాడు నా అర్ధాంగి. మరి మిగిలిన అతిథులు ఎవరంటారా? ఇంకెవరు? మా నాన్న, నాకు బైక్ ఇచ్చిన ఫ్రెండ్, ఇంకా నాకు కార్ డ్రైవింగ్ నేర్పిన డ్రైవరు.

మనలో మన మాట – ఇప్పుడు ఈ కారు కి ఏ సమస్య వచ్చినా వీళ్ళు అందరూ నా వెనుక ఉన్నారనే ధైర్యం.

***0***

# అందమైన అంతం




పి వి ఆర్ శివకుమార్

ఎంత మక్కువగా, మనసు పడి తలనిండుగా తురుముకుందో, అంతగానూ మనసు చెడి, అంతే నిరసనగా, వేణీభరాన్నుండి వేరు చేస్తూ, క్రోధంగా విసరికొట్టింది ఆ బొండు మల్లెల చెండును, భామ. అరగంట పాటు పాటుపడి అలంకరించుకున్న పెళ్లినాటి పట్టు చీరెను, అరనిముషంలో విప్పి అవతల పడేసింది. ఎదుట కనుపించిన నూలు చీరెను అస్తవ్యస్తంగా వంటికి చుట్టుకుని, పడక గదిలోకి నడిచింది. ఆ ఏడడుగుల మంచమ్మీద, ఐమూలగా పడిపోయింది.

'ఏడడుగులు కలిసి నడిచి ఏడాది పూర్తయింది ఈ రోజే!

ఏళ్ళు గడిచినంత నిరాసక్తత వచ్చేసిందా అతనికి?

ఏళ్ళు గడిచినా, నిరాసక్తత వచ్చే బంధమా తమది?

ఆలుమగలది ఏడేడు జన్మల బంధమని కదా చెప్తారు?

మరి తను అతనికి విడదీయలేని బంధం కాక, వదిలించుకోచూసే బంధనం అయిపోయిందా?'

కళ్లనుండి నీళ్ళు బొటబొటా కారగా, కరుగుతున్న కాలంలాగే, ఆమె కంటి కాటుక కూడా కరుగుతూ, పరుపును తడుపుతోంది. క్రోధంతో మూసుకుపోయిన మస్తిష్కం లాగే, కన్నులుగూడా నెమ్మది నెమ్మదిగా ఆమె నెమ్మదిని జోకొడుతూ మూతలు పడ్డాయి.

***

అత్యాలస్యంగా ఇల్లు చేరిన యదునందన్, భార్య ఆశాభంగాన్నీ, అలకావతారాన్నీ ఊహిస్తూ, కాలింగ్ బెల్ నొక్కాడు. మూడు సార్లు మోగాక, ఆ శబ్దం భామ చెవులను చేరింది. నిద్ర మత్తు వదుల్చుకున్న భామ, గడియారం వంక చూసింది. పది దాటుతోంది.

విసురుగా లేచి వెళ్ళి, తలుపు తీసింది.

"సారీ డార్లింగ్ ..." అంటూ లోపలికి ప్రవేశించి, తనచేతిలోని స్వీట్ బాక్స్ ఆమెకి అందించబోయాడు యదునందన్," నీకిష్టమైన నేతి మైసూర్ పాక్ ఫ్రం ఆల్మోండ్స్వీట్స్" అంటూ.

ఆ బాక్స్ అందుకుని, విసురుగా టీ పాయ్ మీద పడేసింది భామ.

"అంత అలుక నే భరించగలనా..." నాటకీయంగా అంటూ, ఆమె దరి చేరబోయాడు యదునందన్,

"ఆలస్యంగానైనా, మన పార్టీ స్టార్ట్స్ నౌ! నిజానికి మన పెళ్ళి ముహూర్తమూ, ఆ తరవాతి ముహూర్తాలు కూడా అర్ధరాత్రే కదా!"

అతడి కొంటె నవ్వు భామని ఏమాత్రం ప్రభావితం చెయ్యలేదు.

నెయ్యి మీద పడిన మంటలాగా చెలరేగుతూ, "నాకిప్పుడింక ఏ పార్టీ అక్కర్లేదు. దగ్గరకు రాకండి." తర్జనితో బెదిరిస్తూ అంది.

క్షణం పాటు నిర్విణ్ణత. ఆ వెంటనే, ఆమె ధిక్కారాన్ని సహించలేని మనసుని అంతులేని కోపం ఆవహించగా, అంతే విసురుతో బెడ్ రూంలోకి వెళ్ళిపోయాడు యదునందన్.

దుస్తులైనా మార్చుకోకుండానే, మంచమ్మీద వాలిపోయాడు. సతీ ధిక్కారానికి అతడి మనసు ఉడికిపోయింది.

'తనేమీ స్నేహితులతో గడిపి, జల్సా చేసి, ఆలస్యంగా ఇల్లు చేరుకోలేదే! ఆఫీసులో అనుకోని అత్యవసర సమావేశంలో ఇరుక్కుపోయాడు. అంత ముఖ్య సమావేశంలోనూ, వీలు చూసుకుని, ఆమెకు ఫోన్ చేసి విషయం క్లుప్తంగా వివరించాడు కూడా! అయినా, ఆమె స్పందన ఇది!'

అసంకల్పితంగా జరిగినదంతా సింహావలోకనం చేసుకుంది అతడి మనసు.

ఆ రోజు భామా నందన్ల వైవాహిక తొలి వార్షికోత్సవం.

అతడిని చీఫ్ మేనేజర్ చేస్తూ నిన్ననే ప్రమోషన్ ఆర్డర్స్ అందాయి!!

ఆ శుభసందర్భాన్ని కూడా కలుపుకుని, ఈ రోజు గ్రాండ్ గా సెలిబ్రేట్ చేసుకోవాలని నిన్న రాత్రంతా ప్రణాళికలు వేసుకున్నారు ఇద్దరూ.

ఈ సాయంత్రం, బయలుదేరబోతుండగా, కంపెనీ ఎం డి అకస్మాత్తుగా డిపార్ట్ మెంట్ హెడ్స్ మీటింగ్ పిలిచాడు.

యదునందన్ ప్రమోషన్ సందర్భంగా ఆయన డిపార్ట్ మెంట్ హెడ్స్ మీటింగ్ పెట్టాడు.

ఆ మీటింగ్ లో, యదునందన్ ను కొత్తగా ఏర్పాటు చేసిన ఒక డిపార్ట్మెంట్ హెడ్ గా ప్రకటించాడు. అతడికి అవుటాఫ్ టర్న్ ప్రమోషన్ ఎందుకిచ్చారో, ఆ కొత్త పదవిలో ఏ ఏ కొత్త బాధ్యతలను అప్పచెప్పానున్నారో వివరిస్తూ, మిగతా హెడ్స్ అతడికి ఈ కొత్త పదవిలో ఎలా సహకరించాలో విశదీకరిస్తుంటే, ఆ మీటింగ్ నుంచి తప్పించుకు రావాలనే ఆలోచనే యదునందన్ దరిదాపులకి రాలేదు. అక్కడికీ, మీటింగ్ మొదలైన అరగంటలోనే, భామకి ఫోన్ చేసి, ఈ మీటింగ్ విషయం బ్రీఫ్ చేశాడు. కొంచెం ఆలస్యం అవుతుందని చెప్పాడు. ఎంత ఆలస్యమో అతడూ ఊహించలేదు. వెరసి, ఇల్లు చేరేసరికి పది దాటింది.

'ఏడాదిగా కలిసి ఉంటున్నామే, తననీ, తన ఉద్యోగ బాధ్యతలనీ ఆ మాత్రం అర్థం చేసుకోలేదా?'

తన నిస్సహాయతనీ, ఆమె తొందరపాటు మనస్తత్వాన్నీ కలిపి తిట్టుకుంటూ, ఆవేదనతో, ఆకలి కడుపుతో, అలానే నిద్రకి పడ్డాడు యదునందన్.

ఎంత రాత్రయిందో తెలియదు. కలతగా పట్టిన నిద్రలో కల... పీడ కల రావలసిన సందర్భంలో అమరలోక దర్శనం! అంతలో ఏదో చిరు సవ్వడి మెళుకువ తెప్పించి, ఇలలో పడేసింది.

కళ్ళు తెరిచి చూశాడు యదునందన్. కల వాస్తవ రూపం దాల్చి, ఇలలోనే స్వర్గ సుందరి కళ్ళముందు నిలిచినట్లు తోచింది. కళ్ళు నులుముకుని చూశాడు.

అప్పటిదాకా నిద్రపట్టని అవస్థలో, ఆలోచనలకు పదును పెట్టి, భర్త సరిగా అర్థమయిన క్షణాన, పశ్చాత్తాపంతో అతడిని చేరిన అర్ధాంగి - తలనిండా పూలతో, చేతిలో మైసుర్ పాక్ పళ్ళెంతో, కళ్లనిండా పశ్చాత్తాపంతో, మేనినిండా విరహ తాపంతో,... శయనాయత్త రంభలా దర్శనమిచ్చింది.

"లేవండి శాఖాధికారిగారూ, పార్టీ చేసుకుందాం!" నును సిగ్గుని, మదిలోనే అదిమిపట్టి అంది భామ.

ఉబికి వచ్చిన ఉత్సాహంతో ఒక్క ఉదుటున స్ప్రింగులా మంచం మీది నుంచి లేచాడు యదునందన్.

వాతావరణంలో వేడి తగ్గించిన చందమామ మబ్బుల్ని ముద్దాడబోయాడు.

***0***



# వా'రణ' వాహిని

బాడిశ హన్మంతరావు

ఆసుపత్రి ఆవరణ నిశ్శబ్దంతో ప్రతిధ్వనిస్తోంది. గూడెం అంతా అక్కడే ఉంది. అందరి మొహాల్లో ఆందోళన.

వాళ్ళ చూపులన్నీ వెళ్ళి ఆసుపత్రిలో బెడ్ పైన ఉన్న మంగపై వాలుతున్నాయి.

మంగ... బొగ్గులాగా... చూడటానికి భయంకరంగా.... కేవలం కళ్ళు మాత్రమే తెల్లగా కనపడుతున్నాయి. డాక్టర్కి చూడగానే అర్థం అయింది. కానీ వెంటనే చెప్పబుద్ధి కాలేదతనికి. కాసేపు పరీక్షించి నిర్ధారించుకొని అప్పుడు చెప్పాడు లాభం లేదని! ఆ మాట క్షణంలో అందరి కళ్ళలోకి నీరులా చేరింది. మౌనం బద్దలయింది.

"ఈ తాగుబోతు నాయాలను బట్టలూడదీసి కొట్టాల్నా... నరికి సంపాల్నా? అలవాటు మానలేకపోతే పెళ్లిళ్లు ఎందుకు జేసుకోవాలా? ఆడుపిల్లల వుసురెందుకు దీయాలా?"

"తాగుడు ఎక్కువై... సంసారాన్ని పట్టించుకోకపోతే ఏ ఆడుదైనా ఏంజేసుద్ది? ఇది పిచ్చిది గానీ, వాడ్ని తగలెట్టాల్సింది." మంగ తల్లి అల్లుడిని తిట్టిపోసింది.

మంగ మొగుడు ఆసుపత్రి వరండాలో తల వంచుకు నిలబడ్డాడు. పక్కనే అతని మామ, అల్లుడిని కక్షగా చూస్తున్నాడు. అతని ఒడిలో బిక్కమొగం వేసుకొని ఉన్నాడు మంగ కొడుకు. వాడికీ తండ్రిని చూస్తుంటే కోపం వస్తోంది.

చూస్తుండగానే మరో గంట సమయం గడిచిపోయింది. బతుకు బాకీ చెల్లించుకొని మంగ వెళ్ళిపోయింది.

మొత్తం దేశాన్ని మేమే తాగి నడుపుతున్నామని సొల్లు కారుతున్న నోటితో, సొల్లు కబుర్లు చెబుతూ... సంసార బాధ్యతను దేవుడికి వదిలేసే మొగుళ్ల బాధ్యతా రాహిత్యాన్ని నిలదీయడానికి, మంగ ఆ దేవుడి దగ్గరకే వెళ్లిపోయింది. ఇక ఏ కష్టానికీ ఆమె చిరునామా దొరకడం కష్టం. కాదు... కాదు... అసాధ్యం.

అందరూ గొల్లుమన్నారు. రాత్రి పొద్దుపోయేటప్పటికీ అన్నీ అయిపోయాయి.

మూడో రోజు... చిన్న దినం. కులం అంతా తరలి వచ్చింది. మంగ గురించి, ఆమె ఒబ్బిడితనం గురించి తలచి తలచి చెప్పుకుంటున్నారు. అందులో మొగుడు, ఆమె తండ్రి కూడా ఉన్నారు. వాళ్లకి దగ్గరగా వసారాలో నాటుసారా కుండ, ఈతాకుల కుదురు మీద పెట్టి ఉంది. మరో పక్కన చీపు లిక్కరు క్యాను.

మంగ మొగుడు వచ్చిన ప్రతి ఒక్కరికీ, ప్లాస్టిక్ గ్లాసుల్లో ఎవరికి కావలసింది వారికి పోసి అందిస్తున్నాడు. ఇష్టం లేకుండా తాగుతున్నట్టు కొందరు ఎడమ చేతితో ముక్కు మూసుకొని, కుడి చేత్తో నోట్లో ఒక్కసారే పోసుకొని, మధ్యలో పెట్టిన గిన్నెలో నుండి ఆదరువు తీసుకొని నాలుకపై పెట్టుకుంటున్నారు.

పదమూడో రోజు, పెద్దదినం... అందరూ మంగను పెట్టిన బొంద దగ్గరకు పోయి వచ్చారు. ఆచారం పరంగా చేయాల్సిన క్రతువులు అయిపోయాయి. కులం, బంధుగణం అందరూ ఇంటికి చేరారు.

ఈసారి ఇంటి ముందున్న వేపచెట్టు కింద ఒకటి కాదు... నాలుగు పెద్ద కుండలు కొలువు తీరాయి. వసారాలో మాత్రం నాజూకు పురుషులకు కొన్ని కేసుల్లో బీర్లు, మరో అట్టపెట్టెలో ఇంగ్లీష్ మందు కూచుని ఉన్నాయి. పక్కింటి పెరడులో వండుతున్న వంటల తాలూకు వాసనలు, మందు వాసనలతో కలిసి వింత ఘాటును సంతరించుకున్నాయి.

ఇంటి ముందు, పక్కింటి వసారాలో చిన్న చిన్న గ్రూపులుగా కూచుని, 'చాలా' బాధపడుతూ, మందు తాగుతున్నారు. మధ్య మధ్యలో రాష్ట్ర, దేశ రాజకీయాలను విశ్లేషిస్తున్నారు.

“మన దేశంలో ఉన్న తాగుడు అలవాటు మానలేనోళ్ళని... ఏదీ.... మానలేనోళ్ళనే.... కలిపి ఒక దేశంలాగా చేస్తే జనాభా పరంగా పాతికో దేశం అయిద్దంట. మరి మనం కూడా కలిస్తే....!” చదువెక్కువైన పెద్ద మనిషి మీసం దువ్వుతూ పెద్దగా నవ్వాడు.

“అందర్నీ పెట్టి ఆ దేశం మీద ఓ అణుబాంబేస్తే పీడా పోద్ది” ఆ మాటలు చెవినబడి ఓ యువతి ఉక్రోషంగా పండ్లు కొరుకుతూ కచ్చగా గొణుక్కుంది. ఆ మధుపాన సేవకుల సమూహంలో తన భర్తను చూస్తూ పుట్టిందది.

ఇంట్లో కుర్చీలో పెట్టిన మంగ ఫోటో దగ్గర ఆడవాళ్లు కూచుని, నోట్లో కొంగులు కుక్కుకుని, కళ్ల నీళ్ళు పెట్టుకుంటున్నారు. అదేమీ పట్టనట్టు .. ఆడవాళ్ల కళ్ల నీళ్ళు మద్యంగా మారి, ప్రభుత్వం ద్వారా అక్కడ కూచుని ఉన్న మగాళ్ల చేతుల్లో ఉన్న గ్లాసుల్లోకి, అక్కడ్నుంచి వాళ్ల కడుపుల్లోకి అలా... అలా... అలవోకగా జారిపోతోంది.

“తాగిన ఎదవల్ని సంపడానికి బాంబు గావల్నా? తెగ తాగి తూగుతూ.... సరిగ నిలవడనే లేరు!.... మనమే సంగతి సూడాల. మంగక్కకి ఆ దైర్ణం లేకపాయే..... !” తన చేయి బిగించి పట్టుకొని అంటున్న స్నేహితురాలిని విప్పార్చి చూస్తున్న ఆ కళ్ళలో ఎన్ని ఉషోదయాలో...!!

***0***



# విడాకులా?

**భాగవతుల భారతి**

లీడింగ్ లాయర్ సుగుణాకర్ రావు తోటబంగళాలాంటి ఆవరణ అంతా జనాలతో కిక్కిరిసి రణగొణ ధ్వనులతో, కిచాటు కిచాటుగా ఉంది. సిమెంట్ బెంచ్ మీద తల్లితో కూర్చునుంది విద్యాధరి.

అక్కడి జనాన్ని చూసాక, 'ఈ లాయరు కేవలం విడాకుల కేసుల మీదే ఇంత సంపాదించాడా? కాదేమోలే.' అని మళ్ళీ అనుకుని విద్యాధరి నెమ్మదిగా లేచి, చెట్టుకింద నుంచుని వాదించుకుంటున్న వాళ్ళ దగ్గరకు నడిచింది. వాళ్ళలో కలవకుండా, కొంచెం దూరంగా నిలబడి చెవి అటు వేసింది.

వాళ్ళిద్దరూ మొగుడూ పెళ్ళాలని అర్ధమయింది. ఐతే!

"నన్నింత మోసం చేస్తావనుకోలేదు. ఐదేళ్ళ కాపురంలో నీకేం తక్కువ చేసాను! నాకు తెలీకుండా రెండో దాన్ని చేసుకుని, పైగా అదెవరో నాకు తెలీదంటావా?

"అవునే! నాకు తెలీదే!" భర్త అంటున్నాడు.

"నీకు తెలియకపోతే మార్కెట్ దగ్గర కూరగాయలు కొంటూ అంతమంది ఉండగా 'ఏమండీ! ఇక్కడున్నారేం?' అని మిమ్మల్నే ఎందుకడిగింది? మరి నీ బండి నేనెక్కుతుంటే, ఆమె అంత ఆశ్చర్యంగా 'ఇదెవత్తండీ? నేను కదా మీ భార్యని' అంటూ నీ బండి వెనుక పడింది. ఏడ్చింది కొంత దూరం పరుగెత్తుతూ వచ్చింది. చివరికి నేనే కల్పించుకుని ఆమె మీద చేయిచేసుకుని కొడితే, రోడ్డు మీద ఏడుస్తూ కూలబడింది. నాకు తెలీదని బుకాయిస్తే సరిపోతుందా? అందుకే తాడోపేడో తేల్చేస్తా! విడాకుల కోసమే ఇక్కడికొచ్చా! ఈరోజుతో నీకూ నాకూ సరి!"

మొగుడేదో చెప్పబోతూ పక్కకు తిరిగి, అపరిచితురాలైన విద్యాధరిని చూసి ఆగాడు.

విద్యాధరి మెల్లగా ఇవతలికి వచ్చేసింది. ఇంకోచోట వేరేవాళ్ళు చర్చించుకుంటూంటే మళ్ళీ అక్కడ పక్కన నిలబడింది.

అదీ విడాకుల కేసే! అయితే భార్యాభర్తలు కారు. అమ్మాయి బంధుగణం. కారణం అంతా అతనిపై నెట్టేసి, అతడిని నిందిస్తూ, అమ్మాయికి విడాకులకి ఎక్కేస్తున్నారు.

అక్కడ ఇంకా రకారకాల గ్రూపులు, అన్నీ విడాకులవే. కారణాలు కూడా కొన్ని అర్ధవంతమైనవీ, కొన్ని అర్ధంపర్ధం లేనివి అనిపించి మనసు వికలమైంది విద్యాధరికి.

నాలాంటి వాళ్ళు ఎంతమందో? నిట్టూరుస్తూ వచ్చి మళ్ళీ తండ్రి పక్కన కూలబడింది.

"ఇప్పటికైనా మించిపోయిందేం లేదు. మనసు మార్చుకో విద్యా!" తండ్రి మాటలకు తల్లి రుసరుసా చూసి,

"నెల రోజుల క్రితమే కేసు ఫైల్ చేసాం. ఈ రోజుకి మనకు ఇంటర్వ్యూ దొరికింది. చూసారుగా.. ఇక్కడి జనాన్ని బట్టే ఈయనెంత పెద్దలాయరో తెలీటల్లా! దీని మొగుడికి కూడా కబురంపాంగా.. వస్తాడులే!" తల్లి చిరాకు గమనించి, చుట్టూ ఉన్న పరిసరాలు గమనించింది. విద్యాధరి.

ఏమిటీ? రోజుకిన్ని విడాకుల కేసులా? ఏంజరుగుతోందీ విదేశస్తులు గొప్ప సంస్కృతి అని పొగిడే నా దేశంలో? విడాకులు తీసుకుని ఏం చేద్దామనీ? పోనీ విడాకులు తీసుకుని నేను మాత్రం ఏంచేయాలని? ఇంతదూరం ఎందుకు వచ్చినట్లు? తనకూ, పుండరీకల మధ్య రాజుకున్న విడాకుల చిచ్చు గుర్తుకు వచ్చింది.

★★★

"అవునండీ! నేను మీతో ఎందుకు కాపరం చేయాలీ? విడాకులు ఎందుకు తీసుకోకూడదూ?!" విద్యాధరి తన భర్త పుండరీకతో లా పాయింట్ లాగింది.

"నాకేం తక్కువైందీ?" పుండరీక ప్రశ్న.

"అన్నీ ఎక్కువే! డబ్బూ, స్నేహితులూ, పార్టీలూ... పెళ్ళాం మాట వినడమే తక్కువ!"

"ఏం వినలేదూ! ఇంటి పెత్తనమే కాక నామీద పెత్తనమంతా నీదేగా!"

"ఇంటి పెత్తనమా? ఇక్కడ పదిమంది పిల్లలూ గంపెడు సంతానం కొల్లబోతోందనా? పెళ్ళై రెండు సంవత్సరాలయింది. పిల్లాజెల్లా లేరు. డాక్టర్ ని సంప్రదించుదాం అన్నాను. విన్నారూ! సాయంత్రం అయిందంటే, స్నేహితులూ, మందు పార్టీలూ.. ఆ దండగ సొమ్ముతో, చాలా చేయొచ్చంటే వింటున్నారా? రోజూ ఈ తతంగంతో వేగలేక చస్తున్నా!" రోజూ లాగే వాదన మొదలైంది.

"నాది దండగ ఖర్చా? ఇదేమన్నా నీ బాబుగాడి ముల్లెమైనా తగలేస్తున్నానా? నా సంపాదనేగా! పిచ్చిగా వాగకు!"

మాటా మాటా పెరిగింది. ఈగోలూ పెరిగాయి. మగాడి ఆఖరిఅస్త్రం... విద్యాధరి చెంప ఛెళ్ళుమంది.

ఆడదాని ఆఖరి అస్త్రంగా "నన్నే కొట్టావా? చూడు నిన్నేం చేస్తానో! నాకు ఎవరూ లేరనుకుంటున్నావా? కోర్టుకీడ్చి, ముప్పుతిప్పలు పెట్టి, మూడు చెరువుల నీరు త్రాగించక పోతే నాపేరు విద్యాధరే కాదు!" ఛాలెంజ్ విసిరింది.

"పోవే! పో! ఆడదానికే అంతుంటే మగాణ్ణి నాకెంతుండాలీ ?"

ఇరు పక్షాలూ రాజీ కుదర్చాలని ప్రయత్నాలు చేసాయి. కానీ విద్యాధరి తల్లి మాత్రం కూతురి పక్షాన నిలబడి..

"పురుషాహంకారం... వెధవ ఏమనుకుంటున్నాడూ? నా కూతురుకేం తక్కువా? పిల్లాపీచూ బాదరబందీ కూడా లేదు. ఎవరైనా రెండో పెళ్ళికి నా కూతురును ఎగరేసుకు పోతాడు. ఇవాళా రేపూ, ఆడపిల్లలు దొరికితే చాలనుకుంటున్నారు!" అని విడాకుల వరకూ నడిపించింది. దాంతో విద్యాధరి తండ్రి ఎంత నచ్చచెప్పినా వినిపించుకోలా!

పుండరీకను కలిసి "బాబూ! నువ్వైనా నామాట విను." అని మామయ్యగారు నచ్చచెబితే,
"మీ అమ్మాయే మీ మాట వినటం లేదు, నాకు చెబుతున్నారా? మగాడన్నాక సవాలక్ష అలవాట్లుంటాయి. నేనెరి కోసమూ మార్చుకోను. బై!" అన్నాడు.
"చూసావా! చూసావా! తరతరాల మగాడి దురంహంకారం. వాడెందుకు మారతాడూ!" తల్లి ఆజ్యం పోసింది అగ్నికి.

★★★

"విద్యాధరీ!" హాల్లోంచి పిలుపువిని ఉలిక్కిపడి వాస్తవంలోకి వచ్చి తల్లీదండ్రులతో లోపలికి నడిచింది విద్యాధరి. ఆ కోర్ట్ హాల్లోకి అప్పుడే వచ్చిన లాయరు గారు "అయన రాలేదామ్మా?" అడిగారు.
లేనట్టు తల అడ్డంగా ఉపింది.
"చెప్పమ్మా! విడాకులు కావాలని ఎందుకనుకుంటున్నావ్?" అడిగాడు లాయర్.
కారణాలు వివరించింది.
"నీ భర్తను కూడా విచారించాలి. తనని కూడా రానీ!" లాయర్ గారన్నారు.
తన తరఫున పిటీషన్ వేసిన లాయర్ తో, "నేను విడాకుల కేసు వెనక్కి తీసుకుంటున్నాను. నాకు విడాకులు వద్దు." అంది విద్యాధరి మెల్లగా.
"ఎందుకు కావాలనుకున్నావ్? ఎందుకు వద్దనుకున్నావ్? మరి కాపురానికి వెడతావా?" లాయర్ అడిగారు.
"వెళ్ళను" విద్యాధరి చెప్పింది.
"అంటే! కాపురానికి వెళ్ళకుండా, విడాకులీయకుండా ఈ మధ్య ఆడవాళ్లు మొగవాళ్ళని ఇబ్బంది పెట్టాలని చేస్తున్న ట్రిక్ లాంటిది కాదుగదా? "
తల్లీదండ్రీ అవాక్కై చూస్తున్నారు. గొంతు పెగుల్చుకుని తల్లి చిరాకు ధ్వనిస్తుండగా అడిగింది "మరేం చేద్దామనే?"
"ఏంటిదంతా?" లాయర్ ఇడిగాడు.
"మన వివాహవ్యవస్థ ఇదీ. ఇది ప్రపంచ దేశాలకూ ఆదర్శం. ఇలాంటి వేదాంతోపాన్యాసాలు ఇచ్చేంత గొప్పదాన్నేం కాదండీ. కానీ ఈ ఆవరణలో అడుగు పెట్టాకనే తెలిసింది, రోజుకి ఇంతమంది విడాకులతో, బయటికెళ్ళి ఏం చేస్తున్నారు? భారతదేశంలోనే కాదు. ప్రపంచంలో ఎక్కడైనా వైవాహిక జీవితాలు ఇలాగే ఉన్నాయ్. కొన్ని కోర్టులలో, బయట కొన్ని.. ఎందుకనీ? నన్నే తీసుకుంటే, విడాకుల అనంతరం నేనేం చేయాలి? మళ్ళీ పెళ్ళి చేసుకోవాలి. తనూ మగాడేగా? ఈ మగాడి దగ్గర లేనిదీ, ఆ మగాడి దగ్గర కొత్తగా దొరికేదీ ఏముందీ ? అదనంగా పాతనంతా గుర్తుచేసి, ఆ మగాడు పెట్టే కొత్తరకం హింస అంతే!"
"మా సమయం వృధా చేయకుండా విషయం సూటిగా చెప్పండమ్మా!" లాయర్గొంతులో చిరాకు.

"నేను విడాకుల నోటీసు వెనక్కి తీసుకుంటున్నాను. అలాగే నేను బయటి ప్రపంచంలోకి ఓ ఉద్యోగినిగా తొంగిచూస్తాను. విడాకుల కేసుల్లో మగాళ్ళ నెగిటివ్ షేడ్స్ ను అధ్యయనం చేస్తాను!"

"ఎలా అధ్యయనం చేస్తావ్? అంటే ఇంతకాలం మగాళ్ళని అధ్యయనం చేయలేదా? మీ అధ్యయనానికి మగాళ్ళంతా చేతులు కట్టుకుని రెడీగా నుంచుని 'చేసుకోమ్మా' అంటారా? "

"నాకు తెలిసీ ఓ మగాడి గుణం కేవలం భర్తగా మారేకే బయటికి వస్తుంది. నేను మగాళ్ళని విమర్శించేంతదాన్ని కాను. కానీ మగాడు నాన్న, అన్న ఇలా అన్ని వరసల్లోనూ మంచివాడే. భర్తగా మారాకే తన నిజం స్వరూపం తెలుస్తుంది. అందుకే అంటారు.. మగాడు మంచివాడు అని. భార్య దగ్గర సర్టిఫికేట్ తీసుకోవాలి. అలాగే ఓ ఆడపిల్ల మంచిదీ అని అత్తగారి దగ్గర సర్టిఫికేట్ తీసుకోవాలీ అని. ఇక అధ్యయనం ఎలాఅనిఅడిగారా? నా కొలీగ్స్, స్నేహితులూ, వారి స్నేహితులూ, వారి భర్తలూ, వాళ్ళ వాళ్ళ ప్రవర్తన, ఇలా పరిచయాల ద్వారా ఎవరినీ నొప్పించకుండా లోకాన్ని చదువుతాను. దానివల్ల ఆ మగాళ్ళందరి కంటే నాభర్తే మంచివాడు అనిపించే దాకా అధ్యయనం చేస్తాను!"

"ఇందాక ఆ చెట్టు క్రింద ఓ జంట మాట్లాడుకుంటున్నారు. ఈ భార్యా భర్త బండి మీద వస్తుంటే, ఒకామె బండి వెనకాల పరుగెత్తుతూ, నాభర్త, నాభర్త అని అరుస్తూ రోడ్డు మీద పడిపోయిన దృశ్యం మొన్న టి.వి.లో చూపిస్తే వీళ్ళు తమ మాటల్లో వినిపించారు. అంత నీచం నా జీవితంలోకి రాకుండా జాగ్రత్త పడతాను!"

"ఒకవేళ ఎప్పటికీ నీ భర్తే మంచివాడని అనిపించకపోతే?" ప్రశ్న వేసాడు లాయర్.

"అనిపించేవరకూ అధ్యయనమే. నేను చెప్పింది సరిగా అర్థం చేసుకోండి!"

"అంటే మనసు మార్చుకుని మీ భర్తతో కాపురానికి మీ మనసు సిద్దపడే వరకూనా? అదేదో ఇప్పుడే చేయొచ్చుగా" లాయర్ అన్నాడు.

"అది నేనొక్కదాన్నే అనుకుంటే సరిపోదుగా! ఆ అధ్యయనం అతనికీ అవసరమేగా! నా భార్యే మంచిదనిపించాలిగా. అయినా ఒక సంవత్సరం ఆగితే మార్పులు చాలా జరుగుతాయి. అప్పటి వరకూ దూరంగా ఉంటే సరి.!"

"శభాష్! విద్యాధరీ! నిజానికి ఓ ఏడాది ఇద్దర్నీ దూరం దూరంగా ఉంచి, ఆవేశాలు తగ్గాక, ఏంచేయాలో ఆలోచించుకునే సమయం పిల్లలకు ఇవ్వాలనే జ్ఞానం పెద్దలకే ఉండాలి. పిల్లలు తొందర పడ్డారని పెద్దలూ హడావిడిగా పిల్లల్ని కోర్టు మెట్లు ఎక్కించేస్తున్నారు. చిన్నదానివైనా ఈ ఆలోచన నీకు వచ్చినందుకు అభినందనలమ్మా!" అంటూ లాయరు ఆనందంగా ఆమె వైపు చూసాడు.

ఏదో ఆలోచిస్తూ అతనే మళ్ళీ అన్నారు.

"పేపర్స్ మాత్రమే సబ్మిట్ చేసారు. ఎలాగూ కేసు ఇంకా కోర్ట్ దాకా వెళ్ళలేదు. వెళ్ళినా, మీ ఇద్దరికీ ఆరునెలల సమయం ఇస్తారు విడాకులకి. ఈలోగా నువ్వనుకున్నది చేసి చూడు. ఈ పేపర్స్ ఎటూ పోవు నా దగ్గరే ఉంటాయిగా. అదంతా నే చూసుకుంటాలే. మళ్ళీ నువ్వుతిరిగి రాకూడదనే కోరుకుంటున్నాను!

నీ వైపు సరే.. నీ భర్త ఇదంతా చూస్తూ ఊరికే ఉంటాడా?" లాయర్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా, ఓ చిరునవ్వు నవ్వి, అక్కడ నుంచి బయటికొస్తుండగా ..

"ఆల్ ద బెస్ట్ .. నీ కోసం ఎదురుచూస్తూ ఉంటా!!" అన్న మాటలు వినబడినవైపు చూసింది.

నవ్వుతున్న పుండరీక!!

అందులో ఎన్నో అర్థాలు ధ్వనించాయి అక్కడి వాళ్ళకి.

అందరికంటే నాభర్తే మంచివాడు అని తెలుసుకుని నువ్వే తిరిగిరావాలని ఎదురుచూస్తా అనా?

నా భార్యే మంచిది అని నేను తెలుసుకుని నిన్ను ఆహ్వానించటానికి ఎదురుచూస్తా అనా?

ఇంకేమన్నానా?

కాలం ఏదైనా చేసి చూపగలదు. ఓపికతో వేచిచూస్తే!

***0***




# కలిసుందాం రండి

లక్ష్మీ గాయత్రి బొంతా

పేపరు చదువుతున్న రంగనాథం, పక్కనే టీపాయ్ మీదున్న సెల్ మోగుతుంటే చూశాడు.

జగన్నాథం కాలింగ్!

వెంటనే ఫోన్ లిఫ్ట్ చేసి, "అన్నయ్యా...!" అన్నాడు

"ఏరా...! బావున్నావా? జ్వరం తగ్గిందా?" జగన్నాథం తమ్ముణ్ణి కుశల ప్రశ్నలు వేశాడు.

"బావున్నానన్నయ్యా! జ్వరం వెంటనే తగ్గిపోయింది. ఒక్క రోజు ఒళ్లు కాస్త వెచ్చబడిందంతే. నువ్వూ, వదినా ఎలా ఉన్నారు?"

"బాగానే ఉన్నాం. వయస్సు మీద పడినందువల్ల కాబోలు.. ఈ మధ్య నిద్ర సరిగ్గా పట్టడం లేదురా నాకు. మీ వదిన హాయిగా నిద్రపోతుంది. నాకేమో ఒక్కోరోజు శివరాత్రే... " జగన్నాథం ఇంకా ఏదో చెబుతూనే ఉన్నాడు. నిద్ర పట్టడం లేదన్న మాట వినగానే రంగనాథానికి ఒక్కసారిగా రెండు రోజుల క్రితం జరిగిన రభస గుర్తొచ్చింది.

రంగనాథానికి చిన్నప్పటినుంచి నిద్ర తక్కువే. సినిమాలు, టీవీ చూడటమంటే మహా ఇష్టం. వయసులో ఉన్నప్పుడు ప్రతి శనివారం సెకండ్ షో సినిమాకి వెళిపోయేవాడు. రిటైర్ అయి, కొడుకు దగ్గరకొచ్చి ఉండటం ప్రారంభించాక, రాత్రి పూట టీవీ చూడటం పూర్తిగా మానెయ్యాల్సొచ్చింది. పిల్లలు ఇంట్లో ఉండగా టీవీలో న్యూస్ తప్ప ఏది పెట్టినా కోడలు ఊరుకోదు.

"ఇవి మీ రోజులు కావు మావయ్య గారూ.  టాప్ ర్యాంకులొస్తే తప్ప బతుకు లేదు! పిల్లల్ని లక్షలు పోసి చదివిస్తున్నాం. వాళ్లు టీవీ చూస్తూ కూచుంటే చదువులు చంకనాకిపోతాయ్!" అంటూ నిస్సంకోచంగా టీవీ ఆఫ్ చేసి ప్లగ్ కూడా తీసేసేది మొదట్లో. పూర్తిగా కేబుల్ కనెక్షనే తీయించేద్దామని కూడా అనుకుంది, గానీ మళ్లీ ఎందుకో మానేసింది. కోడలు అంత ఖచ్చితంగా చెప్పిన తర్వాత పిల్లలు వచ్చే టైం కి ఓ పది నిమిషాలు ముందే టీవీ కట్టెయ్యడం అలవాటు చేసుకున్నాడు రంగనాథం. పగలంతా చూస్తున్నాను గదా.. చాల్లే అని తృప్తి పడటం నేర్చుకున్నాడు.

అయితే, శని, ఆదివారాల్లో కొడుకు, కోడలు ఇంటి దగ్గర ఉన్నప్పుడు రంగనాథానికి టీవీ అస్సలు దొరికేది కాదు. కొడుకు రిమోట్ తీసుకుని తనకి కావలసింది పెట్టుకునేవాడు. పోనీ అదే చూద్దామన్నా వాల్యూమ్ చాలా తక్కువగా పెట్టేవాడు కొడుకు. రంగనాథానికి వాల్యూమ్ ఎక్కువ కావాలి. మాట గట్టిగా వినబడితే గాని తృప్తి ఉండదు. దాంతో బాటు ఈ మధ్య కొంచెం వినికిడి తగ్గడంతో రంగనాథానికి తక్కువ వాల్యూమ్ లో చూడటం కుదిరేది కాదు. కొడుకు వాల్యూమ్ పెట్టడు. ఒకవేళ ఉండబట్టక కొడుకుని అడిగి సౌండ్ పెంచితే, ఉత్తర క్షణంలో కోడలు రయ్యిన వచ్చేస్తుంది... "ఏమిటా సౌండ్.. చెవులు అదిరిపోతున్నాయి" అంటూ. వెంటనే కొడుకు వాల్యూమ్ మరింతగా తగ్గించేస్తాడు. ఇన్ని ఆటంకాల మధ్య కుదిరినప్పుడు టీవీ చూస్తూ లేనప్పుడు, నోరు మూసుకుని ఉంటూ. కాలం గడుపుతున్నాడు రంగనాథం.

రెండు రోజుల క్రితం, రాత్రి పదకొండు దాటినా రంగనాథానికి నిద్ర పట్టలేదు. పడక మీద దొర్లి దొర్లి ప్రాణం విసుగొచ్చేసింది. ఎప్పుడూ లేనిది ఒకప్పుడు చూసినట్టు,  వేడిగా కాఫీ తాగుతూ టీవీ చూడాలన్న కోరిక  వేధించడం ప్రారంభించింది.

అప్పట్లో ఫ్రిజ్ లో ఎప్పుడూ పాలు ఉండేవి. తనకి ఇష్టమని రాత్రి పడుకోబోయే ముందే ఫిల్టర్ వేసి ఉంచేది భార్య. రాత్రి వేళల్లో ఎప్పుడైనా నిద్ర పట్టకపోతే లేచి, వేడిగా కాఫీ కలుపుకునేవాడు. అలికిడి విని భార్య లేచి వస్తే తనకీ ఓ కప్పు కలిపేవాడు. ఇద్దరూ కలిసి కాఫీ తాగుతూ, పిల్లలకి నిద్రాభంగం కలగకుండా వాల్యూమ్ బాగా తగ్గించి టీవీ చూసేవారు. అలా ఓ పావుగంట చూసేసరికి  నిద్రొచ్చేసేది. టీవీ కట్టేసి హాయిగా వెళ్లి పడుకునేవారు.

గతం గుర్తొచ్చేసరికి రంగనాథం ఇంక అసలు ఆగలేకపోయాడు. అయితే, తన ఇంట్లో కలుపుకున్నట్టు ఇక్కడ తను దూసుకుపోయి కాఫీ కలుపుకోవడానికి లేదు. కోడలికి ఫిల్టర్ పొద్దున్నే వెయ్యాలి. అంచేత ఈ వేళప్పుడు  డికాక్షన్ ఉండి ఉండదు. కనీసం ఏ బ్రూ పేకెట్టయినా ఉందో లేదో తెల్లారి లేచిందగ్గర్నించీ వంటింట్లో పడి చాకిరీ చేసే అనంతలక్ష్మికే తెలియాలి. పక్కన చూస్తే ఇల్లాలు ఆదమరచి నిద్రపోతూ కనిపించింది. ఆమెని లేపబుద్ధి కాలేదు రంగనాథానికి.

కొడుకూ కోడలూ మా దగ్గరకి రండి రండంటూ బలవంతం చేస్తుంటే అదంతా ప్రేమ అనుకున్నాడు తను. కానీ అనంత సగం వంట చేసిన తర్వాత గానీ, కొడుకు, కోడలు నిద్ర కూడా లేవకపోవడం గమనించి, కాలూ చెయ్యీ బావున్న ముసలాళ్లని దగ్గర పెట్టుకుంటే కలిగే లాభాల కోసమే తమని లాక్కొచ్చారని గ్రహించాడు. వంటిల్లు అనంతకీ, పిల్లల పనులూ, బజారు పనులూ తనకీ అప్పజెప్పేసి కొడుకూ కోడలూ నిశ్చింతగా లక్షలు సంపాదించుకోవడంలో మునిగిపోయారు.

వృద్ధాప్యం రెండో బాల్యమే గాని రెండో యవ్వనం కాదు. యవ్వనంలో ఉన్న గుర్రాన్ని పరిగెత్తించినట్టు ముసలి గుర్రం మీద కొరడా ఝుళిపిస్తే నాలుగడుగులకే అది నేలకొరుగుతుంది. అనంత పరుగు అలాగే ఉంది. అక్కడికీ తను కూరలు తరగడం, బియ్యం కడిగి ఇవ్వడం, చపాతీ పిండి కలపడం లాంటివి నేర్చుకున్నాడు ఈ రెండో బాల్యంలో.

ఆలోచనల్లోంచి తెప్పరిల్లిన రంగనాథం నెమ్మదిగా పక్క దిగాడు. హాల్లోకి వెళ్లి ఆ చీకట్లో తడుముకుంటూనే టీవీ స్విచ్ ఆన్ చేసి, ఆ వెలుతురులో రిమోట్ దొరకబుచ్చుకుని టీవీ ఆన్ చేశాడు. స్క్రీన్ మీదకి బొమ్మ రాగానే సౌండ్ బాగా తగ్గించేశాడు. అలా ఓ పది నిమిషాలు చూసేసరికి కొత్త హుషారు పుట్టుకొచ్చింది. నెమ్మదిగా వంటింట్లోకి వెళ్లి కాఫీ కూడా తనే కలుపుకుని తెచ్చుకోవాలన్న నిర్ణయానికి వచ్చి, లేచాడు.

ఫ్రిజ్ లోంచి పాల ప్యాకెట్ తీసుకుని గిన్నెలో కొంచెం పాలు పోసి, స్టౌ మీద పెట్టి, కాఫీపొడి కోసం చూశాడు. అదృష్టం బావుండి వెంటనే కనబడింది. పాలు కాగాక కప్పులో పోసి, పొడి వేసి, పంచదార తీస్తుంటే పొరబాటున డబ్బా చెయి జారి దబ్బుమంటూ నేలమీద పడింది. ఆ శబ్దానికి రంగనాథం గుండె జారిపోయింది. విపరీతమైన కంగారు, గాభరాతో చేతులు వణికాయి. ఆ వణుకుతున్న చెయ్యి వెళ్లి అక్కడే గట్టుమీదున్న పట్టకారుకి తగిలింది. పట్టకారు కదిలి పక్కనే ఉన్న కప్పుని సున్నితంగా తోసింది. నిండుగా కాఫీతో ఉన్న కప్పు భళ్లుమంటూ కిందపడి పగిలి, వేడి కాఫీ రంగనాథం పాదాల మీద విరజిమ్ముకుంది. ఆ వేడికి తట్టుకోలేక రంగనాథం ఆర్తనాదం చెయ్యడం, అప్పటికే వంటింట్లో చప్పుళ్లకి నిద్ర లేచిన భార్య, కొడుకు, కోడలు గుంపుగా లోపలికి జొరబడటం ఒక్కసారే జరిగాయి.

ఆ తర్వాత కొడుకు, కోడలు విసిరిన మాటలు, చూసిన చూపులు అరవై నాలుగేళ్ల రంగనాధానికి మరణశిక్షా సదృశంగా అనిపించాయి. భార్య మాత్రం నోరు విప్పలేదు. సన్నగా వణుకుతున్న భర్తని చెయ్యి పట్టుకుని తమ గదిలోకి తీసుకువెళ్లి, మంచం మీద కూర్చోబెట్టి, పాదాలకు పేజ్ లైన్ రాసింది. తర్వాత వంటింట్లోకి వెళ్లి అక్కడ అంతా శుభ్రం చేసి వచ్చింది. వస్తూ వస్తూ తువాలు తడిపి తీసుకొచ్చి, దాంతో రంగనాథం మొహం శుభ్రంగా తుడిచి, పాదాలకి మరికొంచెం పేజ్ లైన్ రాసి, కళ్లు మూసుకుని పడుకోమన్నట్టు సైగ చేసింది. రంగనాథం పడుకున్నాడన్న మాటే గానీ తెల్లవార్లూ కంటి మీద రెప్ప పడలేదు.

మర్నాడు సాయంత్రానికల్లా కేబుల్ కనెక్షన్ కట్ అయిపోయింది. కోడలు కేబుల్ వాడికి ఫోన్ చేసి కనెక్షన్ తీయించేసిందని గ్రహించిన రంగనాథం పదిమందిలో లాగిపెట్టి లెంపకాయ కొట్టినట్టే అవమానంతో కృంగిపోయాడు. పగటి పూట కూడా టీవీ లేకపోయేసరికి బొత్తిగా కాలక్షేపం కూడా కరువైంది.
"ఏమిరా మాట్లాడవూ... హలో.. హలో రంగా" అవతలి నుంచి జగన్నాథం అరుస్తున్నాడు.
అప్పటికి తెప్పరిల్లిన రంగనాథం, "ఏం లేదన్నయ్యా. ఏదో ఆలోచిస్తూ ఉండిపోయాను. అంతే" అన్నాడు.

"ఒరేయ్ తమ్ముడూ, నీదీ నాదీ కుక్కబతుకు కంటే హీనంగా ఉందని నాకు తెలుసు. నాతో మాట్లాడుతూ ఆలోచనలో పడ్డావంటే ఏదో జరిగిందన్న మాటే. జరక్కపోతే ఆశ్చర్యం గానీ, జరిగితే వింతేమీ లేదు. సరేగాని, నువ్వూ, మీ ఆవిడా కలిసి రేప్పొద్దున్నే బస్సులోనో రైల్లోనో బయల్దేరి కాకినాడ రండి. ఈ మాట చెబుదామనే ఫోన్ చేశాను."

"కాకినాడా... ఎందుకన్నయ్యా"

"చెప్తా... కాకినాడలో మన బుచ్చిపిన్ని కొడుకు సోమేశంగాడి ఇల్లు తెలుసు కదా నీకు?!"

"ఆఁ.. తెలుసు. లంకంత కొంపా.. పెద్ద పెరడూ.. "

"ఆఁ.. అదే. ఈ మధ్య సోమేశం పెళ్లానికి హార్ట్ ప్రాబ్లం వచ్చిందిట. వాడి కొడుకూ కూతురూ ఇద్దరూ అమెరికాలోనే ఉన్నారు కదా. తల్లికి బాగా లేదని తెలిసినా కూడా రాలేదుట. వీళ్లనే అమెరికా రమ్మన్నారుట. వీళ్లు వెళ్లడానికి సిద్ధంగా లేరు. ఏతావాతా దిక్కూ దివాణం లేని బతుకులు బతుకుతున్నారు"

"అయితే చూడటానికి వెళదామనా?!"

"కాదురా. ఈ మధ్య నాకు చాలా పెద్ద ఆలోచనే వచ్చింది. సోమేశం పెళ్లానికి బాగా లేదని తెలియగానే వాడికి ఫోన్ చేసి చూచాయాగా చెప్పాను. మహదానందపడ్డాడు. నీకూ, అనంతకీ కూడా చెప్తా. మీరు తిన్నగా వాళ్లింటికి రండి ముందు!"

"సరే అన్నయ్యా. రేపటెల్లుండిలో బయల్దేరతాం. నీకు ఫోన్ చేసి చెప్తాలే "

***

సోమేశం ఇంట్లో తీరిగ్గా కూచున్నారు ముగ్గురు దంపతులూ.

"వినండర్రా... " జగన్నాథం ప్రారంభించాడు.

"మనం ఆరుగురం వృద్ధాప్యంలోనే ఉన్నాం. ఆరుగురికీ చిన్నో పెద్దో ఆరోగ్య సమస్యలు ఉన్నాయి. మనకి పిల్లలున్నారు గాని, ఎవరికీ పిల్లల వల్ల సుఖం లేదు. కాలానుగుణంగా సంపాదన పెంచుకునే క్రమంలో మనల్ని వీలైనంత ఉపయోగించుకుంటున్నారు మన పిల్లలు. మనం ఒక నలభయ్యేళ్ల పాటు గాడిదల్లా కష్టపడిన వాళ్లమనీ, ఇక ఈ వయసులో కూడా గాడిద చాకిరీ చెయ్యడం మన వల్లకాదనీ వాళ్లకి కనీసంగా కూడా అనిపించడం లేదు. మన చిన్న చిన్న కోరికల్ని కూడా నిర్దాక్షిణ్యంగా కాలరాసేసి, మన శరీరాలతోనే గాని, మనసులతో పనిలేనట్టే ప్రవర్తిస్తున్నారు. మనం అహం చంపుకుని, స్వాభిమానాన్ని వదులుకుని బతకాల్సొస్తోంది. పోనీ వాళ్లని వదిలి వచ్చేద్దామా అంటే ఒంటరిగా బతకాలన్న భయం. వృద్ధాశ్రమంలో చేరిపోదామంటే అక్కడ బావుండదన్న బాధ. ఇదంతా ఆలోచిస్తూ ఉంటే నాకో ఆలోచన వచ్చింది. మనం ముగ్గురం రక్తసంబంధీకులం. ఒకళ్లంటే ఒకళ్లకి అభిమానం, ఆప్యాయత ఉన్నాయి. మనం, మన పెళ్లాలూ కలిసి కేవలం మన కోసమే ఒక ప్రశాంతమైన వృద్ధాశ్రమాన్ని, మనకి కావలసిన రీతిలో ఎందుకు నిర్మించుకోకూడదు?"

"అంటే...?" రంగనాథం, అనంతలక్ష్మి ఒకేసారి ప్రశ్నించారు.

"అంటే ఏమిటో, నా ఆలోచన వివరంగా చెబుతాను వినండి. మనం ఆరుగురం ఒక కప్పు కింద, ఒకరికొకరం తోడుగా కలిసి మెలిసి బతుకుదాం. మనం ఆర్ధికంగా బాగానే ఉన్నాం. అంచేత ఒక ఫుల్ టైమ్ సర్వెంట్ ని పెట్టుకుందాం. ఆ మనిషి సహాయంతో మన ఆడవాళ్లు వంటలు చేస్తారు. హాయిగా కావలసినవన్నీ వండుకుంటూ ఇంటి తిండే తిందాం. పోతే, మనం కలిసి ఉండటానికి గాను కొన్ని షరతులు విధించుకుందాం. కామన్ ఖర్చులు సమానంగా పంచుకోవడం, ఎవరి మెడికల్ ఖర్చులు వాళ్లే భరించుకోవడం, ఒకరి ఇష్టాల్ని ఒకరు గౌరవించడం లాంటి షరతులు. ఒకప్పుడు తోడికోడళ్లకి ఒకళ్లతో ఒకళ్లకి నప్పి ఉండకపోవచ్చు. కానీ ఇప్పుడు అనుభవాలు పాఠం చెప్పిన తర్వాత వాళ్లు సొంత అక్కచెల్లెళ్లలా కలిసీ మెలిసీ ఉంటామంటేనే ఈ పద్ధతిలో బతుకుదాం. లేకపోతే ఎవరి కుక్క బతుకు వాళ్లదే. ఏమంటారు?!"

"అంతా బాగానే ఉంది. పిల్లలు మన సంగతి పట్టించుకోవడం లేదన్నది నిజమే. కానీ, ఎంతైనా కడుపున పుట్టిన పిల్లలు! ఇలా వచ్చెయ్యడమంటే వాళ్లతో తెగతెంపులు చేసుకున్నట్టేనా..?!" అనంతలక్ష్మి అడిగింది.

"ఛీ.. అదేం కాదు అనంతా! నేనూ మీ బావగార్ని ఇలాగే అడిగాను. ఆయనే చెప్తారు విను.. " జగన్నాథం భార్య వనజ అంది.

జగన్నాథం మళ్లీ చెప్పడం ప్రారంభించాడు. "పిల్లలు చేస్తున్నది తప్పా.. ఒప్పా అన్న ఆలోచనే మనకి వద్దు. వాళ్లు తప్పు చేసినా కూడా మనం వాళ్లని వదులుకోలేం. కేవలం మన శక్తికి మించిన చాకిరీ, చెయ్యలేకా, చిన్న చిన్న కోరికలు కూడా చంపుకుని కసుళ్లూ విసుళ్లూ భరిస్తూ ఉండలేకా, మనం బైటికి వచ్చేస్తున్నాం. అంతే. మన ముగ్గురి పిల్లలూ ముగ్గురికీ సమానమే. ఏ పిల్లలైనా ఎప్పుడైనా మన దగ్గరకి రావచ్చు. వాళ్లకి ఇష్టమైనన్ని రోజులు ఉండొచ్చు. పండుగలకి మనం వాళ్లని రమ్మని పిలవనూ పిలవొచ్చు. అలాగే ఎప్పుడు ఎవరికి పిల్లల దగ్గరకి వెళ్లాలనిపిస్తే అప్పుడు వెళ్లొచ్చు. అంతే కాదు, పిల్లలకి చిన్నా పెద్దా సమస్య, ఇబ్బంది ఏది వచ్చినా మనం వెళ్లి, మన శక్తి కొద్దీ వాళ్లకి సహాయం చేద్దాం. ఈ మాటలన్నీ వాళ్లకి చెప్పి, వాళ్లని ఒప్పించి మరీ మనం మన ఉమ్మడి కుటుంబాన్ని ప్రారంభిద్దాం. అంతేగాని వాళ్లతో శతృత్వం పెట్టుకుని విడిపోయి కాదు. ఇప్పుడు చెప్పండి... ఏమంటారు?" జగన్నాథం అడిగాడు.

"కలిసుందాం... " ఆడవాళ్లు ముగ్గురూ ఒక్కసారిగా ముక్తకంఠంతో ఎలుగెత్తి పలికారు. మగవాళ్ల మొహాలు ఆనందంతో విచ్చుకున్నాయి!!

***0***

# దేవుడు మావయ్య

చెన్నుపాటి రమేష్




“సిద్దా..! దేవుడు మామయ్య కలిశాడటగా?" అంది అమ్మ..ఇంటి వీధి గుమ్మం తలుపు తీస్తూనే.

నేను సమాధానం చెప్పలేదు. చివ్వున తలెత్తాను. 'ఎవరు ఎవరికి మామయ్య ..? నీ తోడబుట్టినోడా..? నా బొడ్డు తాడు కోసినోడా? ఏవిధంగా మామయ్య నాకు?' అనుకున్నా మనసులో.

‘ఏంటి నాన్నా అలా ఉన్నావ’నడిగింది అమ్మ.

“ఏం లేదులే!” అంటూ ఓ ఈసడింపు చూపు చూసుకుంటూ వచ్చేశాను. ఏం చెప్పాలి ఈవిడికి? తనూ ఆ మహానుభావుడి బాటేగా. తానా అంటే తనూ ఉన్నానన్నట్టూ. అసలెవరాయన నా విషయాల్లో తల దూర్చడానికి. సెల్ చార్జింగ్లో పడేసి షార్ట్స్ మార్చుకుని హెడెసెట్ పెట్టుకుని బ్లూ టూత్ సెట్చేసుకుని ఇంటి వెనుక బావి గట్టుకి చేరి జారగిలబడ్డాను. లోపల్నుంచి ఫోను మోగుతుందంటూ అమ్మ తీసుకొచ్చి ఇవ్వబోయింది.

“నీకు తెలియదూ చెప్తే వినవు. దీనికి బ్లూటూత్ ఏక్సెస్ ఉంది. నేను కావాలంటే ఇక్కడ్నించే ఫోను మాట్లాడగలను. నీకు ఎన్నిసార్లు చెప్పాలి? నా ప్రైవసీకి అడ్డు రావద్దని.” గట్టిగా అరిచాను.

ఇంతలో 'షహరిస్', అవతల ఫోన్లో..! "ఏంటేబీ..! ఎవ్రిధింగ్ కూల్ నా?" అని అడిగింది.

“యా బంగారం! మళ్ళా మాట్లాడతా నీతో.” అన్నా.

"లవ్యూ", అంటే 'లవ్యూ టూ', అనుకుని ఫోన్ పెట్టేసి, అమ్మ వైపు తిరిగి తీవ్రంగా చూశాను.

“అమ్మా! ఎథికల్ అని కొన్నుంటాయి. నేను తనతో ఫోను మాట్లాడేటప్పుడు నిన్ను పక్కన నిలబడొద్దన్నానా.” విసుగ్గా అరిచాను. అమ్మ ఏదో చెప్పబోయింది.

“నాకు వినే ఆలోచన కానీ.. ఓపిక్కానీ లేవు. నన్ను కాసేపు ఒంటరిగా ఒదులమ్మా.. ఒంటరిగా.. ప్లీజ్..” ఒత్తి పలుకుతూ అన్నాను.

"సిద్దా ! ఒంటరిగా ఉండటమంటే ఒక్కడివే ఉండటం కాదు. మనిషి నిండా ప్రశ్నలు నింపుకుని మనసంతా ఆలోచనలు పెట్టుకుని.. ఎంతసేపు ఒంటరిగా కూర్చుంటే స్వాంతన దొరుకుతుందా?" అంది.

నేనేమీ మాట్లాడలేదు.

"సిద్దా! చెట్టంత ఎదిగిన కొడుకువి.. నువ్వన్న ఎధిక్స్ నాకున్నాయో లేదో కానీ, పెళ్ళి కాకుండానే కలిసి ఉంటున్నారే... నీకూ ఆ షహరిస్కి కి ఉన్నాయా ఎధిక్సూ మేనర్సూ? ఆ బంధం పేరేంటి? సరే

ఉంటున్నారు.. అది కరెక్టేనా? కాసేపు మీ లివిన్ రిలేషన్ సరైందే అనుకుందాం. ఏంకోరుకుంటుందది? లీవ్ ఎనీ రిలేషన్ అంటోందా? అదేమని ప్రశ్నించిన దేవుడి మామయ్యని తూల నాడతావా.. ఆయన మనసెంత బాధపడిందో కదా!" అంది అమ్మ.

"అమ్మా! లీవిట్. నాట్ అగైన్." అంటూ అరిచాను.

అమ్మ పేలవంగా నవ్వి.."సిద్ధా! ఎలా ఉండే వాడివి ఎలా అయిపోయావు? ఆ దేవుడు మావయ్య..", అంటూ ఇంకా ఏదో చెప్పబోయింది..

"అమ్మా మనింట్లో మరోసారి ఆయన మాట వినబడితే బాగోదు.. అసలు ఎవరమ్మా ఆ దేవుడు మామయ్య? ఏంటీ ఆయనకీ మనకీ సంబంధం? నా పుట్టుక ..." నేను మాట పూర్తి చేసేలోపు అమ్మ తన చేత్తో నా నోరు ముయ్యబోయింది.

నేను విదిలించుకుని, "నా నోరు ముయ్యటం కాదు. బయట నా పుట్టుకనే ప్రశ్నిస్తున్నారమ్మా. ఇంతకీ మా నాన్నెవరు?" నా మాటలు పెదవి దాటే లోపు.. అమ్మ తన రెండు చెవులూ మూసుకుని అక్కడ్నుంచీ వెళ్ళిపోయింది.

"అయినా ఆ నేరస్తుడు నాకు మామయ్య ఏమిటీ? హంతకుడు ఊరంతటకీ దేవుడెలా అయ్యాడు? వదిలెళ్ళి పోవటం ప్రశ్నలకి సమాధానం కాదమ్మా." అంటూ రగిలిపోయాను.

ఆ బావి గట్టునానుకుని చతికిలపడి అలానే ఉండిపోయాను. నాలో నేనే కుమిలిపోయాను. కాసేపటికి కునుకు పట్టేసింది. ఎప్పటికో కళ్ళు తెరిచాను. తలంతా భారంగా ఉంది. మెల్లగా ఇంట్లోకి నడిచాను. వెనక తలుపు వారగా వేసుంది .. మెల్లగా తోశాను. బెడ్ లాంప్ వెలుగులో డైనింగ్ టేబుల్ మీద కాగితాలేవో బరువు పెట్టబడిన దేవుడు బొమ్మ కింద.. బయటి గాలికి కదులుతున్నాయి. దగ్గరకెళ్ళాను. బొట్లు బొట్లుగా తడారిన కాగితాలు. అది అమ్మ రాత.

"సిద్ధా! అమ్మల ప్రశ్నలకి కొడుకులు సమాధానాలు వెతుక్కోవాలేమో కానీ.. పిల్లల ప్రశ్నలకి తల్లుల జీవితాలే సమాధానాలురా. నీ పుట్టుకని నువ్వు ప్రశ్నిస్తే బావుండేది.. ఎవరో అడిగారని నన్నడిగావు చూడూ.. అదే.. కొద్దిగా బాధనిపించింది. నీకు ప్రశ్నించటం నేర్పిందే నేను... నీకు సమాధానాలు చెప్పాల్సిన రోజొస్తుందని అనుకోలేదు. వచ్చింది. చెప్తాను విను".

"నువ్వు పుట్టడానికి ముందే దేవుడు మావయ్య నాకు పరిచయం. వాడూ, నేనూ అనాధలం. ఒకే ఆశ్రమంలో పెరిగాం. వాడు సన్నగా పీలగా ఉండేవాడు. మీ అమ్మ ఎక్కడ్రా అంటే ఆకాశం వైపు చూసేవాడు. నాన్నెవర్రా అనేవాళ్ళు.. అప్పుడూ ఆకాశం వంకే చూసేవాడు. వీడు దేవుడు బిడ్డరా అనేవారు. దేవుడు బిడ్డ దేవుడేగా. అందరికీ తలలో నాలుకలా ఉండేవాడు. ఎవరికేం కావాల్సొచ్చినా చేసి పెట్టేవాడు. బట్టలు ఉతికి పెట్టడం నుంచీ బరువులు మోసి పెట్టటం, గదులు ఊడ్చి సర్ది పెట్టటం వరకూ. అన్నాలప్పుడూ అంతే... అందరూ తిన్నాకే వీడు తినేవాడు. స్కూలు చదువులు ఆశ్రమం బడిలోనే. ఆ తర్వాత కాలేజీకి

నేను రోజూ దూరంగా వెళ్ళొచ్చేదాన్ని. ఓ రోజు రొప్పుకుంటూ పరిగెత్తు కొచ్చాను. వీడు చూశాడు. నన్ను వెంటాడిన మగ తోడేళ్ళని వీడే మళ్ళీ వాళ్ళు నా వైపు తిరిగి చూడకుండా తరిమేశాడు. వాళ్ళు పారిపోయే ముందు వీడిని బలంగా రాయిచ్చుకుని కొట్టారు. రక్తం తెగ కారింది."

"ఎందుకురా దేవుడూ నీకింత అభిమానం నా మీద", అన్నా. "అక్కా నీకు గుర్తుందో లేదో? చిన్నప్పుడు నాకు జ్వరం వచ్చినప్పుడు నేను చచ్చిపోతానని అందరూ అనుకుని వదిలేశారు. నువ్వు రోజూ వచ్చి నా పక్కన కూర్చుని, నా ఆలనా పాలనా చూసుకుని.. గూట్లో దేవుడి బొమ్మ దగ్గరి బొట్టు నా నుదుట పెట్టి కళ్ళ నీళ్ళు పెట్టుకునే దానివి. నీ కంట్లో నీరే నన్ను బతికించిందక్కా" అనేవాడు. నువ్వు అక్కవు కాదు అమ్మవు అనేవాడు. నేను వాడ్నలాగే చూసుకున్నా. మీ నాన్నా వాడ్నలాగే చూసుకున్నాడు. మీ నాన్న... నాకు కాలేజీలో సీనియరు. ఎర్ర జెండాలు, విప్లవోద్యమాలూ, సమసమాజం, సమానత్వం అంటూ తిరిగేవాడు. నాకు అర్థం కాకున్నా నచ్చేవాడు. నన్ను అర్థం చేసుకుని పెళ్ళి చేసుకున్నాడు. నువ్వు కడుపున బడ్డావు. దేవుడు మామయ్యా మనతోనే ఉండే వాడు. మీ నాన్న ఫ్యాక్టరీలో పనిచేస్తూనే ఉద్యమాలు నడిపేవాడు. ఊరందరి కోసం చేసే పోరాటం.. వెలుగులో కంటే చీకట్లోనే ఎక్కువ చేయాల్సొచ్చేది. అడవి బాటలో చాలా ముందుకెళ్ళినా, తను మొదట్లో అప్పుడప్పుడూ తిరిగొచ్చినా.. రాను రాను తగ్గిపోయింది.

తను తిరిగి రాలేనంతగా పోలీసుల కాపలా ఎక్కువయ్యింది. దేవుడి మావయ్యకి నా బాధ్యత అప్పజెప్పి మీ నాన్న ప్రజల బాధ్యత నెత్తి నెత్తుకున్నాడు. వాడు నా పెద్దకొడుకయ్యాడు. అన్నీ వదులుకుని, నువ్వూ నేనే తన లోకం అనుకునేవాడు. ఓసారి మీ నాన్న గురించీ ఎంక్వయిరీ పేరుతో ఇంటికి రావడం మొదలెట్టిన కానిస్టేబులు, నన్ను పెట్టకూడని ఇబ్బంది పెట్టి, చెయ్యకూడని పని చెయ్యబోతే, దేవుడు మామయ్య అడ్డుపడి రోకలి బండతో కొట్టాడు. చచ్చిపోయిన పోలీసు డ్యూటీలో ఉన్న అమర జవానయ్యాడు. దేవుడు మావయ్య నేరస్తుడయ్యాడు. మీ నాన్న సమాజపు చీకటి తెరలు తొలగించాలనుకుని ఆ పోరాటాల్లో తనే అక్కడ శాశ్వతంగా ఉండిపోయాడో.. లేక లోకాన్నే వదిలిపోయాడో కానీ, మళ్ళీ తిరిగి రాలేదు.

దేవుడు మావయ్య మటుకు జైలు నుంచీ తిరిగొచ్చి, పూర్తిగా మనతోనే ఉండిపోయాడు. ఇవన్నీ ఇంత వివరంగా నీకెప్పుడూ నేను చెప్పకపోయినా కొంతకొంత తెలుసుకుంటూ ఉన్నావనుకున్నా సిద్ధా!"

"నువ్విన్నాళ్ళూ అడగకపోతే ఎంత మంచిగా ఎదిగిపోయావో, చక్కగా తెలుసుకున్నావని మురిసిపోయా. కానీ, సిద్ధా..! ఒక్కోసారి చాలా ఎత్తుకు ఎదిగేస్తాం.. నీలా..ఎవరూ ఊహించనంత.. నీతో సహా.. ఎవ్వరికీ

అందనంత.. మనకి మనమూ దిగిరాలేని ఎత్తులు.. ఇంక దిగలేని దిగజారలేని ఎత్తులు!...." అమ్మ ఇంకా ఏవేవో రాసింది..

ఇక చదవలేక పోయాను. చదవలేని అక్షరాలు తడిసి ఉన్నాయక్కడ.. కాగితం మీదా, నా కళ్ళలోనూ. 'క్షమించమ్మా.. అమ్మా అంటూ...వీధి అరుగు వైపు అరుచుకుంటూ వెళ్ళా.

చిన్నప్పుడు మా అమ్మ ప్రతిరోజు ఉదయం నా తల దువ్వి, చక్కగా తయారు చేసి, నన్ను బడికి దేవుడు మావయ్య సైకిలెక్కించి పంపించాక, అక్కడే ఎదురు చూస్తూ కూర్చునేది.. నా కోసం! ఇప్పుడూ అక్కడే కూర్చుని ఉంది. దగ్గరకెళ్ళి పిలిచా.. పలకలేదు. కదిలించా కదల్లా.. ఆ తెల్లారి దేవుడు మావయ్య వచ్చి కదిలించినా కదల్లేదూ, పలకలేదు.

"సిద్ధా! బతుకంతా పోరాడిందిరా నా అక్క... కాదు కాదు మా అమ్మ. ఇంత తొందరగా ఎందుకు అలిసిపోయిందిరా? తను చెప్పిన పనులన్నీ చేశానురా.. ఒక్క నీ 'షహరిష్ని' ఈ ఇంటికి తీసుకురావటం తప్ప. అది నా తప్పురా సిద్ధా.. దానికింత శిక్షా!" అంటూ దేవుడు మావయ్య.. నా దేవుడు మావయ్య ఏడుస్తుంటే.. మా అమ్మ ఆయన కళ్ళతో నన్ను చూస్తూ ఉంది అచేతనంగా!

'మా నాన్నలా.. దేవుడు మావయ్యలా.. నేనుఎప్పుడు ఎదుగుతానా అని..' అమ్మల ప్రశ్నలకి జవాబులు చెప్పలేని ఎందరో కొడుకుల్లా నేను.. నిర్వీర్యంగా..నిస్తేజంగా...!!

***0***

# లక్ష్మి

## రావిశాస్త్రి



లక్ష్మీనాథరావుగారు మధ్యాహ్నం సరిగ్గా ఒంటిగంటకి పీటమీద కూర్చుని, కుడిచేద్ది అరిటాకంత ఆరిచేతిని దోసీలంత చేసి, నిండా నెయ్యి వేయించుకొని కొంత జుర్రి, మిగతాది అన్నంలో కలుపుకొని భోజనానికి ఉపక్రమించారు.  పప్పు, మూడు కూరలు, మూడు పచ్చళ్ళు, ఆవకాయ, అప్పడాలు, పేలవడియాలు, బెల్లప్పులుసు, పరమాన్నం, రాజుమాను మామిడి పళ్ళు, బంగినిపల్లి పళ్లముక్కలు, మోఖిరీ అరటిపళ్ళు,  ఆఖర్న గడ్డకట్టిన మీగడ పెరుగు - అన్నీ అయేక  గుర్రున త్రేన్చి హుందాగాలేచి, వంటవాడు నీళ్లు పొయ్యగా చెయ్యీ మూతీ కడుక్కుని భార్య అందించిన పట్టులాటి తుండుగుడ్డతో ఒత్తుకొని పడగ్గదిలోకి విలాసంగా నడచి పందిరి మంచంమీద మేనువాల్చి 'మరుబారికోర్వలేనే నారీమణిరో' అని చిన్న కూనిరాగం తీస్తూ విశ్రమించేరు.  కాస్సేపట్లో, ఆయన భార్య భక్తిశ్రద్ధలూ ప్రేమానురాగాలూ ఉట్టిపడుతుండగా కలకల్లాడుతూ వచ్చి ముఖ్మల్ దిండులా పక్కనచేరి, పండు తమలపాకులు చిలకల్లా చుట్టి ఓ చిలకని పంటికొనతో పట్టి భర్త ముఖంమీద వాలి ముద్దుగా "తీసుకోండి" అంది.  ఆ చిలక సగంమేరకి అతని దంతాలక్రింద నొక్కుకుపోగానే 'అబ్బ! మీ మూతికింకా నేతివాసన పోలేదండీ!" అంటూ ఆ నేతి వాసనగల నాజూకు పెదవులని మెత్తగా నొక్కిందావిడ.  నొక్కుకుపోయిన కొరమీసంలోంచి వీలయినంత చిరునవ్వు చిలికించి ఆవిణ్ని అక్కున చేర్చుకున్నారు లక్ష్మీనాథరావుగారు.  పైన ఊరంతట్నీ మండించే వడగాలి వారి శయ్యాగృహపు కిటికీలకీ  గుమ్మాలకీ తడిగా వేళ్ళాడే వట్టివేళ్ల తడకల్ని ముద్దాడి చల్లబడి లోనికివచ్చి తియ్యగా నిట్టూర్చి గదిలో పందిరి మంచాన్ని కమ్మగా కమ్ముకొంది.  రతీదేవివంటి సతిని కలిగిన లక్ష్మీనాథ రాయుడుగారు ఆ మధ్యాహ్నమల్లా మన్మధుణ్ణి మించి చరించి, ఆ రాత్రికిమాత్రం చంద్రవదన ఇంటికివెళ్లి అక్కడ దేవేంద్రుళ్లా విహరించేరు.  ఊర్వశి తిలోత్తమల్ని మించిన చంద్రవదన ఆ రాత్రల్లా  రాయుడువారిని ప్రేమసాగరంలో ఓలలాడించింది.  ఆవిధంగా పగలూ  రాత్రీ అనే భేదం లేకుండా లక్ష్మీనాథరాయుడు గారు శ్రమించి (!) సుఖించేరు.

లక్ష్మీనాథరాయణింవారు ఇప్పుడు లేరు. క్రీస్తుశకం 1910 వ సంవత్సరాంతమందు వారు పరమపదించారు. లక్ష్మీనాథరాయణింవారంటే పడని దుర్మార్గులు – 'కిట్టని వెధవలు' – వారు, అనగా రాయణింవారు, ఊరందర్నీ 'దోచేసి బతికేసే'డంటారు. కాని, రాయణిం వారి బంధుమిత్రు లెవరూ కూడా ఆ మాట నమ్మరు. నమ్మడానికి ఆధారాలే కనిపించవు. "మావాడు ఎవర్నండీ దోచేసింది? ఎవర్ని? చెప్పండి చూదాం" అని కఠినంగా ప్రశ్నిస్తారు వాళ్లు. ఆ ప్రశ్నకి సమాధానం చెప్పడం చాలా కష్టం. చెప్పగలిగిన వాళ్ళంతా సర్వనాశనం అయిపోయేరు. నంజుకొందామన్నా విస్తట్లోకి లేకుండా పోయేరు వాళ్లు.

లక్ష్మీనాథరావుగారు సంపాదించిన ఆస్తంతా కూడా ఆయన "అక్రమంగానూ, అన్యాయంగానూ సంపాదించేరనే అనుకుందాం. అయితే నేవండీ! తను తిన్నంత తిన్నాడు. పైవాళ్ళ కింత పెట్టేడు. పోయినప్పుడు తనేం పట్టుకుపోలేదు కదా!" అంటూంటారు ఆయన ఆత్మీయులు. లక్ష్మీనాథరావు గారిలో అదొక ప్రత్యేకత ఉంది. పోయినప్పుడు వారొక్క ఎర్ర నేగాని, ఒక్క పచ్చి పులుదొంపుల్ల, ఒక్క కంచు మరచెంబు మూత, ఒక్క పంపరపనస పండు డిప్ప, ఏదీ కూడా పట్టుకుపోకుండా, నిస్వార్థంగా, ఎవర్నీ తనకి తోడుగానైనా రమ్మనకుండా కళ్లు మూసేసుకొని ఎలా ఉన్నవాడలాగ్గే కట్టుబట్టలు కూడా చాకలి కిచ్చేసి ఇహలోకయాత్ర చాలించేసి వెళ్ళిపోయారు.

లక్ష్మీనాథరావుగారు ఏయే పాపాలు చేసేరో చెయ్యలేదో అవన్నీ ఆ భగవంతుడికే ఎరుక. వారి పాపపుణ్యాలెంచడానికి పాపపంకిలంలోనే కొట్టుకొంటోన్న మానవుల కది సాధ్యంకాని సాహసప్పని. నీయొక్క న్యాయాన్యాయాలు ఇతరులు విచారించగలరు. జాగ్రత్త!.

చచ్చినవారి గురించి మంచే చెప్పుకోవాలిగానీ చెడ్డమాటలు ఆడిపోసుకో కూడదు. లక్ష్మీనాథరావు వీరికీ వారికీ పేచీలుపెట్టి వారివారి భూముల్ని ఒళ్లో పడేసుకున్నాడనిగాని, రెవెన్యూ వార్ని లోబరుచుకొని బంజర్లు ఆక్రమించేసుకున్నాడనిగాని, రూపాయి అప్పిచ్చి రూపాయికి రెండేసి శెంట్ల చొప్పున పొలాలు తన పరం చేసుకున్నాడని గాని, ఆయన ముండల ముత్తాకోర్ అని గాని, ఆయన పరమ తాగుబోతనిగాని, ఆయన బంగారు కాసుల్తో జూదం ఆడేవారని కాని ఎవరూ అనుకోకూడదు. ఆయన మంచి స్ఫురద్రూపి. నాలుగు డబ్బులు గడించేరు. ఆ నాలుగు డబ్బులూ ఖర్చు చేసేసేరు. ఆయన మొదట్లో గొప్ప భోగి, ఆ తరువాత మంచి యోగి.

కాని, లక్ష్మీనాథరావుగారు 'హరీ' అనకముందూ అంటూండగానూ కూడా (ఆఖర్న "హరీ హరీ" అంటూనే చనిపోయేడట. ఆ మాటల్ని చెవులారా విని ఆ చావుని కళ్లారా చూసిన ఆయన మేనల్లుడు అందు గురించి దాఖలాగా చాలా కాలం నిలిచి ఉన్నాడు.) - కానీ లక్ష్మీనారాయణంవారు హరిహరీ అనేసి అవతారం

చాలించేసేలోగా కొంతమంది మార్వాడీవారు దస్తావేజులు పట్టుకొని తమ తమ లాయర్ల దగ్గరికి వెళ్ళడం, అనతికాలంలోనే రాయణింగారి స్థిర చరాస్తులన్నీ టమాటమా అయిపోవడం జరిగింది.

లక్ష్మీనాథరావుగారి మనవలంతా ఆవిధంగా పాలులేని పాముల్లా, లేళ్లు దొరకని చిరుతల్లా, దీనంగా హీనంగా దుస్థితిలోకి దిగజారిపోవలసొచ్చింది. రాయణింగారికి ఒక్కడే పుత్రసంతానం. ఆ పుత్రుడు కూడా కొంతకాలానికి పెర్రెత్తిపోయి దమ్మిడీకి మారకుండా ఉండిపోయాడు. లక్ష్మినాధారావుగారు బాగా బతికినకాలంలో వారికి భూమే ఆస్తి. సరుకుల వ్యాపారం, సరుకుల తయారీ, వాటి రవాణా, వాటి అమ్మకం, కంపెనీలు, లిమిటెడ్ కంపెనీలు, కమీషన్లు, షేర్లు, బ్యాంకులు, ఇటువంటి వ్యవహారాలేవీ వారికి తెలియవు. భూమినమ్ముకునీ, అమ్ముకునీ చాలామంది చెడిపోయేరుట. లక్ష్మినాథరావుగారు నాశనమే అయిపోయేరు. అందుచేత ఆయన మనవళ్ళు ఏ ఒక్కరూకూడా భూమిని మాత్రం నమ్మరు. వారంతా చాలాకాలం వరకూ “అడ్రస్ లేకుండా” అయిపోయారు.

ఆ ప్రకారం, లేక ఆవిధంగా ఉంటొండగా

క్రీస్తుశకం 1932వ సంవత్సరం ఏప్రియల్ మాసారంభాయన్న జూనియర్ లక్ష్మీనాథ రావు కాదంబరి వారి సందులోపలి ఒకానొక ఉపసందులో కూలిపోబోతున్న ఒక యింటి వీధిగుమ్మపు మెట్టుమీద తీరిగ్గా కూర్చున్నాడు. అతనికి పన్నెండేళ్ళ వయసు. అతను తొడుక్కున్న నిక్కరు రెండేళ్ళనాటిది. చొక్కా అతని తమ్ముడిది. అతని జుట్టు ఆర్నెల్లు పెరిగినట్టిది. అతని వళ్ళు నాలుగు రోజుల్నించి స్నానం చెయ్యనిది. అతని పేరు తాతగారిది. “రాయణింగారికి సాక్షాత్తూ కొడుక్కొడుకు!” ఇంట్లో వాళ్ళకీ, స్నేహితులకీ అతని పేరు ‘లక్ష్మి’.

ఆవేళ ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంటయింది.

ఆ రోజున రెండెడ్లబండీ ఒకటి బాగా ముస్తాబయి బాజాల్తోసహా బయల్దేరి ఊరంతా కరపత్రాలు వేదజల్లింది. కోహినూర్ థియేటర్ కి మియంగాడు ఆ సాయంకాలం వస్తున్నాట్ట. (పట్టణ పౌరులు మాస్టర్ విఠల్ కి పెట్టుకున్న ముద్దుపేరు – “మియాంగాడు”)
“వస్తున్నాడు మీ మియాం!!!”
“మదనకళ”లో మీ ప్రేమాభిమానాల్ని చూరగొన్న మీ ముద్దుల హీరో మాస్టర్ విఠల్ - ఈ రోజు మళ్ళీ వస్తున్నాడు.”

మీరంతా నచ్చి మెచ్చిన మీ స్వంత హీరో మాస్టర్ విఠల్ అనబడే మీ మిత్రుడు మీ హితుడు నేడు తిరిగి వస్తున్నాడు.

మా కోహినూర్ థియేటర్ కి!!! రండి! త్వరపడండి!! తోసులాడుకు పడి పోకండి! కాని వచ్చి చూడ్డం మర్చిపోకండి!!

వచ్చేస్తున్నాడు మీ మియాం!

"మియాం! మియాం! మియాం!!!

అదీ కరపత్రం.

మరింక చచ్చిపోసైనా చచ్చిపోతాడు కానీ కథానాయకుడు మాస్టర్ విఠల్నీ నాయకీమణి, ("భువనసుందరి") మిస్ జుబేదానీ చూడకుండా ఉండజాలడు జూనియర్ లక్ష్మీనాథరావు అనబడే లక్ష్మి. అయితే సినిమాగేటు ఈవలకీ ఆవలకీ తేడా రెండణాలు. ("టిక్కెట్టు చూపించినదే లోనికి ప్రవేశించరాదు") బెడ్డబ్బులడుగితే లక్ష్మి వాళ్ళమ్మ ఇవ్వనుగాక ఇవ్వనంది. దాన్తో లక్ష్మికి ప్రపంచంమీదా తాతగారి ఫోటోమీదా కోపం వచ్చింది. అద్దం బద్దలుకొట్టేసి ఫోటోని చంపేస్తానని బెదిరించేడు. కాని లాభం లేకపోయింది. పాత పారిజాతం పువ్వులు పెట్టి అలంకరించిన, తాతగారి ఫోటో పాడుజేస్తానన్నప్పటికీ లాభం లేకపోయిందంటే అమ్మ దగ్గిర కాణీ లేదన్నమాటే! ఆవిడ దగ్గిర కాణీ అయినా లేకపోవడంచేత బ్లేడ్డబ్బులు ఇవ్వనుగాక ఇవ్వనందన్న సంగతి కొడుక్కి అర్థమయిందని ఆవిడకి తెలీదు.

మియాంగాణ్ణి ఎలాగైనా చూడాలనుంది లక్ష్మికి. కోరికలు తీరాలంటే భగవంతుణ్ణి ప్రార్థించమంటుంది వాళ్లమ్మ. దేవుడికొక దండం మాత్రం వదిలేసి, సినిమాకి ఎలా వెళ్ళడం అని ఆలోచిస్తూ కూర్చున్నాడు లక్ష్మి.

ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంటయింది. అప్పుడే ఎండాకాలం ప్రవేశించింది. సందులో పడుతూన్న ఎండమాత్రం ధూళితో చిలకరించి జల్లినట్టుగా ఉంది. సందుకు రెండువైపులా కుళ్ళుకాలవల్లో చెరోవైపునా నిల్చిపోయిన మురుగునీరు, కుళ్ళిపోయి కురుపులు లేచిన రాక్షసి చర్మంలా ఉంది. కాలవల్లోంచి ఇళ్లల్లోంచీ అదొక రకం మాడువాసన, కుళ్ళిపోయిన వెన్నవాసన, మానని కూరుపువాసన్లా వేసుకొస్తోంది. కాలవ్వార చచ్చిపడున్న ఎలక్కోసం వచ్చిన నాలుగు కాకులకీ కళ్ళుమూసి, ఆ చచ్చిన ఎలకని ఓ గెద్ద రివ్వున తన్నుకు పోయింది. ఆ కాకులు వెర్రిపెధవల్లా ఆ గెద్దవెంట ఎగరడం చూసి లక్ష్మికి చిరునవ్వొచ్చింది. ఓ పక్క నలుగురు పిల్లలు గోళీకాయలాట ఆడుతున్నారు. వారిలో ఒ కుర్రాడు "సోప్ సై సోప్ సై" అంటూ అరుస్తున్నాడు. మరో ఇద్దరు కుర్రవాళ్ళు చొక్కాలూ చెడ్డీలు లేకుండా సందు మధ్య నిల్చొని కోయడాన్ను ప్రాక్టీసు చేస్తున్నారు. "బలే మాంచి చౌకబేరమూ" అనే రామనాథశాస్త్రి రికార్డు ఎక్కడో ఏ నూతిలాటి ఇంట్లోంచో బెక్కూ బెక్కూ వినిపిస్తోంది.

--

మియాంగాడి గురించి తల్చుకుంటూంటే అదొకవిధమైన దురదలావుంది లక్ష్మికి. అదివరకు “మదనకళ” సినిమా అతను చూసేడు. మియాంగాడు మళ్ళీ వచ్చినప్పుడు ‘మిస్ కొట్టీడం’ అతనికి ఇష్టంగా లేదు. చెవిలో సగం తిరిపెట్టుకున్నట్టుందతనికి. మాష్టర్ విఠల్ ని మళ్ళీ చూస్తేనేకాని పూర్తిగా దురతీరదతనికి.

అంతలో సందు మలుపు లో సత్తిరాజులు కనిపించేడు లక్ష్మికి. (ప్రకృతి: సత్యరాజు; వికృతి: సత్తిరాజులు.)

ఖాళీ సిగరెట్ పెట్టెలు ఎడంచేత్తో గుండెల కద్దుకొని సందువారంట్ల చూసుకొంటూ వస్తున్నాడు సత్తిరాజులు. జేబుల్లేని ధూళిచెడ్డీ, జేబుల్లేని ధూళిచొక్కా వేసుకున్నాడతను. అతన్ది నల్లముఖం; అతనివి గుంటకళ్ళు; అతన్ది పొట్టిజుట్టు, లక్ష్మికంటే వయసులో ఓ ఏడాది రెండేళ్లు చిన్నగా ఉంటాడు. ఇద్దరూ ఒకే క్లాసులో ఉన్నారు.
సత్తిరాజులు ఏ పనైనా చేస్తున్నప్పుడు అతి చురుగ్గానూ, ఏ పనీ లేకుండా ఉన్నప్పుడు వెర్రిగానూ కనిపిస్తాడు. అతనికి రోడ్డువార్లంట సిగరెట్టు పెట్టెలేరుకోడం అంటే అతి సరదా. ఆ పెట్టెలన్నీ పట్టుకెళ్తే వాళ్లక్క వాటితో బొమ్మలు చేస్తుందిట. ఓ కుక్క బొమ్మ నోసారి వాళ్ళింటి దగ్గర్నుంచి లక్ష్మి తెచ్చుకున్నాడు కూడాను. ఓసారి ఓ మేడ బొమ్మని మేష్టరుగారింటికి పట్టుకువెళ్ళిస్తే అతను సత్తిరాజులి నెత్తిమీద ముద్దుగా చరిచి కుర్రవాడి భక్తికి మెచ్చుకున్నాడు. సత్తిరాజులు సందులంట తిరిగి తిరిగి ఎవ్వరికీ అక్కర్లేని మేకులూ, గాజుపెంకులూ, రంగురాళ్ళూ కూడా ఏరుకు దాచుకొని, వాటితో ఏవేవో గమ్మత్తులు చేస్తుంటాడు. సముద్రపొడ్డుకిపోయి ఏకదీక్షతో గవ్వలేరుకొస్తాడు. వీధిలో ఉన్న ఆడపిల్లలంతా కూడా అతని గవ్వలతోటే పచ్చీస్ పాళీ, అష్టాచెమ్మా, వైకుంఠపాళీ ఆడుకుంటూంటారు. సత్తిరాజులి కదొక రకం వెర్రని మేస్టర్లకేవి మేస్టర్లకీ కుర్రాళ్ళకీ అందరికీ అభిప్రాయం ఉంది. “ఇంగ్లీషు మేష్ట్రూ, తెలుగు మేష్ట్రూ” కూడా ఆ కుర్రాణ్ణి “ఒరే పిచ్చివెధవా” అని పిలుస్తారు. ఆ మేష్టగార్లబ్బాయిలు స్కూలుకి రాగానే సత్తిరాజుల్ని వెతికిపట్టుకుని రోజుకొక “మామూలు జెల్ల” ఇచ్చుకుంటూంటారు. నాలుగు రోజులపాటు ఆ సంగతి కనిపెట్టిన జూనియర్ లక్ష్మీనాథరావుకూడా సత్తిరాజులి యందు “రోజుకొక మామూలు జెల్ల హక్కు” పొంది, ఆ హక్కుని స్థిరపరచుకొని వినియోగపర్చుకొంటూ వస్తున్నాడు. “ఎందుకురా ఆ కుర్రాణ్ణలా కొడతారు?” అని మరో క్లాసబ్బాయి ఓసారి ప్రశ్నిస్తే “ఎందుకొట్టకూడదు” అని ఇంగ్లీష్ మాష్టగారబ్బాయి ఆశ్చర్యపోయి, “మా వూసుకి నువ్వు రాకూడదోయ్! నీ కెందుకు మా సంగతి” అని ఆ కుర్రవాణ్ణి మందలించేడు.

సందువారలంట వెతుక్కు నొస్తున్న సత్తిరాజులు దగ్గరవగానే,
“ఇవాళెన్రా పెట్టెలు, సత్తీ?” అని అడిగేడు లక్ష్మి.
“పోచీలు మూడ్రా! రొండు కత్తుర్లురా! పాసింగ్ షో ఓట్రా! మొత్తం ఆరు!” అన్నాడు సత్తిరాజులు.

“సర్లే కాని, ఇవాళ నా మామూలు జెల్లేదిరా? ఇచ్చేవుకావు?” అన్నాడు లక్ష్మి.
“ఇవాళేట్రా! పోరా!” అని చిరునవ్వుతో అనీసేడు సత్తిరాజులు.
“మంచి మీదడుగుతున్నానొరే! పేగిరిచ్చీ!” అని డిమాండ్ చేసేడు లక్ష్మి.
“పోరా! రోజూనా? ఇయ్యాళాదోరం కదా!” అన్నాడు సత్తిరాజులు.
“ఆదివారం స్కూలుకి సెలవుంది కాని జెల్లకి లేదు” అని స్పష్టంగా తెలియజేసేడు లక్ష్మి.
“ఇయ్యాలివ్వన్రా! సెలవుల్లో మామూల్లేదన్సెప్పి రాంచెద్దర్రా వొప్పుకున్నాడు.
అనుమంతూ వొప్పుకున్నాడు” అని సెలవుల్లో కూడా తాపులూ జెల్లాలూ ఇచ్చే హక్కు ఎక్కడాలేదని పట్టుపట్టాడు సత్తిరాజులు.
“పోరా బేకూ! వాళ్ళు వెర్రి లంజకొడుకులు కాబట్టి వొప్పుకున్నారు. మొన్న శ్రీరాం సంబరంలో నాదగ్గిర జెల్లపుచ్చుకున్నావా? లేదా?” అని దబాయించేడు లక్ష్మి.
“నువ్విస్సేవ్ కానీ నేను పుచ్చుకోలేదు” అన్నాడు సత్తిరాజులు.
“నువ్విస్సేవ్ కానీ నేను పుచ్చుకోలేదు” అనే సత్తిరాజు మాటల్ని వెక్కిరింతగా అదేవిధంగా రిపీట్ చేసి, “ఏద్దైతేసేంట్రా వెర్రీ! సేనివ్వకుండా నువ్వెలా పుచ్చుకుంటావురా పీరూ!” అని టకాయించి తర్కంలోకి దిగేడు లక్ష్మి.
“సెలవ్ పూటా ఏట్రా ఈసంత?” అన్నాడు సత్తిరాజులు.
“అలా వొప్పుకోమరి” అన్నాడు లక్ష్మి.
“ఏటొప్పుకొన్నాను?” అని ఆశ్చర్యపడ్డాడు సత్తిరాజులు.
“ఆవేళ సంబరంలో నీకు జెల్లకొట్టేనా? ఆవేళ మరి మన బడికి సెలవేనా?”
“సెలవే!”
“మరి సెలవురోజుకూడా జెల్ల మామూలు ఉందన్నమాటేనా?”
సత్తిరాజుని వప్పుదలల్లేకుండానే అతణ్ణి కొట్టగలడు లక్ష్మి. కాని ఒప్పించి కొట్టడంలోనే వుంది సరదా!
“ఒరే నువ్వంతగా అద్దుపైతంగ సెప్తావురా!” అన్నాడు సత్తిరాజులు. అర్థంలేని తర్కాన్ని అద్దుపైతం అంటుంది వాళ్లమ్మ. అద్వైతం అనే మాటని ఆవిధంగా ఉపయోగించడం తల్లి దగ్గర్నించి నేర్చుకున్నాడు సత్తిరాజులు.
“పోపోస్! అద్దుపైతం లేదు, గాడిదగుడ్డూలేదు. నా మామూలు నాకిచ్చీ!” అంటూ ముసుగుతొడగని డిమాండ్ లోకి దిగిపోయేడు లక్ష్మి.
“సెలవుపూటా ఇదేంట్రా?” అని దుఃఖపడ్డాడు సత్తిరాజులు.
“ఒరే తెలుగు పుస్తకంలో కర్ణుడి పాఠం చదివేవా?”
“సదివితే?”

"అందులో ఇంద్రుడు కర్ణుణ్ణడిగినట్టు మంచిగా అడుగుతున్నానోరే! న్యాయంగా నా మామూలూ నాకిచ్చీ! లేకపోతే తెల్సా?" అంటూ బెదిరించేడు లక్ష్మి.

"లేపోతే ఏంటెస్?"

"లేపోతే ఏంటా? మొన్న బైస్కోపులో మియాంగాడు బురదరాజుగాడికిచ్చాడు తెల్సా?"

"ఏంటిచ్చేడెస్?"

"ఖర్చురా ఖర్చు! నా మామూలు న్యాయంగా నాకిచ్చీ! లేకపోతే నాలుగు జెల్లు హెకస్త్రా ఖర్చు! కబడ్దార్!" అంటూ మెట్టుమీంచి లేచెడు లక్ష్మి.

"ఉండ్రా లస్మీ! అదోరం కదరా! మెల్లిగా కొట్టయితే!" అన్నాడు సత్తిరాజులు.

"మెల్లిగా కొట్టాలంటే లంచంవివ్వాలి!" అన్నాడు లక్ష్మి.

"లంచవా! ఏట్లంచం?"

"ఓ కత్తెరమార్కు పెట్టి!"

"ఇయ్యాలా?'

"ఇస్తేనే మెల్లిజెల్ల. లేకపోతె గట్టిజెల్ల!"

సత్తిరాజుకీ అకస్మాత్తుగా దుఃఖవూ, కోపవూ వచ్చేయి.

"నేనియ్యన్రా! పెట్టీ ఇయ్యను జెల్లా ఇయ్యను. నే నెల్లి బలబద్దర్రావుగాణ్ని సెరణడుగుతాన్రా !" అంటూ వెళిపోబోయేడు సత్తిరాజులు.

"ఎక్కడికిరా పోతావూ!" అంటూ గబుక్కున సత్తిరాజుల్ని పట్టుకుని, "పెధవా! బలబద్దర్రావుగాణ్ణి నాకు పోటీ పెడతావురా?" అంటూ అతని నెత్తిమీద గట్టిగా పడపడ చరిచి కత్తెరమార్కు సిగరెట్టు పెట్టోకటి అతని చేతిలోంచి లాక్కున్నాడు లక్ష్మి.

మిగతా ఖాళీ సిగరెట్ పెట్టెలు కూడా కిందకి జార విడిచీసేడు సత్తిరాజులు. అలా చూస్తుండగానే అతని కళ్ళు మందారం రంగులోకి మారిపోయి, నీట్లో తేలిన రెండు ఎర్రని చిరుచేపల్లా, మోటు చిమ్నీల మధ్య రెండు చిన్న దీపాల్లా అయిపోయేయి. అతని నోరు ప్రాణం పోతూపోతున్న దాన్లాగ మెలికలు తిరిగి పోయింది. కుడిచెయ్యి పైకెత్తి ముడుచుకుని దానిమీద తలవాల్చుకొని అయిన వాళ్ళందర్నీ పోగొట్టుకున్న వాళ్ళా ఏడవడం ప్రారంభించేడతను. అతని కళ్ళంట జారే నీళ్ళని మధ్యాహ్నపు టెండ ఓసారి అందుకున్నట్టే అందుకుని ముత్యాల్లా మెరిపించినట్టు మెరిపించి వెంటనే మట్టిపాలు చేస్తోంది.

బందిపోటు దొంగలా ఎగిరొచ్చి గజదొంగలా పారిపోయిన గెద్దని వెంటాళ్ళేక తిరిగొచ్చిన కాకులు, మెడలొంచుకొని  మెల్లచూపులు చూసుకుంటూ బెంగ పెట్టేసుకొని ఓ మట్టిగోడ మీద వరసగా కాసేపు కూర్చుని, ఎక్కడా ఏమీ లాభం లేదనుకొని ఎక్కడికో వెళ్లిపోయాయి. కోయడాన్సు కుర్రాళ్ళు డాన్సు ప్రాక్టీసు చేసి చేసి, తరవాత 'చావాట' మొదలెట్టారు. ఓ కుర్రాడు 'ఓర్నాయనో' అంటే, రెండో కుర్రాడు 'సచ్చిపోనావా' అని గుండెలు బాదుకొంటున్నాడు. చావుని వాళ్ళెన్నిసార్లు చూసారోగాని, అప్పుడు కలిగే దుఃఖాన్ని మాత్రం

వాళ్ళు అతి సహజంగానూ, పరమ భయంకరంగానూ ఇమిటేట్ చేస్తున్నారు. కడుపులు మండిన కాకులు ఎగిరి వెళిపోగానే ఓ ఇంటిగోడ ఎగిరిదూకి ఓ తడారని ఎంగిలాకు రెక్కలు విప్పుకుని సందులో వెల్లకిలా పడింది. ఏడ్చే పాతకలోకం ముఖాన్న ఎవరో రాసి పారేసిన బూతు రచనలా కనిపించే ఆ ఎంగిలాక్కోసం ఓ కుక్కా పందీ పరిగెట్టికొచ్చి పోరానికి ఉపక్రమించేయి.

ఏడుపుతో సత్తిరాజుల ముఖం వికృతంగా సినీమాలో "ఛార్లీగాడి మొహం"లా అయిపోడం చూసి లక్ష్మికి చిరునవ్వొచ్చింది. కానీ ఆ ఏడుపునలా చూస్తోండగా అతని ముఖం జాలిగా మారిపోయింది.

"ఒరే సత్తీ! ఏడవకురా! తప్పయిపోయిందిరా! ఎస్ క్యూజురా! కావలిస్తే నువ్వు నాకో జెల్లిచ్చుకోరా! ఇదిగి నీ పెట్టె! తీసుకోరా! అస్సికానికి కొడితే ఏడుస్తావేంట్రా! కావలిస్తే నన్ను కొట్రా! ఊ రారా ! జెల్ల తీసుకోరా" అంటూ బాగా కిందకి వొంగొని సత్తిరాజుల్ని కొట్టమన్చెప్పి తల ఇచ్చేసాడు లక్ష్మి.

"కొట్రా సత్తీ!" అని మళ్ళీ అన్నాడు లక్ష్మి.

సత్తిరాజులు ఏడుస్తూనే కింద కూర్చొని రెండు చేతుల్లోనూ పెట్టెలు ఏరుకొని దగ్గిరిగా పోగుచేసుకున్నాక, చొక్కాతో ముఖవూ, కళ్ళూ తుడుచుకొని, చొక్కా వొడిగా చేసుకొని అందులోకి పెట్టెలు వేసుకొని ఎడం చేతితో చొక్కపట్టుకొని నిల్చున్నాడు. అతని కడుపుమీద కాలుడు మచ్చలు దొంతర్లు దొంతర్లుగా కనిపిస్తున్నాయి .

"కొట్టుకోరా సత్తీ!" అన్నాడు లక్ష్మి.

"మీలాక్కాదు. నీను కొట్టాను" అని అంటూ దుఃఖాన్ని ఆపుకోలేకపోయాడు సత్తిరాజులు.

"ఎస్ క్యుజురా సత్తీ!" అన్నాడు లక్ష్మి. తిన్నగా నిల్చొని, తరవాత 'సత్తీ! నా దగ్గిర మంచి పాసింగ్ షో పెట్టుందిరా ఇచ్చీదా నీకు?" అని అడిగేడు.

"నీది నాకొద్దు. నీ నేరుకుంటాను" అన్నాడు సత్తిరాజులు.

"పోస్లే అయితే! నీ పెట్టె మాత్రం నాకెందుకు? ఏదో ఒట్నే సర్దాకి తీసుకుంటే పెద్ద ఇదిగా ఏడ్చీసేవు! ఇంద నీ పెట్టె!" అంటూ సత్తిరాజులు ఏడ్చి తనకేదో అన్యాయం చేసినట్టు బుంగమూతి పెట్టుకున్నాడు లక్ష్మి.

తనకి వద్దన్నట్టు తలాడించేడు సత్తిరాజులు.

"పెట్టె నీదేకదా! తీసుకో!" అన్నాడు లక్ష్మి.

"కావలిస్తే ఉంచుకో" అన్నాడు సత్తిరాజులు.

"నీది నువ్వు తీసుకోరా! నాకెందుకు?" అన్నాడు. ఎదటివారి సొమ్ము తెల్లవారికి ప్రీతి! అవుతే అవుగాక; లక్ష్మికి మాత్రం అక్కర్లేదు అన్నట్టుగా ముఖం పెట్టేడు లక్ష్మి.

"ఉంచుకోరా"

"తీసుకోరా"

"ఉంచుకోరా"

"తీసుకోరా"

ఇలా కొంతసేపయేక ఆఖరికి బలవంతాన సత్తిరాజు వళ్ళో ఆ ఖాళీ సిగరెట్టు పెట్టె పడేసి సత్తిరాజులి భుజం మీద చెయ్యివేసి నడుస్తూ "మీ అమ్మ ఊర్నించొచ్చిందిరా?" అని అడిగేడు లక్ష్మి.

ఇంకా రాలేదన్నట్టు తల ఆడించేడు సత్తిరాజులు.

లక్ష్మికి సత్తిరాజులి తల్లంటే తగని భయం. ఆవిడ తిట్టగలదు; కొట్టగలదు; దేవుడైనా సరే తప్పుచేసేడంటే మాత్రం అతని ముఖం మీద పేణ్నీళ్ళు జల్లి విడిచిపెట్టగలదు. ఓసారి వాళ్ళింట్లోంచి నాలుగు ఊరుబిండి వడియాలు ఎత్తుకుపోయి సందు వారకి పోయి చప్పరించీసేడు లక్ష్మి. "ముప్పై వోడేల్లోనీ నాలుగు తక్కువొచ్చినాయంటే అందుక్కారణం ఆ "దొంగముకం లస్మిగాడే" నని ఆమె అతిసులువుగా గ్రహించి, " అలాటి సేద్దెబ్బ యెదవల్ని రానిచ్చావంటె సూసుకో!" అని కొడుకును హెచ్చరించి, "ఈ పాలి గుమ్మం తోక్కినావా. సేతులు కాళ్ళిరిచేసి నీళ్ళపొయ్యిల తోసీగల్నూ సూసుకో!" అంటూ లక్ష్మికి ఒక ప్రళయ భీకరమైన టెరిబుల్ వార్నింగి చ్చిందావిడ.

కొంతసేపూరుకొని, "మళ్ళీ ఎప్పుడొస్తుందిరా మీ అమ్మ?" అని విచారంగా అడిగేడు లక్ష్మి.

"మళ్ళొచ్చి అదోరం ఒస్తి" అన్నాడు సత్తిరాజులు.

"ఒరే సత్తీ!"

"కలెట్రాఫీస్ కెళ్ళీ కాయితాలేరుకొస్తావు కదరా నువ్వు?"

"అవున్రా....అక్కడ పెట్లు కూడా బలేగా దొరుకుతాయిరా ...కానీ శాన్దూరం" అన్నాడు సత్తిరాజులు.

"ఆ కాయితాలేం చేస్తావురా?"

"మా అమ్మ పొయ్యిల మంటెడద్దిరా"

"మరి మీ అమ్మ లేదుకదా!"

"అందుకే గూట్లో దాశాను."

"ఒరే! సత్తీ!"

"ఏంరా?"

"ఇవాళ మియాంగాడి బైస్కోపు కెల్దాంరా?"

"మాయప్ప తంతాది"

"మీ అమ్మ ఊళ్ళో లేదుకదరా!"

"మా యమ్మ తంతాది."

"మీ అప్పెక్కడుందిరా? మీ ఇంట్లోనే?"

"ఏరే ఉంది"

"ఒరే సత్తీ," అంటూ చాలా జాలిగా పిల్చేడు లక్ష్మి.

"ఏట్రా?"

"ఇప్పుడు కలెట్రాఫీసు కెళ్తే కాయితాలుంటాయిరా?"

"నిన్న దొక్కినన్ని తెస్పేసేన్రా, మిగతాయి యాళిక్కాలిపోయుంటాయి. సుట్టుసుట్టుకీ తగలెట్టేస్తా రాళ్ళు. మళ్లీ సుట్టుకి బెగేల్తే దొక్కుతాయి."
"అయితే ఒరే సత్తీ! నీ కాయితాల్నొక్కొంచెం ఇవ్వవురా?" అని దీనంగా అడిగేడు లక్ష్మి. అతని ముఖం చూస్తే అతను తీరని కష్టంలో ఉన్న వాళ్ళా ఉన్నాడు.
"అయినీకెందకరా?" అని ఆశ్చర్యపడ్డాడు సత్తిరాజులు.
"మా అమ్మ తెమ్మందిరా! నీళపొయ్యి కాగితాల్లేవందిరా? నే తెస్తాన్లే అమ్మా అని డాబు చేయిస్సేన్రా, మరిప్పుడు కలెట్రాఫీసుకెల్తే కాయితా లుండవుకదరా!"
"ఉహు! వుండవు"
"మరందుకేన్రా! ఈసారికి నీ కాయితాలివ్వరా. ఒచ్చేసారికి నేను సొంతంగ వెళ్లి ఏరుకొచ్చి నీకు మళ్ళీ యిచ్చేస్తాన్రా!"
సత్తిరాజులు మాటాళ్ళేదు.
"ఒరే సత్తిరాజులూ! ఇదేనంట్రా మన్నేస్తం!" అన్నాడు లక్ష్మి చాలా జాలిగా.
"మా యమ్మొచ్చేక తంతే!" అన్నాడు.
"మీ అమ్మకి తెలీదు కదరా!"
"ఒచ్చినాక కాయితాల్తెచ్చినావా? ఏమయి అనడుగుద్ది! అప్పుడు పొల్లుమాట అణ్ను"
"ఒరే సత్తీ!" అని పెద్ద వెలుగు వెలిగాడు లక్ష్మి. ప్రాణస్నేహితుణ్ని పెద్ద కష్టంలోంచి తప్పించడానికి అవకాశం దొరికిన వాళ్ళా చాలా సంతోషంగా ఉందతని ముఖం. సత్తిరాజులు మట్టుకు సత్తిరాజులేదో దీర్ఘంగా ఆలోచిస్తూ నడుస్తున్నాడు.
"ఒరే సత్తీ! మా అమ్మకి నీ కాయితాలిచ్చేసి... అణా అడిగి పట్టుకొస్తాను. నువ్వు కాయితాలు అణాకి మా అమ్మకీ అమ్మేసేనని చెబ్దువుగాని మీ అమ్మతో"..అని లక్ష్మి పూర్తి చెయ్యకుండానే సత్తిరాజులు అతన్తో "పోస్లేరా లస్మీ! కాయితాలొట్టుకుపోరా!"
"మీయమ్మకిస్తే మాయమ్మ ఏటన్దులేరా!" అన్నాడు.
సత్తిరాజులి భుజంమీంచి చెయ్యితీసేసి, ఎగిరి గెంతి, "నువ్వు మంచి వాడివిరా సత్తీ! నువ్వాడదైతే నిన్ను పెళ్ళాడేద్దున్రా!" అని సత్తిరాజులి బుగ్గ ముద్దాడి, "జుబేదాని మియంగాడిలాగే ముద్దాడతాడ్రా!"అన్నాడు లక్ష్మి.
"శే! ఏట్రా! అసియ్యంగాను! అందుకే మా యమ్మ .. బైస్కోప్ కెల్లనియ్దు" అన్నాడు సత్తిరాజులు చొక్కాచేత్తో బుగ్గ తుడిచేసుకుంటూ.
సత్తిరాజులిచ్చిన కాయితాలు పచ్చిపులుసు వాళ్ళ కొట్టుకు పట్టుకువెళ్లి పావలాకు అమ్మేసి, ఓ వాచీమార్కు సిగరెట్టు పెట్టే, కాణీ వర్రశనగలూ , కాణీ కరకజ్జం కొనుక్కొని మియాంగాడి బైస్కోపు చూడ్డానికి కోహినూర్ థియేటర్లో ఈలవేసి కూర్చున్నాడా సాయంకాలం లక్ష్మి.

రోజులు తిరిగిపోయేయి. ఏళ్ళు మారిపోయేయి; కాలం రంగులు మార్చుకొంది.

క్రీస్తుశకం 1962 వ సంవత్సరం జనవరి రెండో తారీఖు మధ్యాహ్నం పన్నెండు గంటలకి ముత్యాల పల్లకీలా మెరిసే అమెరికన్ కారొకటి ఎత్తుగాఉన్న ఓ బాంకు గుమ్మ దగ్గరికి బర్రునవచ్చి టక్కున ఆగింది. అందులోంచి ఛక్కున బైటకొచ్చిన జూనియర్ లక్ష్మీనాథరావుగారు బాంకు మెట్లు టకటకా ఎక్కిలోనికి వెళ్లేరు.

జూనియర్ లక్ష్మీనాథరావుగారు తన ఇరవయ్యొక్కటో యేట, మాంచి (సెకండ్ వరల్డ్ ) వార్ టైంలో కాంట్రాక్టు వ్యాపారంలోకి దూకి లక్ష్మీదేవిని చేపట్టేరు. కారు కొన్నారు. మేడలు కట్టించేరు. షేర్ మార్కెట్టు ఎక్కేరు. లారీలు నడిపిస్తున్నారు. బస్సులు నలుదిక్కులకీ పంపిస్తున్నారు. ఎమ్ పీ లనీ, ఎమ్మెల్యేలనీ నిలబెట్టిస్తున్నారు. ఆయన పెద్ద తమ్ముడు బొంబాయిలో బిజినెస్ చూస్తున్నాడు. ఆయన చినతమ్ముడు పార్లమెంటులో యంగ్ మెంబరుగా ఉంటున్నాడు. ఆయన చిరుతమ్ముడు అమెరికాలో ఏదో యూనివర్సిటిలో ఏవో పాతకాలపు భూతాల గురించి రీసెర్చి చేస్తున్నాడు. ఆయన పెద్దకుమారుడు టెక్నాలజీ ఆనర్స్ లో చేరేడు. ఆయన చిన్నకుమారుడు సైనిక్ స్కూల్లో ఉన్నాడు. జూనియర్ లక్ష్మీనాథరావు గారు జనవరి ఫస్టుని, నిన్ననే వారి కొత్తభవనం- “మోస్ట్ బ్యూటిఫుల్ అల్ట్రా మోడర్న్ బిల్డింగ్ విత్ ఆల్ ది లేటెస్ట్ గాడ్జెట్స్ అండ్ ది బెస్ట్ ఫారిన్ డిజైన్డ్ ఫర్నీచర్ యుఎవర్ సా!” చూస్తే కళ్ళు తిరిగిపోతాయి. ఏగదిలోంచి చూసినా డాల్ఫిన్స్ నోస్ –మన ఏరాడకొండ - వ్యూ కనిపిస్తుంది. “లవ్లీ అంటే లవ్లీ –“ అటువంటి దివ్యభవనంలో గృహప్రవేశం చేసేరు. అది ‘వారి అదృష్టం’ అని కొందరన్నారు. అంతటి అదృష్టం కలిసి రావడం వారి జాతక మహిమేనని శాస్త్రజ్ఞులన్నారు. ధైర్యం, సాహసం, చాకచక్యం ఉన్నవాళ్ళు – వ్యక్తి స్వాతంత్ర్యం గల మనదేశంలో – కుచేలురైనప్పటికీ ఎంత సులభంగా కుబేరులవగలరో చూడాలంటే “చూడండి మన లక్ష్మీనాథరావుగార్ని!” అని ఏడ్చుకొంటున్నారు. “తాతగారి పేరు పెట్టినందుకు వారిపేరు నిలబెట్టి తమపేరు నిలబెట్టుకున్నారు” అని తెలిసినవారంతా మెచ్చుకుంటున్నారు.

గూమాస్తాలు వెళ్ళడమే తప్ప ఎప్పుడోగాని లక్ష్మీనాథరావుగారు స్వయాన బాంక్ కి వెళ్ళరు. అందుచేత వారిని అక్కడంతా ఆశ్చర్యంగానూ, సంతోషంగానూ ఆహ్వానించి స్వాగతం పలికారు.

“క్యాష్ అయిందా?”

“ఎప్పుడో అయిందిసార్! పదుల్లో ఇమ్మంటారా? వందల్లోనా!” అని వినయమూ చిరునవ్వూ మిక్స్ చేసి అడిగేడు బాంక్ ఆఫీసర్.

“వందలే వందలే” అన్నారు లక్ష్మీనాథరావుగారు.

....అదీ కథ!


... .... ....

...కాని,

సర్! మేష్టారూ! అయ్యా! సత్తిరాజు లేఁవయేడు! ఎక్కడున్నాడు! ఏం చేస్తున్నాడు? ఉన్నాడా అసలతను? సార్! సత్తిరాజు లెక్కడున్నాడు? ఏ చిచ్చులో? ఏ చీకట్లో? ఏ పాడునూతిలో? ఏ కుళ్ళు కాలవలో? ఏ కీకారణ్యపుటిరికుల్లో? ఏ మహాసముద్రం మధ్యలో? ఎక్కడ మాష్టారూ ఎక్కడ? సత్తిరాజు లెక్కడున్నాడు?

***0***

# మరి శలవు



ఇంట్లో ఆనందంగా ఉండండి

కరోనాకి, అనవసరమైన కరోనా వార్తలకి

దూరంగా ఉండండి